అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శనివారం 05 -01-2019

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 5 సంచిక : 8 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 6.50

స్టార్టప్.. ప్యాకప్..!

82 శాతం కంపెనీలు ప్రయోజనాలకు దూరం



- పన్ను మినహాయింపు ఉన్నా ఐటీ నుంచి నోటీసులు
- మూసివేతే శరణ్యమంటున్న యాజమాన్యాలు



న్యూఢిల్లీ : కేంద్రం ఎంతో ఆర్భాటంగా తీసుకొచ్చిన స్టార్టప్ పథకం ప్యాకప్ దిశగా పయనిస్తోంది. 'స్టార్టప్ కంపెనీలు నెలకొల్పండి. దానికి కావాల్సిన తోడ్పాటును మేమందిస్తాం. అన్ని రకాల ప్రయోజనాలను చేకూరుస్తాం' అని మోడీ సర్కారు ఇచ్చిన మాటలు.. చేతల్లోకొచ్చేసరికి చతికిలబడ్డాయి. స్టార్టప్ పథకాన్ని 2016 జనవరిలో ప్రారంభించినా.. 82 శాతం కంపెనీలకు ఇప్పటివరకు ప్రయోజనాలు అందకపోవడం గమనార్హం. మోడీ సర్కారు తీరుతో దివాళా తీశామని, స్టార్టప్ కంపెనీలను మూసివేయడం తప్ప మరో గత్యంతరం లేదని 24 శాతం మంది యజమానులు తమ ఆవేదనను వెలిబుచ్చారు. సోషల్ మీడియా కేంద్రంగా పని చేస్తున్న 'లోకల్ సర్కిల్స్' సర్వేలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. లోకల్ సర్వీస్.. దాదాపు 15 వేల స్టార్టప్ కంపెనీలు, చిన్న మధ్య తరహా పరిశ్రమలపై సర్వే నిర్వహించింది. స్టార్టప్ కంపెనీలను ప్రారంభించే వారికి అనేక ప్రయోజనాలను ...9లో

రేపటి నుంచి 13 వరకు

కేసీఆర్ దుబాయ్ పర్యటన

ఇండస్ట్రియల్ సమ్మిట్‌లో పాల్గొనే అవకాశం

వివరాలు 9లో



కారులో సెట్టింగ్

పార్లమెంటు సెక్రెటరీలు 18 మంది..?

- సీనియర్లకు పెద్ద పీట
- రెండు, మూడుసార్లు గెలిచిన వారికి ప్రాధాన్యత
- సీఎం పరిశీలనలో పలువురి పేర్లు



పంచాయతీ ఎన్నికల తర్వాత మంత్రి వర్గ విస్తరణతోపాటు పార్లమెంటరీ కార్యదర్శులను నియమించాలని గులాబీ బాస్ కేసీఆర్ నిర్ణయించారు. మొత్తం 18 మంది ఎమ్మెల్యేలను పార్లమెంటరీ సెక్రెటరీలుగా నియమించాలని ఆయన యోచిస్తున్నట్టు తెలిసింది. సామాజిక సమీకరణాలు, జిల్లా రాజకీయాల కారణంగా మంత్రి పదవులు ఇవ్వలేని ఎమ్మెల్యేలను పార్లమెంటరీ కార్యదర్శుల పదవులతో సంతృప్తి పరచాలని సీఎం భావిస్తున్నట్టు టీఆర్ఎస్ భవన్‌లో వినిపిస్తున్నది.



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎన్నికల్లో గెలిచిన 88 మంది ఎమ్మెల్యేలకు అదనంగా మరో ఇద్దరు ఇండిపెండెట్లు గులాబీ గూటికి చేరడంతో అధికార పార్టీ ఎమ్మెల్యేల సంఖ్య 90కి చేరుకుంది. ఇద్దరు టీడీపీ సభ్యులు కూడా టీఆర్ఎస్ లో చేరే అవకాశం ఉండటంతో ఆ పార్టీ బలం 92 కు చేరుకోనుంది. ఇందులో మొత్తం 18 మందికి మాత్రమే మంత్రి పదవులు దక్కనున్నాయి. మండలి నుంచి మహమూద్ అలీ తోపాటు మరొకరికి మంత్రి పదవి ఇచ్చేందుకు కేసీఆర్ నిర్ణయించినట్టు సమాచారం. దీంతో ఎమ్మెల్యేల నుంచి 16 మందికే మంత్రి పదవులు దక్కనున్నాయి. అంటే కేసీఆర్‌ను మినహాయిస్తే మరో 15 మందికే అవకాశం ఉంటుంది. దీన్ని బట్టి 92 మంది ఎమ్మెల్యేల్లో పదహారు మందికి మంత్రి పదవులు దక్కితే మరో ...9లో

సీసం వున్న నూడుల్స్ తినాలా?

నెస్లేని నిలదీసిన బెంచ్

- మ్యాగీ కేసు విచారణపై స్టే ఎత్తివేసిన సుప్రీం

న్యూఢిల్లీ : మ్యాగీ నూడుల్స్‌కి సంబంధించి నెస్లే ఇండియాపై నమోదైన మూడేండ్ల నాటి కేసుపై 'స్టే'ను సుప్రీం కోర్టు ఎత్తివేసింది. అక్రమ వాణిజ్య పద్ధతులకు పాల్పడినందుకు, తప్పుడు లేబుల్స్ ముద్రించినందుకు, వాణిజ్య ప్రకటనల్లో తప్పు దారి ...9లో

నరకం అనుభవించాం

ఓవైపు పనిలేదు...మరోవైపు పాత నోట్లు చెల్లవు

- విద్యావైద్య అవసరాలు తీరక అప్పులపాలు
- తాజా అధ్యయనంలో నిర్మాణరంగ కార్మికుల అనుభవాలు



వివరాలు 9లో

"నిర్మాణరంగ కార్మికుల జీవితం నిత్యపోరాటం. రోజంతా కష్టపడితేనే ఇల్లు గడుస్తుంది. అలాంటివారిని నోట్లరద్దు నిర్ణయం కొట్టిన దెబ్బ అంతాఇంతా కాదు. మోడీ సర్కార్ పుణ్యమా అని..పనిపోయింది. పిల్లల చదువుకు, పెద్దవాళ్ల వైద్యం కోసం 'పెద్ద నోటు ఉన్నా' పనికిరాని పరిస్థితి... అది కలలో కూడా ఊహించని కష్టం

'డీమానిటైజేషన్ : ఫ్రమ్ డిప్రివేషన్ టు డెస్టినేషన్' పుస్తకంలో నిర్మాణరంగ కార్మికుల అనుభవాలు



నిరసనల నడుమ

శబరిమలలోకి మరో మహిళ

ధ్రువీకరించిన పోలీసులు

- దాడిచేస్తున్నా.. ఎత్తిన కెమెరా దించలేదు...



వివరాలు 2లో

ఏకగ్రీవానికి ఒత్తిడి వద్దు

పార్టీలకు అతీతంగా పంచాయతీ ఎన్నికలు

- పరిశీలకులదే తుది నిర్ణయం
- జీహెచ్‌ఎంసీ, మున్సిపల్ కార్పొరేషన్లలో "నో" కోడ్ : ఎస్ఈసీ నాగిరెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గ్రామ పంచాయతీలను ఏకగ్రీవం చేయడానికి పార్టీల నాయకులు ఒత్తిడి తేవద్దని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నాగిరెడ్డి అన్నారు. ఇలాంటి వాటిపై ఎన్నికల పరిశీలకులు నిఘా ఉంచాలని సూచించారు. గ్రామ ప్రజలంతా కోరుకుంటేనే ఏకగ్రీవానికి అనుమతించాలని సూచించారు. "కొత్తపంచాయతీ రాజ్ చట్టం 2018 ఎన్నికలు, విధానాలు అన్న ...9లో

ట్రక్కు గుర్తు వల్లే ఉత్తమ్ గెలుపు

ఫలితాలతో కాంగ్రెస్‌కు దిమ్మతిరిగింది : కేటీఆర్

- పది ఇండ్లకో కార్యకర్త ఉండాలి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ట్రక్కు గుర్తు వల్లే గెలిచారని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. ట్రక్కు, కారు గుర్తుల కు కలిపి అక్కడ 50 శాతం ఓట్లు వచ్చాయని తెలిపారు. అందువల్లే ఉత్తమ్ గెలుపొందారని చెప్పారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో చొప్పదండి, హుజూర్‌నగర్ నియోజకవర్గాల కార్యకర్తలతో కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...2014 శాసనసభ ఎన్నికల్లో నల్లగొండ జిల్లాలో ...9లో

కార్మికుల పోరాటానికి ఎర్రజెండా అండ

సార్వత్రిక సమ్మెకు వామపక్షాల మద్దతు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కార్మికసంఘాలు, ఉద్యోగ సంఘాల ఫెడరేషన్లు ఐక్యంగా ఈనెల 8,9 తేదీల్లో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు వామపక్ష పార్టీలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఈ సమ్మెను జయప్రదం చేయాలని ప్రజానీకానికి విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు తమ్మినేని వీరభద్రం (సీపీఐఎం), డివి కృష్ణ (సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ), తాండ్రకుమార్ (ఎంసీపీఐయూ), ఎస్ వెంకటేశ్వరరావు (సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ), మురహరి (ఎస్‌యూసీఐసీ), జానకి రాములు (ఆరెస్పీ), డి సురేందర్‌రెడ్డి (ఫార్వర్డ్‌బ్లాక్), స్వామిరావు (సీపీఐఎంఎల్ లిబరేషన్), బి వీరయ్య (సీపీఐఎంఎల్) సంయుక్తంగా శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం నాలుగున్నరేండ్లుగా ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని తెలిపారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా పలుమార్లు సమ్మెలు ...9లో



హక్కుల కోసం పోరాడితే అరెస్టులు

- ఆమ్నెస్టీ వీడియోలో నటుడు నసీరుద్దీన్ షా

న్యూఢిల్లీ: దేశంలో అసహనం పెరుగుతోందని ఇటీవలే వ్యాఖ్యానించిన దిగ్గజ నటుడు నసీరుద్దీన్ షా.. భావప్రకటన స్వేచ్ఛ, మానవ హక్కులపై అణచివేతను రాజ్యాంగం ఆమోదిస్తుందా? అని మరోసారి ప్రశ్నించారు. ఆమ్నెస్టీ ఇండియా విడుదల చేసిన ఓ వీడియోలో.. గతేడాది హక్కుల కార్యకర్తల అణచివేతకు పాల్పడిన ప్రభుత్వంపై ఆయన విమర్శలు సంధించారు. 'భారత పౌరులందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయంగా న్యాయం చేకూర్చేందుకు రాజ్యాంగ విలువలు హామీనిస్తున్నాయి. అందరినీ సమానంగా గుర్తించడం, ప్రతి ఒక్కరికి భావ ప్రకటన, ఆలోచనలు, నమ్మకాలు కలిగి ఉండే స్వేచ్ఛలను కల్పిస్తున్నాయి. అంటే న్యాయం, మానవ హక్కులకోసం, అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతున్నవారందరూ రాజ్యాంగ హక్కులను రక్షించేందుకే పూనుకున్నావారే. కానీ, నేడు ఎవరైతే హక్కుల కోసం పోరాడుతున్నారో వారిని జైళ్లలో బంధిస్తున్నారు. ఆర్టిస్టులు, కళాకారులు, స్కాలర్స్, కవులను అణివేతకు గురవుతున్నారు. పాత్రికేయుల నోళ్లు నొక్కబడుతున్నాయ'ని షా అన్నారు. సుధా భరద్వాజ్, అరుణ్ ఫరేరా, వెర్నన్ గొంజాల్వేజ్, వరవరరావు, గౌతం నవలఖాల అరెస్టులను ఆయన ఉటంకించారు. ఇంకా ఆయన మాట్లాడుతూ.. 'మతం పేరుతో ద్వేషపు గోడలు నిర్మిస్తున్నారు. అమాయకులు హత్యకు గురవుతున్నారు. దేశంలో ద్వేషం, క్రూరత్వాన్ని నింపేస్తున్నార'ని తెలిపారు. మన రాజ్యాంగం లక్ష్యం ఇదేనా? అని ప్రశ్నించారు.


వారి మీద బాంబులేస్తా..



- బీజేపీ ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు

లక్నో: దేశంలో అసహనం ఉందన్న వారి మీద బాంబులేస్తానని బీజేపీ ఎమ్మెల్యే ఒకరు వ్యాఖ్యానించారు. ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ జిల్లా ఖతోలి ఎమ్మెల్యేగా ఉన్న విక్రమ్ సైనీ ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఖతోలిలో శుక్రవారం జరిగిన ఓ కార్య క్రమంలో ఆయన మాట్లాడుతూ.. 'దేశంలో అసహనం ఉందన్న వారి మీద బాంబులెయ్యాలి. నాకు మంత్రి పదవి ఇచ్చి చూడండి. ఇలా మాట్లాడే వాళ్లెవరినీ వదలను. అందరి మీద బాంబులేస్తా.' అని అనుచిత వ్యాఖ్యలు చేశారు. అంతేగాక, ఈ దేశం సురక్షితం కాదన్న వారు దేశం విడిచి వెళ్లిపోవాలన్నారు. కాగా, గతనెలలో బాలీవుడ్ నటుడు నసీరుద్దీన్ షా బులంద్ షహర్ ఘటన గురించి మాట్లాడిన వ్యాఖ్యలకు కౌంటర్‌గానే విక్ర మ్ సైనీ పై విధంగా మాట్లాడారు. షా పేరును ప్రస్తావించకుండానే ఆయనపై విమర్శలు చేశారు. ఈ దేశంలో ఒక పౌరుడి ప్రాణం కంటే ఆవుకే ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారని గతనెలలో నసీరుద్దీన్ మాట్లాడిన విషయం విదితమే.

పాక్ చీఫ్ జస్టిస్ ప్రమాణస్వీకారానికి జస్టిస్ లోకూర్



న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు మాజీ జడ్జి జస్టిస్ మదన్ బి లోకూర్ ఈ నెల 18న పాకిస్థాన్ చీఫ్ జస్టిస్ అసీఫ్ సయీద్‌ఖాన్ ఖోసా ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరు కానున్నారు. ఖోసా లాహోర్ హైకోర్టు జడ్జిగా ఉన్నప్పటి నుంచీ తనకు తెలుసునని జస్టిస్ లోకూర్ తెలిపారు. న్యాయానికి సరిహద్దులు లేవంటూ జస్టిస్ లోకూర్ తన పాక్ పర్యటన గురించి సమర్థించుకున్నారు. న్యాయశాస్త్రంలో అధ్యయనం, స్పష్టత ఉన్న మంచి మనిషిగా ఖోసాను జస్టిస్ లోకూర్ కొనియాడారు. ఐదేండ్ల క్రితం పాకిస్థాన్ చీఫ్ జస్టిస్‌గా తస్సాదుఖ్‌హుస్సేన్ జిలానీ ప్రమాణస్వీకారానికి కూడా జస్టిస్ లోకూర్ హాజరయ్యారు. పాకిస్థాన్ రాజ్యాంగాన్ని ధిక్కరించిన ఆరోపణలతో ఆ దేశ మాజీ అధ్యక్షుడు పర్వేజ్ ముషారఫ్‌పై 2016,ఫిబ్రవరిలో రాజద్రోహం కేసులో విచారణ చేపట్టిన ముగ్గురు సభ్యుల ధర్మాసనానికి ఖోసా నేతృత్వం వహించారు.

21వేల పాఠశాలల్లో బాలికలకు టాయిలెట్లు లేవు : ప్రభుత్వం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 20,997 ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు టాయిలెట్లు లేవని పార్లమెంట్ గురువారం తెలిపింది. దీనికి సంబంధించి 2016-17 ఏడాది గణాంకాలను పార్లమెంట్ విడుదల చేసింది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు విద్యాహక్కు చట్టం-2009ని తప్పనిసరిగా పాటించాలి. ఈ చట్టం ప్రకారం ప్రతీ పాఠశాలలో బాల బాలికలకు వేరువేరుగా టాయిలెట్లు ఉండేలా చూసుకోవాలి. కాగా పాఠశాలల్లో టాయిలెట్లు, పారిశుధ్యానికి సంబంధించిన అంశాల్ని మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ(హెచ్‌ఆర్‌డీ) చూసుకుంటుంది. టాయిలెట్ల నిర్మాణం కోసం హెచ్‌ఆర్‌డీ శాఖ స్వచ్ఛ విద్యాలయా పథకాన్ని 2015లో తీసుకువచ్చింది. ఈ పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో టాయిలెట్లు, మౌలిక వసతులు కల్పించాలని నిర్ణయించారు. కానీ ఇప్పటికీ ఆ లక్ష్యం నెరవేరలేదని గణాంకాలు తెలుపుతున్నాయి. హెచ్‌ఆర్‌డీ, యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్(యూడీఐఎస్‌ఈ) 2016-17 సమాచారం ప్రకారం.. దేశంలో బాలికలకు టాయిలెట్లు లేని పాఠశాలలు 20,997 గా ఉన్నాయి. బాలుర టాయిలెట్లు లేని పాఠశాలలు 28,713 ఉన్నాయి.

ఈ నెల 10న విచారణ

- అయోధ్య కేసుపై షెడ్యూల్ ఖరారు : సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: అయోధ్యలోని రామజన్మభూమి-బాబ్రీ మసీదు భూవివాదం కేసు విచారణ ఈ నెల 10కి వాయిదా పడింది. ఈ కేసులో విచారణ తేదీలను తగిన ధర్మాసనం ఈ నెల 10న ప్రకటిస్తుందని చీఫ్ జస్టిస్ రంజన్‌గొగోయ్ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. ఈ కేసులో శుక్రవారం ఎలాంటి వాదనలు వినకుండానే చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణను వాయిదా వేసింది. ఈ కేసులో ఇరు పక్షాల తంపున హాజరైన న్యాయవాదులు హరీశ్‌సాల్వే, రాజీవ్‌ధావన్ తమ వాదనలు వినిపించేందుకు అవకాశం ఇవ్వకుండా కొన్ని సెకండ్లలోనే విచారణను వాయిదా వేస్తున్నట్టు చీఫ్ జస్టిస్ ప్రకటించారు. దాంతో, అయోధ్య భూవివాదంపై రోజువారీ విచారణ చేపడ్తారని భావించి కోర్టుహాల్‌కు పెద్ద సంఖ్యలో హాజరైన న్యాయవాదులు, జర్నలిస్టులు నిరాశతో వెనుదిరిగారు. ముగ్గురు సభ్యుల ధర్మాసనానికి ఈ కేసు విచారణ అప్పగించనున్నట్టు తెలుస్తోంది. దీనిపై ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాలన్న పిటిషన్‌ను సుప్రీంకోర్టు గతేడాది తిరస్కరించడం గమనార్హం.అయోధ్య వివాదంపై గతంలో దాఖలైన 4 పిటిషన్లపై అలహాబాద్ హైకోర్టు 2010 లో తీర్పు ఇచ్చింది. వివాదాస్పద స్థలం 2.77 ఎకరాలను సున్నీ వక్ఫ్‌బోర్డు, నిర్మోహి అఖారా, రామ్‌లల్లాలకు సమానంగా పంచాలని హైకోర్టు తన తీర్పులో పేర్కొన్నది. ఈ తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో 14 పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై తాజా విచారణ జరగనున్నది.

మూగబోనున్న ఆకాశవాణి నేషనల్ ఛానల్

- నిర్వహణ వ్యయం తగ్గింపులో భాగంగా మూసివేత
- మూత పడనున్న మరో 5 ప్రాంతీయ అకాడమీలు

న్యూఢిల్లీ : ఆకాశవాణి జాతీయ ఛానల్ ప్రసారాలు హేతుబద్ధీకరణ, నిర్వహణ వ్యయం తగ్గింపులో భాగంగా ఆల్ ఇండియా రేడియో (ఎఐఆర్) జాతీయ ఛానల్‌ను మూసివేయాలని ప్రభుత్వ రంగ ప్రసార సంస్థ ప్రసార భారతి నిర్ణయించింది. ఎఐఆర్ జాతీయ ఛానల్ మూసివేతకు సంబంధించి ఏడాది కాలంగా పలుమార్లు సంప్రదింపులు, చర్చలు జరిపిన అనంతరం తుది నిర్ణయం తీసుకున్నట్టు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ మేరకు ఆల్ ఇండియా రేడియో డైరెక్టర్ జనరల్ తరుపున గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రసార భారతి తన నిర్ణయాన్ని డిసెంబరు 24న ఎఐఆర్ డైరెక్టరేట్‌కు తెలిపింది.జాతీయ ఛానల్ మూసివేత నిర్ణయం ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉందని ప్రసార భారతి వర్గాలు వెల్లడించాయి. జాతీయ ఛానల్‌కు సంబంధించిన ట్రాన్స్‌మీటర్లు బలహీనంగా ఉండటం కూడా దాని మూసివేతకు ఒక కారణమని ఆయన చెప్పారు. నాగపూర్‌లో ఉన్న ఒకే ఒక ట్రాన్స్‌మీటరు ఒక మెగావాట్ సామర్థ్యాన్ని కలిగి ఉందన్నారు. కేవలం దీని ద్వారా మాత్రమే అత్యధిక మంది శ్రోతలు కార్యక్రమాలను వినలేరన్నారు. ప్రస్తుత డిజిటల్ రేడియో యుగంలో అటువంటి ఆ టెక్నాలజీ సరిపోదని ఆయన చెప్పారు. మంచి ట్రాన్స్‌మీటర్లను ఎందుకు ఉపయోగించలేదని అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ పటిష్టమైన శ్రోతల ప్రాతిపదిక లేని ఛానల్‌లో పెట్టుబడులు పెట్టడం సరైంది కాదని ప్రసార భారతికి చెందిన సీనియర్ నిర్వాహకులు భావించారని చెప్పారు.

కేరళలో బీజేపీ, కాంగ్రెస్ హింసకు నిరసనగా...

పార్లమెంట్‌లో వామపక్ష ఎంపీల ధర్నా

వాకౌట్ చేసిన సీపీఐ(ఎం), సీపీఐ

- పార్లమెంట్‌లో ఆందోళనకు యూడీఎఫ్ ఎంపీల యత్నం
- మందలించిన సోనియా, రాహుల్
- సుప్రీంకోర్టు తీర్పుపై బీజేపీ ద్వంద నీతి : కరుణాకరన్ ఆగ్రహం
- ఐద్వా, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ పార్లమెంట్ ముట్టడికి యత్నం
- అరెస్టు చేసిన ఢిల్లీ పోలీసులు

చర్చకు అనుమతించని వెంకయ్యనాయుడు



నవ తెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

కేరళలో బీజేపీ, కాంగ్రెస్ హింసను ప్రేరేపిస్తున్నాయని, భీతావాహ వాతావరణం సృష్టిస్తున్నాయని సీపీఐ(ఎం), సీపీఐ పార్లమెంట్ సభ్యులు ధ్వజమెత్తారు. శబరిమలైలో జరిగిన హింసాపూరిత విధ్వంసాన్ని నిరసిస్తూ శుక్రవారం పార్లమెంట్ ఆవరణలో వామపక్ష ఎంపీలు ఆందోళన చేపట్టారు. "బీజేపీ, కాంగ్రెస్ గూండాయిజం నశించాలి. మహిళ వ్యతిరేకి సర్కార్ డౌన్ డౌన్. మహిళల పట్ల లింగ వివక్ష విడనాడాలి. మహిళల హక్కులు కాపాడాలి" అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) ఎంపీ ఎంబీ రాజేష్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ పార్టీలు మహిళల పట్ల వివక్షత చూపుతున్నాయని విమర్శించారు. మహిళల హక్కులను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానికి లేదా? ప్రధాన ప్రతిపక్షానికి లేదా? అని నిలదీశారు. ఇరు పార్టీలు కలిసి మహిళలకు వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహించడం దారుణమన్నారు. మహిళలు దేవాలయాల్లోకి వెళ్లకూడదనే బీజేపీ, కాంగ్రెస్‌లు కేంద్రంలో అధికార, ప్రధాన ప్రతిపక్షాలుగా ఉండటం ఈ దేశ ప్రజల దురదృష్టమని అన్నారు. భయానక వాతావరణాన్ని సృష్టించారని, మహిళలకు రక్షణగా నిలిచిన రాష్ట్ర ప్రభుత్వంపై కుట్రలు చేస్తోన్నారని విమర్శించారు. బీజేపీ, కాంగ్రెస్ కుట్రలను కేరళ ప్రజలు తిప్పికొడతారని, అందులో భాగంగానే 55 లక్షలకు పైగా మహిళలు మానవహారం నిర్వహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వామపక్ష ఎంపీలు పీ కరుణాకరన్, టీకే రంగరాజన్, ఎల్లమరం కరీం, కేకే రాగేష్, జర్నాదాస్ బైద్య, కె.సోంప్రసాద్, జితిన్ చౌదరి, శంకర్ ప్రసాద్ దత్త, ఎండి బదృద్దోజాఖాన్, బినోయ్ విశ్వం తదితరులు పాల్గొన్నారు.

రాజ్యసభలో వామపక్ష ఎంపీల వాకౌట్

గురువారం కేరళలో బీజేపీ, కాంగ్రెస్ సృష్టించిన హింసపై చర్చించాలని శుక్రవారం రాజ్యసభలో సీపీఐ(ఎం) ఎంపీ కెకె రాగేష్ ఛైర్మన్‌కు నోటీసులిచ్చారు. రూల్ 267 కింద కేరళలో చెలరేగిన హింసపై చర్చించాలని వెంకయ్యనాయుడిని కోరారు. అయితే చర్చకు వెంకయ్య నిరాకరించి, వాయిదా తీర్మానం నోటీసులను తిరస్కరించారు. ఛైర్మన్ వైఖరిని నిరసిస్తూ సీపీఐ(ఎం), సీపీఐ ఎంపీలు వాకౌట్ చేశారు. దేశ రాజధానిలో కేరళ భవన్ వద్ద కవరేజ్‌కి వచ్చిన జర్నలిస్టులపై ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు దాడి చేశారని నోటీసులో పేర్కొన్నారు.

ఆ ఇరు పార్టీలవీ కపట నీతే: కరుణాకరన్

శబరిమల ఆలయంలోకి మహిళలను అనుమతిస్తూ ఇచ్చిన సుప్రీంకోర్టు తీర్పు విషయంలో కాంగ్రెస్, బీజేపీ కపట నీతిని ప్రదర్శిస్తున్నాయని సీపీఐ(ఎం) లోక్‌సభ పక్షనేత పి.కరుణాకరన్ విమర్శించారు. శుక్రవారం లోక్‌సభలోని జీరో అవర్‌లో కేరళలో జరిగిన హింసను లేవనెత్తారు. శబరిమల ఆలయంలోకి మహిళలను అనుమతిస్తూ సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు ఇచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారిక వెబ్‌సైట్‌లో కూడా "చారిత్రాత్మక తీర్పు"అని పేర్కొన్నారని అన్నారు. మహిళల హక్కులకు సంబంధించిన ఈ తీర్పు చారిత్రాత్మకమైనదని, భారత రాజ్యాంగం ప్రకారం ప్రతి పౌరుడికి ఆలయాల్లోకి, ఇతర వాటిల్లోకి వెళ్లే హక్కు ఉందని చెప్పారు. కేంద్ర మంత్రులు ఉమా భారతి, మేనకా గాంధీ, బీజేపీ ఎంపీ సుబ్రమణ్యస్వామి, కాంగ్రెస్ నేతలు సుప్రీం కోర్టు తీర్పును స్వాగతించారని గుర్తు చేశారు. ఆలయంలోకి వెళ్లడం మహిళలందరి హక్కుగా ఇచ్చిన సుప్రీంకోర్టు తీర్పుపై తన వైఖరిని కాంగ్రెస్ అధిష్టానం బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. కేరళ ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పును అమలు చేస్తోందని, కేరళ సర్కారు, ముఖ్యమంత్రికి మరొక దారి లేదని అన్నారు. అయితే దేశ చరిత్రలో 55 లక్షల మంది మహిళలు కాసర్‌గడ్ నుంచి తిరువనంతపురం వరకు చేసిన మానవహారం విజయవంతం కావడంతో, ఆ అసూయతోనే బీజేపీ, ఆరెస్సెస్‌లు కేరళలో హింసకు పాల్పడ్డాయని విమర్శించారు. సీపీఐ(ఎం), సీపీఐ కార్యాలయాలు, జర్నలిస్టులపైన దాడి జరిగిందని తెలిపారు.

కేరళ కాంగ్రెస్ ఎంపీలకు సోనియా, రాహుల్ క్లాస్

కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ ఎంపీలకు యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీలు క్లాస్ పీకారు. శబరిమల ఆలయంలోకి ఇద్దరు మహిళలు ప్రవేశాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ ఎంపీలు "బ్లాక్ డే" నిర్వహించాలని లోక్‌సభలో నల్ల రిబ్బన్‌లు కట్టుకునేందుకు ప్రత్నించారు. దీంతో నల్లరిబ్బన్‌లు పంచుతున్న కాంగ్రెస్ ఎంపీని పిలిచి సోనియా గాంధీ మందలించారు. మహిళల హక్కులు, లింగ సమానత్వానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, పార్టీకి విరుద్ధంగా చేస్తే బాగోదని సదరు ఎంపీని హెచ్చరించారు. ఏదైనా ఉంటే కేరళలో అక్కడి రాజకీయ అవసరాల కోసం చేసుకోవాలని, ఇక్కడ మాత్రం చేయొద్దు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు యూడీఎఫ్ ఎంపీలంతా ప్రధానమంత్రిని కలిసి, సుప్రీంకోర్టు తీర్పుపై ఆర్డినెన్స్ తీసుకురావాలని అభ్యర్థించేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న రాహుల్ గాంధీ యూడీఎఫ్ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శబరిమల అంశంపై ప్రధానిని కలవొద్దని ఆదేశించారు. దీంతో తమ ఆలోచనను యూడీఎఫ్ ఎంపీలు ఉపసంహరించుకున్నారు.

పార్లమెంట్ ముట్టడికి యత్నం

కేరళలో బీజేపీ, ఆరెస్సెస్ నేతృత్వంలో చెలరేగిన హింసను నిరసిస్తూ ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సంఘాలు పార్లమెంట్ ముట్టడికి యత్నించాయి. అయితే ఆందోళనకారులను పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. శుక్రవారం పార్లమెంట్ వైపుగా ర్యాలీగా వెళ్తున్న ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నేతలను రైల్ భవన్ వద్ద పోలీసులు అడ్డుకొన్నారు. ఈ సందర్భంగా పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో పోలీసులు ఆందోళనకారులను అరెస్టు చేసి స్థానిక మందిర్‌మార్గ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో ఐద్వా ప్రధాన కార్యదర్శి మరియం దావలే, ఐద్వా ఢిల్లీ అధ్యక్ష, కార్యదర్శులు మెమునా మొల్లా, ఆశశర్మలతో పాటు 50 మంది ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నేతలున్నారు. ఢిల్లీలోని కేరళభవన్ వద్ద గురువారం రాత్రి సంఘపరివార్ గుండాలు జర్నలిస్టులపై దాడి చేయడాన్ని ఖండిస్తూ ఢిల్లీ జర్నలిస్టు యూనియన్ ఆధ్వర్యంలో కేరళ భవన్ వద్ద జర్నలిస్టులు నిరసన తెలిపారు.

'శబరిమల'లోకి మరో మహిళ

ధ్రువీకరించిన పోలీసులు



పంబ : కేరళలో హిందూత్వ శక్తుల నిరసనల నడుమ అయ్యప్ప ఆలయంలోకి మరో మహిళ వెళ్ళి స్వామి దర్శనం చేసుకుంది. శ్రీలంకకు చెందిన శశికళ (46) ఆలయంలోకి వెళ్ళినట్టు పోలీసులు ధ్రువీకరించారు. అన్ని వయసులవారినీ అనుమతిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అనంతరం ఆలయంలోకి అడుగుపెట్టిన 50 ఏండ్లలోపువారిలో శశికళ మూడో మహిళగా రికార్డు నెలకొల్పారు. తలమీద ఇరుముడి కట్టు పెట్టుకొని ఆమె ఆలయంలోకి వెళుతున్న సీసీటీవీ ఫుటేజ్‌ను పోలీసులు విడుదల చేశారు. ఆలయం వద్ద పవిత్రంగా భావించే 18 మెట్ల వద్ద తనను నిలిపివేశారని, పోలీసులు లోనికి వెళ్ళనివ్వలేదని తొలుత ఆమె ప్రకటించింది. 'నేను దర్శనం చేసుకోలేదు. యూట్రస్ తొలగించినట్టు నా వద్ద మెడికల్ సర్టిఫికెట్లు కూడా ఉన్నాయి. అవి చూపించినా వాళ్ళు నన్ను లోపలికి వెళ్ళనివ్వలేదు' అని ఆమె తెలిపారు. భయంతోనే ఆమె లోనికి వెళ్ళలేదని చెబుతున్నట్టు తెలుస్తున్నది.

కొనసాగుతున్న ఆందోళనలు

రాష్ట్రంలో శబరిమల కర్మ సమితి ఆందోళనలను కొనసాగిస్తున్నది. సీపీఐ(ఎం) నేతృత్వంలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలను మరింత పెంచాలని హిందూత్వ సంస్థలు నిర్ణయించాయి. కాగా, ముందుజాగ్రత్త చర్యగా పోలీసులు శబరిమల చుట్టుపక్కల ప్రాంతాల్లో 144వ సెక్షన్ విధించారు. అలాగే నెడుమంగడ్, వలియమల పోలీస్టేషన్ల పరిధిలోనూ మూడు రోజులు నిషేధాజ్ఞలు కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.

శుద్ధి కార్యక్రమంపై వివరణ కోరిన టీడీబీ


మహిళల ఆలయ ప్రవేశం తర్వాత శుద్ధి కార్యక్రమం చేపట్టిన కంతరారు రాజీవు నుంచి వివరణ కోరాలని ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డ్ (టీడీబీ) నిర్ణయించింది. 'సుప్రీంకోర్టు ఆదేశాలకు శుద్ధీకరణ పూజ వ్యతిరేకం. అందుకే ఆయనను వివరణ కోరాలని నిర్ణయించాం. ఆయన వివరణ తర్వాత తదుపరి చర్యపై నిర్ణయం తీసుకుంటాం' అని సీపీఐ(ఎం) మాజీ ఎమ్మెల్యే, టీడీబీ అధ్యక్షులు పద్మకుమార్ చెప్పారు.

నిరసనలతో బీజేపీ, ఆర్ఎస్ఎస్ 'సర్జికల్ స్ట్రైక్' : అగ్నివేశ్



శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశాన్ని నిరసిస్తూ హింసాత్మకదాడులకు పాల్పడుతున్న బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై సామాజిక కార్యకర్త స్వామి అగ్నివేశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. నిరసనల పేరుతో హిందూత్వశక్తులు రాష్ట్రంలో 'సర్జికల్ స్ట్రైక్'కు పాల్పడుతున్నారని విమర్శించారు. ఆలయంలోకి వెళ్ళి చరిత్ర సృష్టించిన బిందు, కనకదుర్గలను ఆయన అభినందించారు. దేశంలో అణచివేతకు గురవుతున్న మహిళల విముక్తి, సాధికారత అంశాన్ని వారు మరోసారి ముందుకుతెచ్చారని అన్నారు. సంఘ్ పౌర జీవితంపై మాత్రమేకాక, ప్రజల ప్రజాస్వామ్య హక్కులపై కూడా యుద్ధం ప్రకటించిందని ఆయన తెలిపారు. సంఘ్ దళాల ఈ రకమైన హింసాకాండ ఒక్క కేరళకే పరిమితం కాలేదనీ విమర్శించారు. ప్రధాని నరేంద్రమోడీ, బీజేపీ అధినేత అమిత్‌షాల రాజకీయ ముసుగు తొలగిందని చెప్పారు. వారి ఎజెండా క్రూరమైన ఆధిపత్యం.. అభివృద్ధి దానికి ఎరగా మారిందని అగ్నివేశ్ ఆరోపించారు.

సీఎంకు సెక్యూరిటీ పెంపు



నిరసనల నేపథ్యంలో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు పోలీసులు భద్రతను పెంచనున్నారు. విజయన్‌కు 'జడ్ ప్లస్' క్యాటగిరీ కల్పిస్తున్నామనీ, అందులో మరికొన్ని అదనపు జాగ్రత్త చర్యలను తీసుకుంటామని ఇంటెలిజెన్స్ వింగ్ పోలీస్ చీఫ్ టికె వినోద్‌కుమార్ చెప్పారు.

దాడిచేస్తున్నా..

ఎత్తిన కెమెరా దించలేదు..



తిరువనంతపురం: 'శబరిమల' నిరస నకారులు ఆమెను లక్ష్యంగా చేసుకొని అసభ్యవ్యాఖ్యలతో దాడి చేస్తుంటే... ఆమె కెమెరాను మాత్రం వదలలేదు. బాధతో కన్నీటి ధారలు కారుతున్నా.. ఎత్తిన కెమెరాను దించలేదు.. కన్నీటితోనే హిందూత్వశక్తుల దాడి ఘటనను చిత్రీకరిస్తున్న ఆమె ఫొటో సామాజిక మాధ్యమంలో వైరలయ్యింది. ఆమే కైరెలి టీవీ కెమెరామెన్ షాజిల అబ్దుల్ రహమాన్. ఆమె కెమెరాను లాక్కునేందుకు కూడా ఆందోళనకారులు ప్రయత్నించారు. అన్నింటినీ ఎదుర్కొంటూనే విధి నిర్వహణను పూర్తిచేశారు. తిరువనంతపురంలో బుధవారం ఈ ఘటన జరిగింది. ప్రస్తుతం ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నది. 'భయంతో నా కండ్లవెంట నీరు రాలేదు. నిస్సహాయతే అందుకు కారణం' అని షాజిల చెప్పారు. 'ఐదారుగురు వ్యక్తులు వెనక నుంచి వచ్చారు. నా కెమెరాను లాక్కునేందుకు ప్రయత్నించారు. నన్ను కొట్టారు. కిందికి పడేశారు. నేను ఎలా ప్రతిఘటించగలను? కెమెరా లాక్కుంటే.. చేసిన కష్టమంతా వృధా అవుతుందని భయపడ్డాను. వారి దుర్మార్గ చర్యలను చిత్రీకరించలేమోనన్న ఆందోళనకు గురయ్యాను. అందుకే కండ్లవెంట నీరు వచ్చాయి. కెమెరాను వెనక్కి తీసుకున్న తర్వాత.. బ్యాటరీలు వేశాను.. వీడియో తీయడం మొదలుపెట్టాను. నా బాధను ప్రజలకు చూపించకూడదనే.. కెమెరాతో నా మొఖం దాచుకునేందుకు ప్రయత్నించాను' అని షాజిల చెప్పారు. ఆమె ఫొటో వైరల్ అవడంతో సామాజిక మాధ్యమంలో షాజిలాకు ప్రశంసల జల్లుకురుస్తున్నది. ఆమె ధైర్యసాహసాలను, వృత్తిపట్ల నిబద్ధతను కొనియాడుతున్నారు. రాష్ట్రంలో పలుచోట్ల మీడియా సిబ్బందిపై కూడా హిందూత్వశక్తులు దాడికి పాల్పడినట్టు వార్తలొచ్చిన విషయం తెలిసిందే.

అనిల్ అంబానీని

అరెస్టు చేయండి

- సుప్రీంకోర్టులో ఎరిక్సన్ 'ధిక్కరణ పిటిషన్'
- దేశం విడిచి వెళ్లకుండా చూడాలని అభ్యర్థన

న్యూఢిల్లీ : బకాయిల చెల్లింపుల విషయంలో కోర్టు ఆదేశాలను ధిక్కరించిన రిలయన్స్ కమ్యూనికేషన్స్(ఆర్‌కామ్) ఛైర్మెన్ అనిల్ అంబానీని అరెస్టు చేయాలంటూ టెలికం పరికరాల తయారీ సంస్థ ఎరిక్సన్.. భారత సర్వోన్నత న్యాయస్థానంలో గురువారం పిటిషన్ వేసింది. అంతేకాక అనిల్ అంబానీ.. దేశాన్ని విడిచి పోకుండా చూడాలని ఎరిక్సన్ తన పిటిషన్‌లో పేర్కొన్నది. మరోవైపు.. అనిల్ అంబానీ కూడా టెలీ కమ్యూనికేషన్ డిపార్ట్‌మెంట్(డీఓటీ)కు వ్యతిరేకంగా పిటిషన్ దాఖలు చేశారు. రిలయన్స్ కమ్యూనికేషన్‌ను జియోకు అమ్మేందుకు డీఓటీ నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇవ్వలేదని, దీని కారణంగానే ఎరిక్సన్‌కు బకాయిల చెల్లింపులో ఆలస్యం జరిగిందని పేర్కొన్నది. కాగా.. ఈ రెండు పిటిషన్లపై సోమవారం విచారణ చేపట్టనున్నట్టు సుప్రీంకోర్టు వెల్లడించింది.

ఎరిక్సన్‌కు బాకీ ఉన్న రూ.550 కోట్లను సెప్టెంబర్ 30 లోగా చెల్లించాలని సుప్రీంకోర్టు గతేడాది ఆగస్టులో తొలుత ఆదేశించింది. కాగా.. గడువు ముగిసినా బకాయిలు చెల్లించకపోవడంతో సుప్రీంకోర్టులో ఎరిక్సన్ గతేడాది అక్టోబర్‌లో కోర్టు ధిక్కరణ పిటిషన్ వేసింది. కాగా.. డిసెంబర్ 15 వరకు బకాయి చెల్లించేందుకు ఆర్‌కామ్‌కు సుప్రీంకోర్టు అనుమతినిచ్చింది. ఈ గడువు కూడా ముగియడంతో ఎరిక్సన్ తాజాగా రెండో ధిక్కరణ పిటిషన్ వేసింది. తమకు బకాయి ఉన్న రూ.550 కోట్లను చెల్లిస్తానని సుప్రీంకోర్టుకు ఆర్‌కామ్ రాసి ఇచ్చిన హామీ పత్రాన్ని ఎరిక్సన్ ఈ సందర్భంగా ప్రస్తావించింది. బకాయిలను వడ్డీతో సహా చెల్లించాలని కోరడంతో పాటు ఆర్‌కామ్ ఆస్తుల అమ్మకంపై స్టే విధించాలని తన పిటిషన్‌లో పేర్కొన్నది.

ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందే

మాట మార్చిన బీజేపీకి బుద్ధి చెప్పాలని పిలుపు

జంతర్‌మంతర్ ధర్నాలో సీతారాం ఏచూరి



నవ తెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో:

ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి డిమాండ్ చేశారు. హోదాతోనే రాష్ట్రానికి న్యాయం జరుగుతుందని ఉద్ఘాటించారు. శుక్రవారం ప్రత్యేక హోదా సాధన కమిటీ ఆధ్వర్యంలో రెండో రోజు జరిగిన ధర్నాకు ఏచూరి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏపీ విభజన బిల్లు పార్లమెంట్‌లో చర్చ జరిగిన సందర్భంగా తాను రాజ్యసభలో అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను నిలదీసినట్టు ఏచూరి గుర్తు చేశారు. విజభన నష్టంతో తమ ప్రభుత్వం ఏపీకి ఐదు సంవత్సరాల పాటు ప్రత్యేక హోదా ఇస్తామని మన్మోహన్ తనకు హామీనిచ్చినట్టు చెప్పారు. అయితే, అందుకు బదులుగా బీజేపీ నేత వెంకయ్యానాయుడు తమ ప్రభుత్వం రాబోతుందని... రాష్ట్రానికి పదేండ్ల పాటు హోదా కల్పిస్తామని చెప్పారన్నారు. ప్రస్తుతం మోడీ మాత్రం మాట మార్చి కేంద్రం ప్రకటించిన ప్యాకేజీ డబ్బులు కూడా పూర్తిగా ఇవ్వలేదని అన్నారు. తెలుగు ప్రజలకు బీజేపీ ప్రభుత్వం పూర్తిగా అన్యాయం చేసిందన్నారు. సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా బీజేపీ ప్రభుత్వం నెరవేర్చలేకపోయిందన్నారు. ప్రత్యేక హోదా ఇస్తే ఇతర రాష్ట్రాలు కూడా డిమాండ్ చేస్తాయని కేంద్రం చెప్పడం ఆశ్చర్యకరమని అన్నారు. ఇతర రాష్ట్రాలను ఈ విధంగా విభజించలేదని ఆయన గుర్తు చేశారు. సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ... దేశంలో మోడీ అంతా అబద్ధాలు ఎవరూ మాట్లాడరని... ఏ విషయం మాట్లాడినా అబద్ధమే చెబుతారని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా వచ్చేంతవరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. సీపీఐ రాజ్యసభ సభ్యుడు బినయ్ విశ్వం మాట్లాడుతూ హోదా కోసం పార్లమెంట్‌లో పోరాటం చేస్తామని హామీనిచ్చారు. సీపీఐ(ఎం) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి పి మధు మాట్లాడుతూ... ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చేదాకా కేంద్రంపై పార్లమెంట్‌తోపాటు, ఉద్యమాల రూపేణా ఒత్తిడి తీసుకువస్తామన్నారు. సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ... తమ పోరాట స్ఫూర్తి ఏంటో మోడీ చూపించేందుకే ఢిల్లీకి వచ్చినట్టు తెలిపారు. ప్రత్యేక హెూదా సాధన సమితి నాయకులు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ... ప్యాకేజీలు తమ రాష్ట్రానికి న్యాయం చేయవని... హెూదానే ఇవ్వాలని డిమాండ్ చేశారు. . ప్రత్యేక హెూదా సాధన సమితి నేతలు రామకృష్ణ, చలసాని శ్రీనివాస్, సీపీఐ రాజ్యసభ సభ్యులు డీ.రాజా నేతృత్వంలో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీని కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు వినతి అందజేశారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరారు.

గో రక్షకుల కుట్రపూరిత దాడులు !

మాంసం నమూనాల్లో 'ఆవు'ది 7 శాతమే..

- శాంపిళ్ల డీఎన్‌యే పరీక్షలో వెల్లడి
- గో దాడుల్లో 33 అమాయకుల మృతి

న్యూఢిల్లీ : కేంద్రంలో మోడీ సర్కారు అధికారంలో కొచ్చాక గో రక్షకుల ఆగడాలకు రెక్కలొచ్చాయి. బీజేపీ ప్రభుత్వం అండతో రెచ్చిపోయి దాడులకు తెగబడుతున్నారు. గో మాంసం కలిగి ఉన్నారంటూ, ఆవులను వధించడానికి తరలిస్తున్నారంటూ 33మంది అమాయకులను కొట్టి చంపారు. బీఫ్ అనుమానంతో హైదరాబాద్ రీసెర్చ్ సెంటర్‌కు పంపించిన నమూనాల్లో 7 శాతమే ఆవు మాంసమని తేలింది. దేశవ్యాప్తంగా జరిగిన గో దాడులన్నీ కుట్రపూరితంగా, అధికారం అండతో జరిగాయనడానికి ఇదే నిదర్శనం. 'ఇండియాస్పెండ్' డేటా ప్రకారం.. 2012 నుంచి ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 88 గో దాడుల ఘటనలు జరిగాయి. వీటిలో 86 ఘటనలు మోడీ ప్రభుత్వ హయాంలోనే జరగడం గమనార్హం. కాగా.. ఆవు మాంసమన్న అనుమానంతో పోలీసులు 122 శాంపిళ్లను సీజ్ చేసి హైదరాబాద్‌లోని జాతీయ మాంసం పరిశోధనా కేంద్రానికి పంపించారు. కాగా.. డీఎన్‌యే పరీక్షలు నిర్వహించగా..వీటిలో 8 శాంపిళ్లు మాత్రమే(7 శాతం) ఆవు మాంసమని తేలడం గమనార్హం. గో దాడుల్లో 2017లోనే 11 మంది ముస్లింలు హత్యకు గురయ్యారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గోరక్షకుల చేతిలో హత్యకు గురైన వారిలో 56 శాతం మంది ముస్లింలు, 11 శాతంమంది దళితులు ఉండటంపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. ముస్లింలు, దళితులే లక్ష్యంగా గో రక్షకులు దాడులకు తెగబడుతున్నారన్న విమర్శలూ వెల్లువెత్తుతు న్నాయి. గో దాడులపై సుప్రీంకోర్టు సైతం ఆందోళన వ్యక్తం చేసింది. గతేడాది ఆగస్టులో సర్వోన్నత న్యాయస్థానం ఈ విషయంపైవిచారణ చేపట్టి.. గో రక్షకుల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు నూతన మార్గదర్శకాలు తీసుకురావా లని కేంద్రాన్ని ఆదేశించింది.

టీఎస్‌పీఎస్సీ పనితీరుపై గవర్నర్ సంతృప్తి

- నరసింహన్‌ను కలిసిన ఘంటా చక్రపాణి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) పనితీరుపై గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ సంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో నరసింహన్ టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ ఘంటా చక్రపాణి నేతృత్వంలో ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపింది. గతేడాది ప్రగతికి సంబంధించిన నివేదికను గవర్నర్‌కు అందజేసింది. అనంతరం చక్రపాణి ఓ ప్రకటన విడుదల చేశారు. టీఎస్‌పీఎస్సీ ఆవిర్భవించిన నాలుగేండ్ల కాలంలో సాధించిన ప్రగతిని గవర్నర్‌కు నివేదించామని తెలిపారు. ఈ నాలుగేండ్లలో 38,059 పోస్టుల భర్తీకి 101 నోటిఫికేషన్లు జారీ చేశామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 17,038 కొలువులు ఇచ్చామని తెలిపారు. మరో 13,775 పోస్టుల భర్తీకి మెరిట్ జాబితా ప్రకటిం చామని పేర్కొన్నారు. తుది జాబితా ప్రకటించాల్సి ఉందని తెలిపారు. ప్రస్తుతం వివిధ పోస్టుల భర్తీ ప్రక్రియలో టీఎస్‌పీఎస్సీ ఉందని పేర్కొన్నారు. తమ పని తీరును గవర్నర్ సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. తక్కువ మంది సిబ్బంది ఉన్నా పని బాగా జరుగుతోందని కితాబిచ్చారని పేర్కొన్నారు. ఈ ఏడాదిలోనూ మరింత ప్రగతి సాధించాలని ఆకాంక్షించారని తెలిపారు. గవర్నర్‌ను కలిసిన వారి లో టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎ వాణీప్రసాద్, సభ్యులు సి విఠల్, బి చంద్రావతి, మహమ్మద్ మతీనుద్దీన్ ఖాద్రీ, కె రామ్మోహన్‌రెడ్డి, సిహెచ్ సాయిలు, తదితరులున్నారు.

సంపాదకీయం

కులనాగు!



తెలంగాణలో రోజు రోజుకూ కుల దురహంకారం పెట్రేగిపోతోంది. కన్న తండ్రులు, తోబుట్టినవారే పరువు పేరుతో పచ్చి హంతకులుగా మారిపోతున్నారు. రక్త బంధాలకన్నా కుల సంబంధాలకే అధిక విలువనిచ్చి తమ బిడ్డలను పరమ కిరాతకంగా బలిగొంటున్నారు. ఇటీవల మంచిర్యాల జిల్లా జిన్నారం మండలం కలమడుగు గ్రామంలో అనురాధ అనే అమ్మాయి తమ కన్నా తక్కువ కులం అబ్బాయిని ప్రేమించి పెండ్లి చేసుకున్నదనే కసితో ఆమె తండ్రి, అన్నలు ఆమెను కొట్టి చంపేశారు. అంతటితో ఆగకుండా శవం ఆచూకీ కూడా దొరకకుండా కాల్చి బూడిద చేసేశారు. హైదరాబాద్ మహానగర శివారులోని అల్వాల్‌లో తమ చెల్లి అశ్విని కులాంతర వివాహం చేసుకున్నదన్న కోపంలో ఆమెను పెండ్లాడిన నందకిషోర్ అనే యువకుడిని దారుణంగా హతమార్చారు. వీరి వివాహం జరిగి నాలుగేండ్లు గడచి, ఆమెకొక కుమారుడు కలిగిన తరువాత కూడా కసి చల్లారక హత్యకు పాల్పడడం భయంగొలిపే విషయం.

కులం మనుషుల మధ్య విద్వేషాన్ని రెచ్చగొట్టి రక్త బంధాలను సైతం నెత్తుటేరుల్లో ముంచుతోంది. ఈ స్థితిలో కుల సమానత్వ చైతన్యంతో కూడిన సంఘటి తత్వం మాత్రమే ఈ హింసను ఆపగలదు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారసత్వం కలిగిన ఈ తెలంగాణ సమాజం కుల దురహంకారాన్ని పాతరేసి తన విశిష్టతను నిలుపుకుంటుం దని ఆశిద్దాం!

ఇలాంటి కుల దురహంకారం ప్రేమలు, పెండ్లిళ్లలోనే కాదు ఇంకా అనేక రూపాలలో మన రాష్ట్రంలో పెచ్చరిల్లుతోంది. నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం మారంపల్లి గ్రామంలో దళితులు అంబేద్కర్ భవన నిర్మాణానికి పూనుకున్నందుకుగాను ఆ గ్రామ పెత్తందార్లు వారిని సాంఘిక బహిష్కరణకు గురిచేశారు. కూలి పనులకు పిలవకుండా, పాలు కొనకుండా, ఎరువులు మందులు అమ్మకుండా వేధిస్తున్నారు. అలాగే, వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం బుద్ధారంలో సామాజిక చైతన్యానికి చిహ్నమైన అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. 2017లో ఎస్సీ ఎస్టీ అత్యాచార కేసులు 1587 నమోదుకాగా, 2018 నవంబర్ నాటికి 1624 నమోదు కావడం రాష్ట్రంలో పెరుగుతున్న కుల జాడ్యానికి, దురహంకారానికీ సాక్ష్యంగా నిలుస్తోంది. వృత్తి నేరగాళ్ళు, కిరాయి హంతకులకన్నా కిరాతకంగా కుల దురహంకారులు నేరాలకు పాల్పడడం వెనుక ఉన్న కారణాలను లోతుగా పరిశీలించాల్సి ఉంది.

భూస్వామ్య సంస్కృతి బలంగా ఉన్న బీహార్‌లో 'పకడ్వా పెండ్లి'ండ్లు జరుగుతుంటాయి. యుక్తవయస్సు వస్తే తమ కుమార్తెలు ఎక్కడ ప్రేమల్లో పడి ఇతర కులస్తులను పెండ్లాడి తమ కులాన్ని 'కలుషితం' చేస్తారోనన్న భయంతో అమ్మాయిల తరపువాళ్లు తమ కులాలకే చెందిన 15-17 సంవత్సరాల బాలురను కిడ్నాప్ చేసి బలవంతంగా తమ అమ్మాయిలతో పెండ్లిండ్లు చేసేస్తుంటారు. అక్కడ అమ్మాయి- అబ్బాయిల అభిప్రాయాలకు విలువే ఉండదు. ఒక్క 2017వ సంవత్సరంలోనే బీహార్‌లో ఇలాంటి కేసులు 3500 నమోదయ్యాయి. అటువంటి చోట కూడా ఇక్కడిలా హత్యలు జరగడం లేదు. అందుకు కారణం అక్కడ ప్రశ్నించే చైతన్యం తక్కువగా ఉండటం. అందుకే అక్కడ సమస్య హత్యల దాకా పోవడం లేదు. కానీ, తెలంగాణ సమాజంలో ప్రశ్నించే చైతన్యం ఎక్కువ. అదే ఈ భూస్వామ్య అవశేషమైన కుల దురహంకారానికి మింగుడు పడటం లేదు. ప్రశ్నించడాన్ని సహించలేని ఈ దురహంకారం హత్యలకు తెగబడుతున్నది.

దళితుల సాంఘిక బహిష్కరణలు, అంబేద్కర్ విగ్రహాల కూల్చివేతలూ దళితులలో పెరుగుతున్న చైతన్యానికి అడ్డుకట్టలుగా కొందరు భావిస్తున్నారు. తరతరాలుగా 'నీ బాంచన్ కాల్మొక్తా' అంటూ అణిగిమణిగి ఉన్న దళితులు ఇప్పుడు తమ ఆత్మగౌరవాన్ని ప్రకటించుకుంటూ నిటారుగా తలెత్తి నిలవడాన్ని సహించలేని కుల దురహంకారులు దాడులు, అత్యాచారాలకు పాల్పడుతున్నారన్నది బాధితుల వాదన. ఇందులో అవాస్తవమేమీ లేదు. దళితులలో చైతన్యం చిగురిస్తున్నమాట సత్యమే. అయితే చైతన్యం సంఘటిత రూపం తీసుకోకపోవడం కూడా అంతే వాస్తవం. దీంతో, దళితుల చైతన్యాన్ని చూసి చిర్రెత్తిపోతున్న కుల దురహంకారులకు దళితుల అసంఘటితత్వం అలుసుగా మారింది. తాము ఏం చేసినా ఎదిరించే స్థితిలో దళితులు లేరని అర్థం చేసుకున్న కులదురహంకారులు వారిని గతంలోలా తమ కాళ్లదగ్గర ఉంచుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. వీరికి రాజకీయ అండ కూడా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో తోడవ్వడంతో అమానవీయ నేరాలకు తెగబడుతున్నారు. అందుకే ఈ పెరుగుతున్న చైతన్యం సంఘటితం కావాలి. కేవలం దాడికి గురైన కులానికే పరిమితమై ఈ చైతన్యం సంఘటితం కావడం వల్ల ఉపయోగం లేదు. అప్పుడు ఆ చైతన్యానికి కూడా పరిమితులే ఉంటాయి. ఈ పోరాటంలో బాధిత కులమెప్పుడూ ఒంటరికారాదు. ఈ సమస్యకు పరిష్కారం కుల ఐక్యతలో లేదు. ఇక్కడ కావాల్సింది కులానికే పరిమితమైన చైతన్యం కాదు. అది ఆ పరిమితులను దాటి కులానికి వెలుపల ఈ కులదురహంకారాన్ని వ్యతిరేకించే మిత్రులు, ప్రజాస్వామ్య శక్తులందరికీ విస్తరించాలి. కులమతాల కతీతంగా విశాల ప్రజానికాన్ని సంఘటితం చేయాలి. అప్పుడు మాత్రమే దీనిని ఎదుర్కోగలం.

దశాబ్దాలుగా గ్రామాలకు బయట ఉన్న కుల దురహంకార భూస్వామ్య శక్తులు తిరిగి గ్రామాలకు చేరుకోవడం, అలాగే, కుల అసమానతలకు నెలవైన హిందూ మత భావనలు పల్లెనుంచి, పట్నం వరకూ దట్టంగా కమ్ముకోవడం కూడా తెలంగాణలో కుల దురహంకార దాడులు, అత్యాచారాలు, హత్యలు పెరిగేందుకు ఒక ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. రాజకీయంగా, సామాజికంగా, ఆధ్యాత్మికంగా కుల దురహంకారాన్నీ, స్వకుల జాడ్యాన్నీ పెంచే వాతావరణం నెలకొన్న నేపథ్యంలోనే తెలంగాణలో ఇప్పుడు కుల హింస పెరిగిపోతోంది.

గుణాత్మకం.. పెద్ద భ్రమాత్మకం!



కోప్ర

నినాదంలోదంలో సైద్ధాంతికత, నినాదం ఇచ్చిన వారిలో నిబద్ధత ఉంటే, ఆ నినాదం కోట్లాది ప్రజల కలలను సాకారం చేస్తుంది. లేకుంటే అపహాస్యం పాలై కాలగర్భంలో కలిసి పోతుంది. తామిచ్చిన నినాదం అపహాస్యంపాలై కాలగర్భంలో కలిసిపోయినా ఆ నినాదం ఇచ్చిన కొందరు నేతలకు వచ్చే నష్టమేమీ ఉండదు. కారణం వారి నినాదాల వెనుక అంతర్గత ఎజెండాలు వేరే ఉంటాయి కనుక! అంతిమంగా నాయకుల నినాద విన్యాసాలకు ప్రజలే బాధితులు అవుతారు. నేతల నినాదాలను నమ్మి నట్టేట మునుగుతారు. నిజమైన ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించకుండా తాము ఎదుర్కొనే దోపిడి, పీడనలకు తామే కారకులవుతారు.

నినాదం సృష్టించడం, ఆ నినాదంతో ప్రజలను నమ్మించడంలో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మంచి ట్రాక్ రికార్డే ఉంది. మలిదశ తెలంగాణ ఉద్యమకాలంలో కేసీఆర్ ఇచ్చిన 'భౌగోళిక తెలంగాణ' నినాదం తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక భూమిక పోషించింది. బహుశా ఆ స్ఫూర్తితోనే ఆయన ఇప్పుడు 'గుణాత్మక మార్పు' అన్న నినాదాన్ని మొత్తం దేశ ప్రజలపై వదిలారు. బీజేపీ - కాంగ్రెస్‌లకు అతీతంగా ఫెడరల్‌ఫ్రంట్ ఏర్పాటుకు ప్రయత్నాలు మొదలుపెట్టిన కేసీఆర్, తమ ఫెడరల్ ఫ్రంట్ నినాదంగా 'గుణాత్మక మార్పు' (క్వాలిటేటివ్ ఛేంజ్)ను సంధించారు. అయితే, గుణాత్మక మార్పు ఎందులో? అసలు గుణాత్మక మార్పుకు అర్థం ఏమిటి? అది ఎలా సాధ్యం? సామాజిక, ఆర్థిక, రాజకీయ, ఆధ్యాత్మిక.. సమస్తరంగాలలో గుణాత్మక మార్పును సాధించేందుకు కేసీఆర్ ఫ్రంట్ వద్ద ఉన్న ప్రణాళిక ఏమిటి? అసలు గుణాత్మక మార్పుకు ఇప్పుడు రంగంలో ఉన్న పార్లమెంటరీ పార్టీలు అంగీకరిస్తాయా? అంగీకరించేందుకు ఆ పార్టీల భావజాలం అనుమతిస్తుందా? సవాలక్ష ప్రశ్నలకు ఒకే ఒక్క సమాధానం 'శూన్యం'.

ఆర్థిక విధానాల మాట అటుంచి, కనీసం రాష్ట్రా హక్కుల విషయంలో అయినా తన చిత్తశుద్ధిని నిరూపించేకోవాల్సిన బాధ్యత కేసీఆర్‌పై ఉంది. ఇవన్నీ ఒక ఎత్తయితే బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత తీవ్ర సమస్యగా ముందుకొచ్చి, రాజ్యాంగ విలువలకే ముప్పు కలిగిస్తున్న మతోన్మాద సమస్యపై కేసీఆర్ మౌనం విస్మయకరం, గర్హనీయం. ఈ నేపథ్యంలో గుణాత్మక మార్పు నినాదం ఏ దరికి చేరుతుందో చూద్దాం!

అసలు, కేసీఆర్ లాంటి నాయకుడి నోటినుంచి 'గుణాత్మక మార్పు' అన్న నినాదాన్ని వినాల్సి రావడమే ఆశ్చర్యకరం. అవును! నెలరోజుల క్రితం వరకూ గొర్రెలు- బర్రెలు లాంటి సంక్షేమ పథకాల ఆశ చూపి, ఓట్లు దండుకునేందుకు ప్రయత్నించిన నాయకుడు ఇప్పుడు ఏకంగా ప్రజల జీవితాలలో గుణాత్మక మార్పు తీసుకువస్తానని ప్రకటించడం ఏమిటి? సమాజంలో సమస్త వ్యధలకూ కారకులైన నేతలు తామే సమూల మార్పుకు హామీ పడుతున్నారంటే ఎలా అర్థం చేసుకోవాలి? తాము ప్రజలకు ఏమి చెప్పి అయినా నమ్మించగలమని, తాము ఏమి చెప్పినా ప్రజలు నమ్ముతారనీ వారు భావించకుండా అలాంటి నినాదం ఇవ్వడం ఎలా సాధ్యమవుతుంది!? ఆర్థిక విధానాలలో విబేధాలు లేని శక్తులు మాత్రమే ప్రధాన పోటీదారులుగా ఎన్నికల రంగంలో నిలిచిన నేపథ్యంలోనే ఇలాంటి నినాదాలు ఆ నేతల నోటినుండి జాలు వారుతున్నాయని అర్థంచేసుకోవాల్సి ఉంది. నినాదాలకు నిజమైన అర్థాలు విప్పిచెప్పగలిగిన శక్తుల గొంతు బలహీనంగా మార్చడంలో విజయం సాధించిన తరువాత, పీడక వర్గ ప్రాతినిధ్య శక్తులే ప్రధాన పోటీదారులుగా బరిలో మిగిలిన తరువాత ఇలాంటి భ్రమాత్మకమైన నినాదాలకే చోటు దక్కుతుంది.

నినాదం తీరు అలా ఉంటే, ఇక ఫెడరల్ ఫ్రంట్ ద్వారా కేసీఆర్ 'రాష్ట్రాలకు అధిక అధికారాలు ' అన్న డిమాండ్‌ను కూడా ముందుకు తెచ్చారు. రిజర్వేషన్ల విషయంలో రాష్ట్రాలకే నిర్ణయాధికారం ఉండాలనడంతోపాటు, గ్రామంలో వేసే రోడ్లకు సైతం ప్రధాని పేరెందుకని (ప్రధాని గ్రామ సడక్) ఆయన ప్రశ్నిస్తున్నారు. నిజానికి ఇప్పుడు కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికారాల పంపిణీ సమస్య కొత్తదేమీ కాదు. ప్రాతీయ పార్టీలు తమకు అవసరమనుకున్నప్పుడు ఫెడరల్ నినాదాన్ని సంధిస్తున్నాయి. లేదనుకున్నప్పుడు ఈ నినాదాన్ని అటకెక్కిస్తున్నాయి. ప్రాంతీయ పార్టీల అవకాశవాద ధోరణి ఫలితంగా ఈ ప్రయోజనాత్మక నినాదం ప్రజలలోకి పోవాల్సినంత గట్టిగా, శక్తివంతంగా పోవడం లేదు. అందుకే కేంద్ర పాలకుల ఆటలు సాగుతున్నాయి.ప్రాంతీయ పార్టీలు లొంగుబాటు వైఖరి ప్రదర్శించకుండా నేటి సంకీర్ణ రాజకీయాలలో కేంద్ర గుత్తాధిపత్యం చెల్లేది కాదు. 1980ల నాడు కేంద్రంలో తిరుగులేని అధికారం చెలాయిస్తున్న ఇందిర ద్వారా ప్రాంతీయ నాయకత్వం, ప్రధానంగా కాంగ్రెసేతర ప్రాంతీయ నాయకత్వం తీవ్ర వత్తిడి ఎదుర్కొనే పరిస్థితి నెలకొని ఉంది. ఆ వత్తిడి నుంచి బయట పడేందుకు పంజాబ్‌లో ఆకాలీల ఆందోళన స్వయంప్రతిపత్తికోసం ఆనంద్‌పూర్ సాహెబ్ తీర్మాణం చేసేంత వరకూ వెళ్లింది పరిస్థితి. అస్సాం లాంటి ఈశాన్య రాష్ట్రాలలో కూడా వేర్పాటువాద ఉద్యమాలు తారాస్థాయికి చేరుకున్నాయి. అప్పటికే వామపక్షాలు కేంద్ర- రాష్ట్ర సంబంధాలను సమీక్షించాలనీ, ఫెడరల్ రాజ్యాంగాన్ని పరిరక్షించాలనీ, రాష్ట్రాల హక్కులకోసం నినదిస్తున్నాయి. కేంద్రంపైన ఐక్యంగా వత్తిడి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర- రాష్ట్ర సంబంధాలను సమీక్షించేందుకు 1983లో ఇందిర ప్రభుత్వం జస్టిస్ రంజిత్ సింగ్ సర్కారియా కమిషన్‌ను ఏర్పాటు చేసింది. 1984 ఆగస్టులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ ప్రభుత్వ పగ్గాలు నాదెండ్ల భాస్కర్‌రావు చేతుల్లోకి వెళ్లిపోవడం కేంద్ర ప్రభుత్వ దాష్టీకానికి పరాకాష్టగా నిలిచి, కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వ సంబంధాలు, అధికారాలపై చర్చ తీవ్ర స్థాయికి చేరింది. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ ' కాంగ్రెస్ హటావో- దేశ్ బచావో'



నినాదం ఇచ్చారు. ఈ నినాదాన్ని 14 ప్రాంతీయ పార్టీలు అందుకున్నాయి. ఇందుకు విజయవాడ వేదిక అయ్యింది. ఇందిర హత్యానంతరం 1984లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో దేశం మొత్తాన్ని కాంగ్రెస్ సునామీ చుట్టుముట్టినా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 30 పార్లమెంట్ స్థానాలు సాధించి తెలుగుదేశం ప్రధాన ప్రతిపక్షంగా నిలిచింది. తరువాత 1989లో నేషనల్ ఫ్రంట్ ఏర్పడి వీపీ సింగ్ ప్రధానిగా కేంద్రంలో అధికారం చేపట్టింది. అప్పట్లో కాంగ్రెస్‌కు ధీటుగా మరో జాతీయ పార్టీ లేకపోవడంతో దేశ చరిత్రలో మొదటిసారిగా ప్రధానంగా ప్రాంతీయ పార్టీల కలయికతో నేషనల్ ఫ్రంట్ ఏర్పడడం సులభ సాధ్యమయ్యింది. కానీ ఇప్పటి పరిస్థితి వేరు. రెండు ప్రధాన జాతీయ పార్టీలైన కాంగ్రెస్ - బీజేపీలలో ఎవరు సారథ్యం వహిస్తున్నప్పటికీ 1999 నుంచి దేశంలో సంకీర్ణ ప్రభుత్వాలే రాజ్యమేలుతున్నాయి. 2014 ఎన్నికలలో బీజేపీ సరిపడా స్థానాలు సాధించినప్పటికీ దాని సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వమే నేడు పాలన సాగిస్తూ ఉంది.

ప్రాంతీయ పార్టీలు తమ జాతీయ ప్రయోజనాలను జాతీయ పార్టీల చెలిమితో నెరవేర్చుకుంటుండగా, జాతీయ పార్టీలు తమ ప్రాంతీయ ప్రయోజనాలను ప్రాంతీయ పార్టీలతో నెరవేర్చుకుంటూ సంతృప్తి చెందుతున్నాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో ప్రభుత్వాలను ఏర్పాటు చేసిన కాంగ్రెస్ బీజేపీకి ప్రత్యామ్నాయంగా ఎదిగింది. 2019 ఎన్నికలలో బీజేపీ అధికారం నిలబెట్టుకునేందుకు కొత్త మిత్రుల వేటలో పడగా, మరోవైపు కాంగ్రెస్ బీజేపీ వ్యతిరేక కూటమికోసం ప్రయత్నాలు చేస్తున్నది. ఈ నేపథ్యంలో ఈ రెండు కూటములకు వ్యతిరేకంగా కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుకు ప్రయత్నం చేస్తున్నారు. ఆర్థిక విధానాల విషయంలో ఈ మూడు పక్షాలకు మధ్య వైరుధ్యం లేనికారణంగా, ప్రజలను ఆకర్షించేందుకు కేసీఆర్ ఆచరణ సాధ్యంకాని భ్రమాత్మక నినాదం 'గుణాత్మక మార్పు' ను వదిలారు. రెండు కూటములకన్నా తనను భిన్నంగా ప్రదర్శించుకుని, జనబాహుల్యంలో ఆసక్తిని రేకెత్తించి తన వైపునకు ఆకర్షించే ఎత్తుగడే తప్ప కేసీఆర్ గుణాత్మక నినాదంలో మరో గుణం లేదన్నది సత్యం. ఆర్థిక విధానాలలో తేడాలులేని ఏ పార్టీ, లేదా ఏ ఫ్రంట్ అధికారంలోకి వచ్చినా ప్రజలకు వొరిగేదేమీ లేదని సుదీర్ఘ కాంగ్రెస్, బీజేపీ పాలనతో ఇప్పటికే తేలిపోయింది. మధ్యలో ప్రాంతీయ పార్టీలు కేంద్రంలో అధికారంలోకి వచ్చినా ప్రత్యామ్నాయ విధానాలను ప్రజలకు అందించడంలో విఫలమయ్యాయి. ఈ నేపథ్యంలో కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ గుణాత్మక మార్పు తీసుకొస్తుందంటే నమ్మగలమా? అందుకే, కాంగ్రెస్- బీజేపీ ముక్త భారత్ అంటూ కేసీఆర్ గత సంవత్సరం ఏప్రిల్ నుంచీ ప్రాంతీయ పార్టీల అధినేతల చుట్టూ అలుపెరుగని ప్రదక్షిణలు చేస్తున్నా వారినుంచి సానుకూలత వ్యక్తం కావడం లేదు. మమతా బెనర్జీ, నవీన్ పట్నాయక్ ఎటూ తేల్చక నాన్చుతుండగా, డీఎంకే అధినేత స్టాలిన్ ఏకంగా మా ప్రధాని అభ్యర్థి రాహుల్ అని బహిరంగంగా ప్రకటించేశారు.


నినాదాల గాంభీర్యత తప్ప, విధానాల స్పష్టత కేసీఆర్‌లో లోపించింది. 'ఒకర్ని అధికారంలోనుంచి దించేందుకు, మరొకర్ని అధికారంలో కూర్చోబెట్టేందుకు కాదు ఫెడరల్ ఫ్రంట్' అంటున్న కేసీఆర్, మోడీని దింపకుండా ప్రాంతీయ పార్టీలకు అధికారం ఎలా దక్కుతుందో చెప్పాల్సిన అవసరం ఉంది. ప్రాంతీయ పార్టీల నిర్ణయాలను ప్రాంతీయ పరిస్థితులే ప్రభావితం చేస్తాయి. ఇలా చూసినపుడు నవీన్ పట్నాయక్, మమత, స్టాలిన్, కుమార స్వామి, మాయావతి, అఖిలేష్ యాదవ్‌లు బీజేపీతో తలపడక తప్పని స్థితిలో ఉన్నారు. కాగా, గత నాలుగన్నర సంవత్సరాలుగా మోడీతో కేసీఆర్ కొనసాగిస్తున్న సంబంధాలు సైతం ఆయనపై విశ్వాసం కలిగించే విధంగా లేవు. పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీలను బలంగా సమర్థించడం, సీబీఐ, ఈడీ, రా, కాగ్, ఆర్‌బీఐ లాంటి సంస్థలను బీజేపీ తన గుప్పెట్లో పెట్టుకోవడాన్ని ఖండించకపోవడం, మరీ ముఖ్యంగా కేరళ ఆర్థిక మంత్రి ఏర్పాటు చేసిన నిటిఆయోగ్ బాధిత రాష్ట్రాల సమావేశానికి హాజరుకాకపోవడం లాంటి చర్యలు కేసీఆర్‌పై అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. అలాగే, కాంగ్రెస్‌కు దగ్గరగా ఉన్న పార్టీలనే టార్గెట్ చేస్తూ సాగుతున్న కేసీఆర్ ఫెడరల్ యాత్రలు సైతం ఆయన నిజాయితీని ప్రశ్నార్థకం చేస్తున్నాయి.

ఆర్థిక విధానాల మాట అటుంచి, కనీసం రాష్ట్రా హక్కుల విషయంలో అయినా తన చిత్తశుద్ధిని నిరూపించేకోవాల్సిన బాధ్యత కేసీఆర్‌పై ఉంది. ఇవన్నీ ఒక ఎత్తయితే బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత తీవ్ర సమస్యగా ముందుకొచ్చి, రాజ్యాంగ విలువలకే ముప్పు కలిగిస్తున్న మతోన్మాద సమస్యపై కేసీఆర్ మౌనం విస్మయకరం, గర్హనీయం. ఈ నేపథ్యంలో గుణాత్మక మార్పు నినాదం ఏ దరికి చేరుతుందో చూద్దాం!

కాటేస్తున్న కాలుష్యం

మన దేశంలో కలుషితమైన గాలి పీల్చి జబ్బుపడే వారు, మరణించే వారు చాలా ఎక్కువగా ఉన్నారని లాన్సెట్ ప్లానెటరీ హెల్త్ సంస్థ వెలువరించిన పరిశోధనా ఫలితాలు తెలియచేస్తున్నాయి. ఆరోగ్య సంక్షోభం తాండవించే దశలో ఉన్నాం. కలుషితమైన గాలి నుంచి జనాన్ని రక్షించడానికి తక్షణం చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది.

మన దేశంలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయిలో ఉంది. అయితే కలుషితమైన గాలి పీల్చడం వల్ల ఆరోగ్య సమస్యలు, జీవన ప్రమాణాలకు ముప్పు ఉందన్న విషయాన్ని మనం గ్రహించడం లేదు.



వివిధ సంస్థలకు చెందిన శాస్త్రవేత్తలు దేశమంతటా సర్వే చేసి ఈ ఫలితాలు వెల్లడించారు. మన చుట్టూ ఉన్న ధూళి కణాలు, ఇళ్లల్లో పీల్చే గాలిలో ఉన్న కాలుష్యంపై వివిధ రాష్ట్రాలలో 2017లో ఈ పరిశోధన కొనసాగింది. మరణాలు, రోగాల బాధ, జీవన ప్రమాణాలు అన్న మూడు వర్గాల కింద కాలుష్య సమస్యను చూపించారు.

మన దేశంలో గాలి కాలుష్యం వల్ల సోకే జబ్బులు పొగాకు వాడడంవల్ల వచ్చే రోగాలకన్నా ఎక్కువ. దీనివల్ల శ్వాసకోశ సంబంధ వ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులు, గుండె జబ్బులు, పక్షవాతం, మధుమేహం లాంటివి ఎక్కువ అవుతున్నాయి. 2017లో 10 లక్షల 24 వేల మంది వాయు కాలుష్యం వల్ల మరణించారు. వీరిలో 51.4 శాతం మంది 70 ఏళ్లకు పైబడినవారే.

వాయు కాలుష్యం కనీస స్థాయి కన్నా తక్కువగా ఉండి ఉంటే జీవన ప్రమాణం 1.7 సంవత్సరాలు పెరిగేది. గాలిలో ధూళి కణాలు, ఇంట్లో పీల్చే గాలిలో కాలుష్య స్థాయి ఒక్కో రాష్ట్రంలో ఒక్కో రకంగా ఉంది. అందువల్ల దాని దుష్ప్రభావంలో కూడా తేడాలు ఉన్నాయి.

ఉత్తరప్రదేశ్, హర్యానా, ఢిల్లీ, పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాలలో గాలిలో ధూళి కణాలు ఎక్కువ. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, అస్సాంలో ఇళ్లల్లో పీల్చే గాలిలో కాలుష్యం అధికంగా ఉంది. అంటే వాయు కాలుష్యం నగరాలకు, పట్టణాలకే పరిమితం కాలేదు. గ్రామీణ ప్రాంతాలలోనూ ఈ బెడద ఉంది. గ్రామీణ ప్రాంతా లలో వంట చేసుకోవడానికి పిడకలు, బొగ్గులు, వంట చెరకు వాడడం వల్ల కాలుష్యం పెరుగుతోంది.

ఆర్థిక వ్యవస్థ అభివ ద్ధి చెందుతున్న కొద్దీ పరిశ్రమలు, వాహనాలు వెదజల్లే కాలుష్యం, పంటల నూర్పిళ్ల తర్వాత ఆ అవశేషాలను దగ్ధం చేయడం, భవన నిర్మాణాల వల్ల కాలుష్యం అంతకంతకూ పెరిగిపోతోంది. ఢిల్లీలో విషపూరితమైన పొగమంచు బెడద శీతాకాలంలో మరీ ఎక్కువ అవుతున్నందువల్ల ప్రభుత్వం చర్యలు తీసుకోక తప్పలేదు.


కాలుష్యం వల్ల ఆర్థిక భారం ఎక్కువ పడుతుందని గుర్తించక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఈ అంశాన్ని నిర్లక్ష్యం చేయలేం. కాలుష్యం వల్ల అనారోగ్యం బారిన పడినప్పుడు కూడా ఆర్థిక భారం పడుతుంది. వాయు కాలుష్యం వల్ల భారత్ లో సంక్షేమానికి 505.1 బిలియన్ డాలర్ల మేర నష్టం కలిగిందని ప్రపంచ బ్యాంకు, వాషింగ్టన్ యూనివర్సిటీ పరిశోధనలో తేలింది. 2013 నాటి కొనుగోలు శక్తి ఆధారంగా ఈ అంచనా వేశారు. కాలుష్యం వల్ల 2013లో పని దినాలు కోల్పోవడంవల్ల కలిగిన నష్టం 55.39 బిలియన్ డాలర్లు ఉంది. ఇది 2011 నాటి కొనుగోలు శక్తి ఆధారంగా వేసిన అంచనా. సంక్షేమం, పని దినాల నష్టం వల్ల 2013లో స్థూల జాతీయ ఉత్పత్తిలో కలిగిన నష్టం 8.5 శాతం ఉంది. అంటే ఆర్థికాభివ ద్ధికి విపరీతమైన నష్టం కలుగుతోంది.

వాయు కాలుష్య ప్రభావం పెరుగుతూ ఉన్నందు వల్ల కేంద్ర ప్రభుత్వం ఈ ప్రమాదాన్ని గుర్తించక తప్పలేదు. వాయు కాలుష్యం దేశమంతటా ఉన్న సమస్య. అందుకే వాయు కాలుష్యాన్ని అంచనా వేయడానికి జాతీయ పరిశుభ్ర వాయువు పథకం ప్రారంభించవలసి వచ్చింది.

అయితే ఇందులో కాలుష్యాన్ని తగ్గించడానికి నిర్దిష్టమైన చర్యలు లేనందువల్ల పర్యావరణ శాస్త్రవేత్తలు విమర్శలు గుప్పించారు. 2017 డిసెంబర్ నాటికి కాలుష్య నివారణ చర్యలకు కట్టుబడి ఉండాల్సి ఉన్నా ప్రభుత్వం కాలుష్యం వెదజల్లే బొగ్గు ఆధారిత విద్యుత్ పథకాలకు అనుమతులు ఇస్తూనే ఉంది. ఈ మినహాయింపులు ఇవ్వడం వల్ల అంతకంతకూ పెరుగుతున్న కాలుష్య నివారణకు ప్రభుత్వం ఏ మేరకు కట్టుబడి ఉందన్న అనుమానాలు కలుగుతున్నాయి. కాలుష్యాన్ని నివారించాలంటే ప్రాంతీయ సమన్వయం మాత్రమే కాకుండా, రాజకీయ సంకల్పం, ప్రజా సంకల్పం కూడా అవసరం.

- 'ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ' సౌజన్యంతో


మోడీ ప్రజా వ్యతిరేక పాలనను ఓడిద్దాం



సిహెచ్ నరసింగరావు

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం గత నాలుగున్నర సంవత్సరాలుగా పూర్తి ప్రజా వ్యతిరేక పాలన అనుసరించింది. విదేశీ బహుళ జాతి సంస్థలకు, దేశంలోని బడా పెట్టుబడి దారులకు అనుకూలమైన విధానాలను అమలు చేసింది. ఎన్నికల ముందు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని, ధరలు తగ్గిస్తామని, నల్లడబ్బును వెలికి తీస్తామని మోడీ ప్రభుత్వం వాగ్దానం చేసింది. వాస్తవానికి గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించిన సరళీకరణ విధానాలను మరింత వేగంగా అమలు చేసింది. భూములు, గనులు, సముద్రాలు మొదలైన సహజ వనరులతోపాటు కేంద్ర ప్రభుత్వ రంగ భారీ పరిశ్రమలను, బడా పెట్టుబడిదారులకు కారుచౌకగా కట్టబెట్టడానికి సకల ప్రయత్నాలు చేసింది. రక్షణ రంగం, రైల్వే రంగాలతో సహా నూరు శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతించింది. భారీ విగ్రహాలు, జాతీయ జెండాలు పెట్టి నిత్యం దేశభక్తి గురించి జపించే బిజెపికి, ప్రజలను పక్కదారి పట్టించడం తప్ప నిజమైన దేశభక్తి ఆవగింజంత కూడా లేదని స్పష్టమౌతోంది. దేశ ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి ఉత్తర భారతదేశంలో అయోధ్యను, దక్షిణ భారతదేశంలో శబరిమలను రావణ కాష్టంలా రగిలిస్తూనే ఉన్నారు. బడా పెట్టుబడిదారులకు అనుకూలంగా ప్రతి సంవత్సరం రూ.ఐదు లక్షల కోట్లకు పైగా పన్నుల రాయితీలు ఇచ్చారు. ప్రజలు బ్యాంకుల్లో పొదుపు చేసుకున్న సొమ్మును, పెట్టుబడిదారులకు అప్పులుగా ఇచ్చారు. పెట్టుబడిదారులు రూ.12 లక్షల కోట్ల అప్పులు ఎగ్గొడితే వాటిని బిజెపి ప్రభుత్వం మాఫీ చేస్తున్నది. నోట్ల రద్దుతో దేశంలో నిర్మాణ, జౌళి, సిమెంట్ లాంటి రంగాల్లో 70 లక్షల మందికి ఉపాధి పోయింది. జిఎస్టీ పన్నుల భారం సామాన్య ప్రజలను కుదేలు చేసింది. పెట్రోలియం ధరలు అంతర్జాతీయంగా తగ్గినా, పన్నుల భారం పెంచారు. దీంతో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశానికి ఎదిగాయి.

స్వాతంత్ర్యం ముందు నుంచి కార్మిక వర్గం సాధించుకున్న హక్కులను కాలరాయాలని బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తున్నది. 44 కార్మిక చట్టాలను 4 కోడ్లుగా మార్చి అమలు చేయడానికి పూనుకుంటున్నది. పార్లమెంట్‌లో ఈ చట్టాలను మార్చే ప్రక్రియ సాగుతున్నది. చట్టాలు మారితే కార్మికులకు పోరాడే హక్కులు లేకుండా పోతాయి. 'పారిశ్రామిక వివాదం చట్టం'లోని సమ్మెను లేకుండా చేయబోతున్నారు. అంటే సమ్మె నోటీసు ఇవ్వగానే సమ్మెను చట్ట వ్యతిరేకంగా ప్రభుత్వం ప్రకటిస్తుంది. అయినా సమ్మెకు దిగితే ఒక రోజు సమ్మెకు, కార్మికులకు 8 రోజుల జీతం కోత విధిస్తారు. యూనియన్ నాయకులను జైల్లో పెట్టవచ్చు. కార్మికుల యూనియన్‌పై లక్షల రూపాయల జరిమానా విధించవచ్చు. యూనియన్ గుర్తింపు రద్దు చేయవచ్చు. సులభతరమైన వ్యాపారాన్ని అమలు చేయడమంటే ఇదే. లక్షల మంది పని చేస్తున్న 'ప్రత్యేక ఆర్థిక మండళ్లు' (సెజ్)లో యూనియన్లు పెట్టనివ్వడంలేదు. యూనియన్లు పెట్టడానికి ప్రయత్నించిన వారిని పనుల నుంచి తొలగిస్తున్నారు. కొత్తగా సంఘాలు పెట్టకుండా ప్రభుత్వ, యాజమాన్యాలు అడ్డుపడుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యాజమాన్యాలకు కొమ్ముకాస్తున్నాయి. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని టిడిపి ప్రభుత్వాలు పూర్తిగా కార్మిక వ్యతిరేక ప్రభుత్వాలుగా వ్యవహరిస్తున్నాయి. అందుకే కార్మికుల రోజువారీ హక్కుల కోసమే కాకుండా మోడీ, చంద్రబాబు విధానాలను ఓడించడానికి దేశవ్యాప్తంగా కార్మిక వర్గం




సిద్ధమౌతున్నది.

స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వ రంగ పరిశ్రమల ద్వారా దేశం స్వయం సమద్ధిని సాధించింది. అందుకే ప్రభుత్వ రంగాన్ని నూతన దేవాలయాలుగా నెహ్రూ అభివర్ణించారు. అంత ప్రసిద్ధిగాంచిన భారీ కేంద్ర ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేట్‌పరం చేయడానికి బిజెపి ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నించింది. ఎరువులు, మందులు, సిమెంట్, స్టీల్ లాంటి ప్రాథమిక రంగాల నుంచి అన్ని రంగాల అభివ ద్ధికి మూలం ప్రభుత్వ రంగ పరిశ్రమలు. ఈ పరిశ్రమల వల్ల ఉపాధి భారీగా పెరిగింది. సామాజిక న్యాయం, ఎస్టీ, ఎస్సీలకు ఉపాధి లభించింది. వెనుకబడిన ప్రాంతాలు అభివ ద్ధి చెందాయి. దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టపరిచాయి. బంగారు బాతుగా ఈ సంస్థలు డివిడెంట్ల రూపంలో ప్రతి సంవత్సరం కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌కు రెండు లక్షల కోట్ల రూపాయల పన్నులను చెల్లిస్తున్నాయి. అటువంటి ఈ సంస్థలను పూర్తిగా నిర్వీర్యం చేసి ప్రైవేటు పెట్టుబడిదారులు లాభాలు గడించేలా, బిజెపి ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేసింది. మరోసారి అధికారంలోకి వస్తే వాటన్నింటినీ సర్వనాశనం చేయబోతున్నది. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఇంతవరకు స్వంత గనులు సమకూర్చలేదు. బిజెపి ప్రభుత్వ కాలంలో బిఎస్ఎన్ఎల్‌కు గుండెకాయ లాంటి 70 వేల సెల్ టవర్లను వేరు చేసి బిఎస్ఎన్ఎల్‌ను నాశనం చెయ్యాలని ప్రయత్నించింది. కార్మికులు పోరాడడంతో ఆగింది. ఎయిర్ ఇండియాను పూర్తిగా అమ్మాలని ప్రయత్నించినా కొనేవారు లేక ఆగిపోయింది. దేశంలోని ప్రధానమైన ఆరు విమానాశ్రయాలను అమ్మకానికి పెట్టింది. ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వ అధీనంలో ఉన్న బొగ్గు గనులను వేలం పాటల ద్వారా పూర్తిగా ప్రైవేట్‌కు అప్పగిస్తున్నది. 'మేజర్ పోర్టు'ల చట్ట ప్రకారం ప్రభుత్వ రంగ పోర్టులను ప్రైవేట్ చేయడం సాధ్యం కాదు. దీంతో పోర్టులను కార్పొరేట్లుగా మార్చడానికి పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టింది. అదనపు భూములు ఉన్నాయనే పేరుతో 7 వేల ఎకరాల ప్రభుత్వ రంగాల స్థలాలను కేంద్ర ప్రభుత్వం లాగేసుకున్నది. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో 5 వేల ఎకరాల భూమి అదనంగా ఉన్నట్లు గుర్తించింది. ఇప్పటికే విశాఖలోని హిందూస్థాన్ జింక్‌ను మూసి వేసి వేదాంత యాజమాన్యానికి 365 ఎకరాలు అమ్మకానికి సిద్ధం చేసింది. మరో వైపున పర్మినెంట్ కార్మికులకు కనీసం వేతన ఒప్పందాలు చేయకుండా 2017 జనవరి నుంచి జాప్యం చేస్తున్నది. కాంట్రాక్టు కార్మికులను ఇష్టం వచ్చినట్లుగా తొలగించడానికి 'ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్' విధానాన్ని అమలు చేస్తున్నది. కాంట్రాక్టు కార్మికులను 'హైర్ అండ్ ఫైర్' పద్ధతిలో తొలగించడానికి విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో టిఎంసి విధానాన్ని అమలు చేయడానికి ప్రయత్నించింది. పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులు కలిసి రెండు రోజులు 2018 నవంబర్‌లో సమ్మె చేసి సత్తా చాటారు. దానితో యాజమాన్యం వెనుకడుగు వేయవలసి వచ్చింది. స్వాతంత్ర్యానంతరం ఎప్పుడూ లేనంత దాడిని కార్మిక వర్గం నేడు ఎదుర్కొంటున్నది.

గత నాలుగేళ్ళలో రూ.1.20 లక్షల కోట్ల ప్రభుత్వ రంగ సంస్థల వాటాలను అమ్మి వేసింది. సేలం, భద్రావతి, దుర్గాపూర్ (స్పెషల్ స్టీల్స్) ఎయిర్ ఇండియాతో సహా 14 కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను పూర్తిగా అమ్మడానికి ప్రయత్నించి విఫలమైంది. కార్మికుల పోరాటాల ఫలితంగా ఈ అమ్మకాలు ఆగిపోయాయి. విశాఖలో నూరు శాతం డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిసిఐ)ను అమ్మాలని కేబినెట్ తీర్మానించింది. కార్మికులు, 3 రోజుల సమ్మె, 40 రోజులు దీక్షలు చేశారు. జియంలతో సహా పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. అన్ని పీఎస్‌యూలు సంఘీభావం ప్రకటించాయి. లక్షలాది ప్రజలు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ప్రజా బ్యాలెట్‌లో పాల్గొన్నారు. దీంతో బిజెపి ప్రభుత్వం తోక ముడిచింది. ప్రజల పోరాట చైతన్యానికి ఇది నిదర్శనం. ఎయిర్ ఇండియాను ప్రైవేట్ చేయడానికి కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు కూడా విఫలమయ్యాయి. ఈ పరిశ్రమలను కాపాడుకోవడం, ప్రజలు, కార్మిక వర్గం కర్తవ్యం. పోరాటాలతోనే ప్రజా వ్యతిరేక ప్రభుత్వ విధానాలను ఓడించగలం. అందుకే ఈ నెల 8, 9 తేదీల్లో జరిగే సమ్మెను జయప్రదం చేసేందుకు అందరూ సిద్ధం కావాలి.

ఓ పెండ్లిలో రవిని మొదటి సారి చూసింది నీరజ. అతను ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అతని మాట తీరు, స్టైల్ ఆమెకు బాగా నచ్చాయి. అప్పుడు నీరజ ఇంటర్ చదువుతుంది. ఫ్రెండ్స్ ద్వారా రవి నెంబర్ తెలుసుకుని అతనికి ఫోన్లు చేసేది. అతను కూడా నీరజకు ఫోన్లు చేయడం మొదలుపెట్టాడు. ఇద్దరి మధ్య ప్రేమ చిగురించింది. కొన్ని రోజులకు వీరి విషయం ఇంట్లో తెలిసింది. తల్లి ఎంత వద్దన్నా వినిపించుకోలేదు. పెండ్లంటూ చేసుకుంటే రవినే చేసుకుంటానని కచ్చితంగా చెప్పేసింది.



ఐద్వా అదాలత్
సెల్: 9490098024

ఇక చేసేది లేక నీరజ తల్లి రవి వాళ్ళ ఇంట్లో మాట్లాడింది. కొడుకు ఇష్టాన్ని కాదనలేక వాళ్ళూ పెండ్లికి ఒప్పుకున్నారు. పెండ్లి చేసుకుని నీరజ అత్తారింట్లో అడుగుపెట్టింది. కొన్ని రోజులు అంతా బాగానే ఉంది. చిన్నతనం నుండి నీరజ చాలా గారాబంగా పెరిగింది. ఇంటి పనులు చేసేది కాదు. తల్లి దగ్గర ఉన్నప్పుడు ఎలా ఉండేదో అత్తారింట్లో కూడా అలాగే ఉండేది. ఇంటి పనుల గురించి అస్సలు పట్టించుకునేది కాదు. దాంతో అత్త సూటిపోటి మాటలు అనేది. ఇంటి చుట్టుపక్కల వారికి కూడా 'నా కోడలికి ఒక్క పని కూడా రాదు, వంట సరిగా చేయదు' అని చెబుతుండేది. వాళ్ళు నీరజతో 'మీ అత్త నీ గురించి అందరికీ ఇలా చెబుతుందేమిటీ' అని అడిగేవారు. దాంతో నీరజ 'మీ అమ్మ నా గురించి బయట వాళ్ళకు ఇలా చెబుతుంది' అంటూ రవి ఇంటికి వచ్చీ రాగానే చెప్పడం మొదలుపెట్టేది.

మనసుతో మాట్లాడితే...

పగలంతా కష్టపడి వచ్చిన రవి, నీరజ మాటలను పెద్దగా పట్టించుకునేవాడు కాదు. భార్య మరీ మొండిగా పట్టుబడితే "మనం ఆమెకు ఇష్టం లేకుండా పెండ్లి చేసుకున్నాం. నాకోసం కాదనలేక ఈ పెండ్లికి ఒప్పుకుంది. ఆ కోపంతో ఏదో అంటుంటుంది. మా అమ్మ పెద్దది కదా, చూసీ చూడనట్టు వదిలెయ్. నువ్వు కూడా ఇంట్లో పనులు చేయొచ్చు కదా' అనేవాడు. భర్త తనకు సపోర్ట్ చేయకుండా తల్లి తరపున మాట్లాడడం నీరజకు నచ్చేది కాదు. దాంతో ఆమెకు అత్తపై రోజురోజుకు కోపం పెరిగిపోయేది. ఇంట్లో గొడవలు కూడా ఎక్కువయ్యాయి. ఈ గొడవల మధ్య రవి నలిగిపోయేవాడు. ఇటు తల్లికీ, అటు భార్యకు ఇద్దరికీ సర్ది చెప్పలేక సతమతమవుతున్నాడు.

ఇలాంటి పరిస్థితుల్లో నీరజ నెల తప్పింది. డాక్టర్లు బెడ్ రెస్ట్ అని చెప్పారు. దాంతో ఆమె పుట్టింటికి వెళ్ళిపోయింది. పాప పుట్టే వరకు అక్కడే ఉన్నది. పాపకు ఆరు నెలలు నిండిన తర్వాత తిరిగి వచ్చింది. అది కూడా రవి ఎంతో బతిమలాడితే. మళ్ళీ గొడవలు మొదలు. ఇక అప్పటి నుంచి భర్తతో ఎలాగైనా వేరు కాపురం పెట్టించాలని ప్రయత్నాలు మొదలుపెట్టింది. కానీ రవి మాత్రం దీనికి ఒప్పుకోవడం లేదు.

నీరజ ఏదో ఒకటి అనడం, రవి ఆమెను కొట్టడం, కొన్ని రోజులు పుట్టింటికి వెళ్ళడం, తిరిగి రావడం ఇలా రెండేండ్లు గడిచిపోయాయి. ఒకరోజు నీరజ, రవి ముందే అతని తల్లిని నానా మాటలూ అంది. బూతులు తిట్టింది. అది భరించలేని రవి, నీరజను బయటకు గెంటేశాడు. ఇక వేరుకాపురం పెడితే తప్ప తిరిగి రానని చెప్పి వెళ్ళిపోయింది. నీరజ పుట్టింట్లో పరిస్థితి అతంత మాత్రమే. తండ్రి లేడు. తల్లి కష్టపడి పిల్లల్ని పెంచుతున్నది. ఇంట్లో నీరజనే పెద్దది. ఇంకా ఇద్దరు చెల్లెళ్ళు ఉన్నారు. వాళ్ళకు పెండ్లి చేయాలి. పెద్ద కూతురు ఇలా పుట్టింట్లో ఉంటే ఎలా అని ఆమె దిగులు. ఇదంతా గమనించిన ఓ స్నేహితురాలు నీరజను ఐద్వా లీగల్‌సెల్‌కు తీసుకొచ్చింది.

మేడం, నా భర్త నా మాట వినడు. అసలు నన్ను పట్టించుకోడు. మా అత్త గయ్యాళి. తన మాటే నెగ్గాలంటుంది. నన్ను నా భర్తతో కొట్టి ఇంట్లో నుండి నెట్టేయించింది. ఇక నేను అక్కడ ఉండలేను. ఆమెతో ఉంటే నన్ను చంపేస్తుంది. మీరే ఎలాగైనా మా వారితో మాట్లాడి వేరు కాపురం పెట్టించండీ" అంటూ చెప్పుకొచ్చింది నీరజ.

"చూడు నీరజ నువ్వు అనవసరంగా సమస్య పెద్దది చేసుకుంటున్నావు. ఏ ఇంట్లో అయినా ఇలాంటి సమస్యలు సాధారణం. చిన్న చిన్న విషయాలకే గొడవలు పెట్టుకుని పుట్టింటికి వస్తే ఎలా? నీకు వేరు కాపురం పెట్టాలని ఉంది. వేరుగా ఉంటే హాయిగా ఉండొచ్చు అనుకుంటున్నావేమో. నీ ఆలోచన కరెక్టు కాదు. మీ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. అక్కడ మీ అత్త ఒక్కతే ఉంటుంది. మీరు వేరుగా ఉంటే మీకోసం, మీ అత్త కోసం వేరు వేరు ఇండ్లు తీసుకోవాలి. రెండు అద్దెలు కట్టాలి. ఎన్నో ఖర్చులు ఉంటాయి. ఇవన్నీ రవి వల్ల కాదు. పైగా ఆర్థిక సమస్యలు ఎక్కువవుతాయి. ఆర్థిక సమస్యలు ఉన్నచోట ప్రశాంతంగా బతకడం కష్టం. మీ మధ్య గొడవలు ఇంకా ఎక్కువవుతాయి. పరిస్థితులను బట్టి సర్దుకుపోవడం నేర్చుకోవాలి.

మీ అత్త ఎవరితోనో నీ గురించి చెడుగా చెబుతుందంటున్నావు. వాళ్ళు వచ్చి నీతో చెబుతున్నారు. బయట వాళ్ళు గొడవలు పెట్టడానికి ఒకటికి రెండు కల్పించి చెబుతారు. వాళ్ళ మాటలు నమ్మి నువ్వు మీ అత్తపై కోపం పెంచుకున్నావు. దీని వల్లనే కాదా ప్రేమించి పెండ్లి చేసుకున్న రవికీ, నీకు మధ్య గొడవలు. చిన్న వయసులో ప్రేమించి పెండ్లి చేసుకున్నావు. ఇప్పుడు ఓ బిడ్డకు తల్లివి. కాస్త ఆలోచించి నడుచుకో. లేని పోని సమస్యలు తెచ్చుకోవద్దు" అన్నారు లీగల్‌సెల్ సభ్యులు.

> *నీరజ ప్రతి విషయానికీ గొడవలు పెట్టుకుంటుంది. అలుగుతుంది. ఎప్పుడూ వేరు కాపురం పెడదాం అంటుంది. వేరు కాపురం అంటే మాటలు కాదు. అది నావల్ల కాదు. ఇవన్నీ చెబితే ఆమె అర్థం చేసుకోదు. తన గోల తనదే. తన సుఖం తాను చూసుకుంటుంది.*

"మీరు చెప్పింది కూడా నిజమే. కానీ ఆయన నాతో సరిగా మాట్లాడడు. వాళ్ళ బంధువులు ఇండ్లకు వెళితే నన్ను అస్సలు పట్టించుకోండు. వాళ్ళ అమ్మ నన్ను ఎన్ని మాటలు అంటున్నా ఆమెకే సపోర్ట్ చేస్తాడు. నన్ను కొడతాడు. సరదాగా బయటకు వెళదామన్నా తీసుకెళ్ళడు. ఆయన అలా ఉంటే నేను అక్కడ ఉండలేను. ఆయన మారితేనే వెళతాను" అంది.

లీగల్ సెల్ సభ్యులు రవిని పిలిపించి మాట్లాడితే... "మేడమ్ నాకు వచ్చే ఆదాయం తక్కువ. అందులోనే ఖర్చులన్నీ చూసుకోవాలి. నీరజ ప్రతి విషయానికీ గొడవలు పెట్టుకుంటుంది. అలుగుతుంది. ఎప్పుడూ వేరు కాపురం పెడదాం అంటుంది. వేరు కాపురం అంటే మాటలు కాదు. అది నావల్ల కాదు. ఇవన్నీ చెబితే ఆమె అర్థం చేసుకోదు. తన గోల తనదే. తన సుఖం తాను చూసుకుంటుంది. చీటికీ మాటికీ 'ప్రేమించినప్పుడు ఎలా ఉన్నావు. ఇప్పుడు ఎలా తయారయ్యావు' అంటుంది. అప్పుడు ఉన్నట్టు ఇప్పుడు ఉండటానికి వీలవుతుందా? మీరే చెప్పండి. అప్పుడంటే బాధ్యతలు లేవు. ఇప్పుడు పెండ్లయి ఓ పాప ఉంది. ఎంత బాధ్యతగా ఉండాలి. డబ్బు ఎంత పొదుపుగా వాడాలి. ఎన్ని సార్లు చెప్పినా నా మాట వినిపించుకోదు. అందుకే నాకు కోపం వస్తుంది. కోపం వచ్చినప్పుడు కొడతాను, అలిగి పుట్టింటికి వెళుతుంది" అన్నాడు.

"ఏది ఏమైనా మీరు ప్రేమించి పెండ్లి చేసుకున్నారు. భార్య కోరే చిన్న చిన్న కోర్కెలు తీర్చడం భర్తగా నీ బాధ్యత. పైగా మీ ఇద్దరి వయసు కూడా చిన్నదే. అప్పుడప్పుడు నీతో కలిసి సరదాగా బయటకు వెళ్ళాలని నీరజకు ఉంటుంది. నువ్వు కష్టపడుతున్నావు. కానీ సుఖంగా ఉండడం లేదు. వారంలో కనీసం ఒక్క పూట నీరజకు కేటాయించు. సినిమాకు కాక పోతే అలా సరదాగా పాపను తీసుకుని పార్కుకు వెళ్ళండి. ఆమెతో మనస్ఫూర్తిగా మాట్లాడు. అప్పుడు నీ సమస్యలన్నీ పరిష్కారమవుతాయి. మీ అమ్మ ఇంట్లో ఉండడం వల్లనే నువ్వు తనతో ప్రేమగా ఉండడం లేదనుకుంటుంది నీరజ. అందుకే అత్తాకోడళ్ళ మధ్య గొడవలు. కాబట్టి ముందు నీరజలో ఆ ఆలోచన రాకుండా చెయ్యి. భార్యకు కాస్త సమయం కేటాయించు. అప్పుడే నీ సమస్యలు పరిష్కారమవుతాయి. మేము నీరజతో మాట్లాడాం. నువ్వు కాస్త ఆమెతో ప్రేమగా ఉంటే చాలు" అన్నారు లీగల్‌సెల్ సభ్యులు.

వేరు కాపురం పెట్టకుండా అతనితో వెళ్ళడానికి నీరజ ముందు అంగీకరించలేదు. దాంతో "ముందు మూడు నెలలు అక్కడ ఉండి చూడు. అప్పటికీ నీ భర్తలో మార్పు రాకపోతే అప్పుడు వేరు కాపురం గురించి ఆలోచిద్దాం" అని లీగల్‌సెల్ సభ్యులు నీరజకు ఎంతో సర్ది చెప్పారు. దాంతో ఆమె కూడా అంగీకరించింది.

చివరకు ఇద్దరూ లీగల్‌సెల్ సభ్యులు చెప్పిన ప్రకారమే చేస్తామన్నారు. నీరజ పాపను తీసుకుని రవితో కలిసి అత్తారింటికి వెళ్ళింది. ప్రస్తుతం ఇద్దరూ సంతోషంగా ఉంటున్నారు. రవి అప్పుడప్పుడు నీరజను తీసుకొని బయటకు వెళుతున్నాడు. దాంతో అత్త ఎన్ని మాటలు అంటున్నా నీరజ పెద్దగా పట్టించుకోవడం లేదు.

సలీమ

కొవ్వు తగ్గించే పదార్థాలు

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రతి ఒక్కరూ తపన పడుతుంటారు. అయితే దాని కోసం ఖరీదైన ఆహారం తీసుకోవాల్సిన అవసరం లేదు. రోజువారీ తీసుకునే ఆహార పదార్థాలను తీసుకోవాల్సిన రీతిలో తీసుకుంటే అనారోగ్య సమస్యలను దూరం చేసుకోవచ్చు. ఆ జాబితాలోని కొన్నింటి గురించి మీ కోసం...

1 పసుపు :-



రోజూ తినే తిండిలో వీలైనంత వరకు పసుపు వాడితే గుండెకు మంచిది. 'లో డెన్సిటీ లిపోప్రొట్కెన్' (ఎల్.డి.ఎల్) అంటే చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, రక్తపోటును నియంత్రణలో ఉంచుతుంది. రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టే సమస్యను తొలగించి, గుండెపోటు రాకుండా కాపాడుతుంది.

2 యాలకులు :-



తిన్న ఆహారం సాఫీగా జీర్ణమైతేనే శరీరానికి తగినంత జీవశక్తి లభిస్తుంది. యాలకులతో జీర్ణప్రక్రియ మెరుగుపడుతుంది. ఇదివరకే శరీరంలో పేరుకుపోయిన అదనపు కొవ్వును సైతం తొలగించే శక్తి యాలకులలో ఉంది.

3 మిరప :-



వీటిని (ఆహారంలో భాగంగా) తిన్నాక కేవలం 20 నిమిషాల్లోనే ప్రభావం కనిపిస్తుంది. మిరపలోని క్యాప్‌సైసిన్ క్యాలరీలను వేగంగా ఖర్చుచేస్తుంది. క్యాలరీలు తొందరగా ఖర్చయ్యేకొద్దీ కొలెస్ట్రాల్ పెరగదు.

4 కరివేపాకు :-



బరువు తగ్గించడంలో కరివేపాకు పాత్ర చాలానే ఉంది. శరీరంలో పేరుకుపోయిన టాక్సిన్లు, చెడుకొవ్వును శుభ్రం చేస్తాయి. కూరల్లో కలిపి తిన్నా సరే, లేకపోతే రోజూ పది కరివేపాకులతో జ్యూస్ చేసుకొని తాగినా మంచిదే.

5 వెల్లుల్లి :-



ఇందులోని యాంటీ బాక్టీరియల్ యాసిడ్స్ కొవ్వును బాగా తగ్గిస్తాయి. అందుకే వెల్లుల్లిని 'ఫ్యాట్ బర్నింగ్ ఫుడ్' అని పిలుస్తారు. చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, అధిక రక్తపోటు సమస్యను నివారించడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

6 ఆలివ్ ఆయిల్ :-



వంట నూనెల్లో రారాజు ఆలివ్ ఆయిల్. సన్‌ఫ్లవర్, గ్రౌండ్‌నట్ ఆయిల్స్‌తో పోల్చుకుంటే దీని ఖరీదు ఎక్కువ. అయినా అన్ని నూనెలకంటే ఇందులోనే తక్కువ కొలెస్ట్రాల్ ఉంటుంది. ఆలివ్ ఆయిల్‌లోని యాంటీ ఆక్సిడెంట్స్ గుండె సమస్యలతో బాధపడే వారికి ఎంతో మేలు చేస్తాయి.

7 క్యాబేజీ :-



బరువును తగ్గించేందుకు క్యాబేజీ చక్కగా పనిచేస్తుంది. తరచూ క్యాబేజీని వండుకుతినే వాళ్లలో కొలెస్ట్రాల్ మోతాదు కూడా తక్కువగా ఉంటుంది. ఎక్కువ నూనెతో క్యాబేజీ కూరలు చేయకుండా, ఉడికించిన క్యాబేజీ కూరలు తింటేనే మేలు.

8 పెసరపప్పు :-



పెసరపప్పులో కాల్షియం, పొటాషియం, ఇనుము పుష్కలం. వీటితో పాటు విటమిన్ ఎ, బి, సి, ఇ, ప్రొటీన్లు, ఫైబర్ దానిలో ఎక్కువగా ఉంటాయి. కొవ్వు తక్కువ. కందిపప్పు మోజులో పడి మంచి కొలెస్ట్రాల్‌ను తగ్గించే పెసరపప్పు తినడం తగ్గించొద్దు.

9 మజ్జిగ :-



గ్లాసుడు మజ్జిగలో 2.2 గ్రాముల కొవ్వు, 99 క్యాలరీలు దొరుకుతాయి. అదే పాలలో అయితే 8.9 గ్రాముల కొవ్వు 157 క్యాలరీలు ఉంటాయి. శరీరంలో తక్కువ కొవ్వును చేర్చి, ఎక్కువ శక్తిని ఇచ్చే గుణం మజ్జిగలో ఉంది. వెన్న తీసిన మజ్జిగతో బరువు కూడా తగ్గవచ్చు.

10 సజ్జలు :-



అత్యధిక ఫైబర్ దొరికే ధాన్యాల్లో సజ్జలు ముందు వరుసలో ఉంటాయి. రాగి, జొన్న, గోధుమలను ఎక్కువగా వాడితే తక్కువ కొలెస్ట్రాల్‌తో పాటు ఎక్కువ ఫైబర్ లభిస్తుంది. సజ్జలతో చేసిన రొట్టెలు తింటే చాలా ఉపయోగం.

11 చెక్కాలవంగ :-



ఈ రెండూ లేకుండా మసాలా వంటలుండవు. భారతీయ సంప్రదాయ వంటకాల్లో చెక్కా లవంగాల వాడకం ఈ రోజుది కాదు. వీటిలోని ఉత్తమ ఔషధ గుణాలున్నాయి. డయాబెటీస్, కొలెస్ట్రాల్‌ల సమస్యలు రాకుండా చేస్తాయి. ఎల్.డి.ఎల్., ట్రైకోగ్లిజర్కెడ్స్‌ను తగ్గిస్తాయి.

ఇవన్నీ మీ డైలీ మెనూలో ఉండేలా చూసుకుంటే అధిక బరువు, అధిక రక్తపోటు, మధుమేహం, జీర్ణకోశవ్యాధుల నుంచి తప్పించుకోవచ్చు. చక్కటి ఆరోగ్యంతో హాయిగా జీవించవచ్చు.

నానబెట్టిన బాదంతో...



బాదం పప్పు మనందరికీ తెలిసినవే.. కానీ వీటిని నానాబెట్టి పొట్టు తీసి తినడం వల్ల అనేక ప్రయోజనాలున్నాయని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. పొట్టు తీసేయకుండా తింటే అందులోని పోషకాలను శరీరం గ్రహించలేదని పేర్కొంటున్నారు. అంతేకాకుండా జీర్ణం అవడం కూడా కష్టంగా మారతుందని సూచిస్తున్నారు. బాదంలను రాత్రి మొత్తం నీటిలో నానబెట్టడం వల్ల పై పొరను సులభంగా తొలగించవచ్చు. ఇలా చేస్తే నీటిని గ్రహించుకొని, మృదువుగా మారతాయి. నానబెట్టిన బాదంలు త్వరగా జీర్ణమవటమే కాకుండా, జీర్ణక్రియను ప్రోత్సహించే ఎంజైమ్‌లను విడుదల చేస్తాయి. బాదంలను నానబెట్టడం వల్ల సులభంగా నమిలే అవకాశం ఉంటుంది. పోషకాలనూ పొందవచ్చు.

లాభాలు:-

బాదంలో ఉండే మోనోశాకరైడ్ లు ఆకలిని నియంత్రించి, పొట్ట నిండినట్టుగా అనిపించేలా చేస్తాయి. బరువు తగ్గాలి అనుకుంటే నానబెట్టిన బాదంలను వెంట ఉంచుకొని సమయపాలన లేకుండా ఆకలి అనిపిస్తే, ఆ స్థానంలో వీటిని తింటూ ఉండడం వల్ల లాభం ఉంటుంది. శరీరంలో ఉన్న చెడు కొవ్వుల స్థాయిలను తగ్గించి, మంచి కొవ్వు పదార్థాల స్థాయిలను పెంచుతుంది. దీని వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. నానబెట్టిన బాదంపప్పులలో ఉండే విటమిన్ 'E' యాంటీ ఆక్సిడెంట్‌గా పని చేస్తుంది. ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే ప్రమాదాల నుండి శరీరాన్ని కాపాడతాయి.

రంగ వల్లులు





కరుణ,
మహబూబ్ నగర్

మా చిరునామా
మానవి, నవతెలంగాణదినపత్రిక,
ఎం.హెచ్. భవన్, 21/1, అజామాబాద్,
హైదరాబాద్-20.ఇ-మెయిల్:
manavi@navatelangana.com

యాంత్రికం వద్దు



జీవన విధానం యాంత్రికంగా మారడంతో తగిన వ్యాయామం లేక శరీర నియంత్రణ లేకుండా పోతుంది. బీపీ, షుగర్, స్థూలకాయం లాంటి రుగ్మతల బారిన పడుతున్నారు. నడక శరీర నిర్మాణాన్ని మార్చుతుంది. నడకతో చాలా రకాల ఉపయోగాలున్నాయి. గుండెజబ్బులు, మధుమేహం, క్యాన్సర్, మానసిక ఒత్తిడి, రక్తపోటు, స్థూలకాయం, కొవ్వును తగ్గించి జీవిత కాలాన్ని పెంచుతుంది. ప్రత్యేకించి ఇటీవలి కాలంలో 35 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసున్న వారు, పెద్దలు నడకపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. నడిచేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి. నడక వల్ల లాభాలు, ఎలాంటి ఆహారం తీసుకోవాలి తదితర విషయాల గురించి తెలుసుకుందాం..

- వాకింగ్ ప్రారంభించే వారు మొదటి రోజు ఐదు నుండి 15 నిమిషాలు నడిచి క్రమేపి పెంచాలి. బూట్లను తప్పని సరిగా ధరించాలి.
- వీలైనంత వరకు ఉదయం, సాయంత్రం వాకింగ్ చేస్తే ఆరోగ్యానికి మంచిది. రహదారులపై కంటే మైదానాలలోనే వాకింగ్ చేయడం మంచిది.
- నడిచేటప్పుడు చేతులు ఊపుతూ శరీరాన్ని నిటారుగా ఉంచాలి. వాకింగ్ ఆపే ముందు వేగాన్ని క్రమేపి తగ్గించాలి. అలాగే వాకింగ్ చేసేటప్పుడు వదులుగా ఉండే దుస్తులనే ధరించాలి.
- ఆరోగ్య సమస్యలుంటే డాక్టర్ సలహా తీసుకోవాలి. ప్రతి రోజు 30 నుంచి 45 నిమిషాలు నడిస్తే మంచిది.
- నడిచేటప్పుడు పక్కవారితో సాధ్యమైనంత వరకు మాట్లాడకుండా ఉండాలి. అలాగే శ్వాస నియంత్రణ అవసరం. హిమోగ్లోబిన్ మరీ తక్కువ ఉంటే వ్యాయామం చేయకూడదు.
- ముఖ్యంగా వాకింగ్ ఒత్తిడిని తగ్గించి నిద్రకు ఉపయోగపడుతుంది. అధిక బరువును, కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. క్యాన్సర్ వంటివి రాకుండా తోడ్పడుతుంది. కీళ్లు బలపడతాయి. రక్తప్రసరణ వేగవంతమవుతుంది.
- ఆహారంలో ఉప్పు, ఆయిల్ మోతాదు తగ్గించి జాగ్రత్తలు తీసుకొని వాకింగ్, వ్యాయామం చేయాలి. నూనె పదార్థాలు తినకుండా వెజిటేబుల్ సలాడ్స్‌ను తీసుకోవచ్చు. ఉదయాన్నే మంచినీటిని ఎక్కువగా తాగాలి. స్వీట్స్‌ను ఉదయం తప్పించి మిగిలిన సమయంలో తినకూడదు.

గొర్రెల పంపిణీలో నగదు బదిలీ అమలు చేయాలి

- గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గొర్రెల పంపిణీలో నగదు బదిలీ అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు పశు సంవర్ధక శాఖ డైరెక్టర్‌కు శుక్రవారం ఆ సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. గొర్రెలు పంపిణీ పథకంపై సమగ్రమ విచారణ జరిపించాలని, అవినీతికి పాల్పడుతున్న పశు వైద్యాధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గొల్లకురుమలకు గొర్రెలకు బదులు వారి ఖాతాల్లోకి నగదు బదిలీ చేయాలని కోరారు. ఇప్పటి వరకు చనిపోయిన గొర్రెలకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు రావుల జంగయ్య, ఉపాధ్యక్షులు దయాల నర్సింహ్మా, ఎం. కార్తీక్, ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్, సహాయ కార్యదర్శులు మేకల రవీందర్, బొల్లం అశోక్, వీరబోయిన రవి తదితరులున్నారు.

ప్రముఖ కార్టూనిస్టు నర్సింకు అభినందన సభ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉత్తమ కార్టూనిస్టుగా ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుంచి ప్రతిష్టాత్మక జాతీయ అవార్డు అందుకున్న ప్రముఖ కార్టూనిస్టు నర్సింకు అభినందన సభ ఏర్పాటు చేస్తున్నారు. మీడియా ఆర్టిస్టులు, కార్టూనిస్టులు, ప్రెస్‌క్లబ్ హైదరాబాద్ వారి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించే ఈ సభలో 'రాజకీయాలు- పత్రికల్లో రాజకీయ కార్టూన్లు' అనే అంశంపై ప్రముఖ పత్రికల సంపాదకులు ప్రసంగిస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మెన్ అల్లం నారాయణ, ఆంధ్రజ్యోతి ఎడిటట కె. శ్రీనివాస్, నవతెలంగాణ ఎడిటర్ ఎస్. వీరయ్య, నమస్తే తెలంగాణ ఎడిటర్ కట్టా శేఖర్‌రెడ్డి, తెలంగాణ టుడే ఎడిటర్ కె. శ్రీనివాసరెడ్డి, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయ్‌కుమార్‌రెడ్డి, రాజమౌళిచారి పాల్గొంటారని తెలిపారు.

బైరెడ్‌లో మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ

- 4 నుంచి 20 వరకు దరఖాస్తుల స్వీకరణ : డైరెక్టర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బ్యాంకర్ల గ్రామీణ మరియు ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ(బైరెడ్) ఆధ్వర్యంలో గ్రామీణ మహిళలకు ఉచితంగా స్వయం ఉపాధి శిక్షణను ఇవ్వనున్నట్టు, ఆసక్తి గలవారు ఈ నెల నాలుగో తేదీ నుంచి 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆ సంస్థ డైరెక్టర్ ఎ.యెసేపు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టైలరింగ్ అండ్ ఫ్యాషన్ డిజైనింగ్, జర్దోసి, మగ్గం వర్క్స్, బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంట్, యంఎస్‌ఆఫీస్, అకౌంటింగ్ ప్యాకేజీ, జీఎస్టీ విభాగాల్లో కోచింగ్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగలవారు **www.bired.org** లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హుల ఎంపిక వచ్చే నెల నాలుగో తేదీన జరుగుతుందని, ఐదో తేదీ నుంచి కాస్లులు ప్రారంభమవుతాయని తెలిపారు. పూర్తి వివరాల కోసం హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లోగల బైరెడ్ కార్యాలయంలోగానీ, తమ వెబ్‌సైట్‌లోగానీ సంప్రదించాలన్నారు.

చిన్న నీటిపారుదల శాఖకు జాతీయ అవార్డు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్ర చిన్న నీటిపారుదల శాఖకు ప్రతిష్ఠాత్మక సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్ అవార్డు దక్కింది. సాగునీటి వనరుల నిర్వహణలో మెరుగైన పనితీరును ప్రదర్శిస్తూ మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్ధరణకు పాటు పడుతున్నందుకు ఈ అవార్డు దక్కిందని అధికారులు తెలిపారు. కేంద్ర విద్యుత్ శాఖ సహాయ మంత్రి రాజ్‌కుమార్ సింగ్ చేతుల మీదుగా రాష్ట్ర చిన్న నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ శుక్రవారం ఈ అవార్డును ఢిల్లీలో అందుకున్నారు.

చైనా మాంజాపై నిషేధం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణలో చైనా మాంజా (దారం)పై నిషేధం విధించామని ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) ప్రశాంత్‌కుమార్ ఝా తెలిపారు. చైనా మాంజా అమ్మినా, వాడినా, నిలువ ఉంచినా, రవాణా చేసినా ఐదేండ్ల జైలు శిక్ష, లక్ష రూపాయల వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. శుక్రవారం స్వచ్ఛంద సంస్థలు, మీడియా సంస్థలతో అటవీ శాఖ చైనా మాంజా వాడకం, అనర్థాలపై సమావేశం నిర్వహించింది. అనంతరం పీసీసీఎఫ్ ప్రశాంత్‌కుమార్ ఝా ఓ ప్రకటన విడుదల చేశారు. సంక్రాంతి పండుగను అందరూ అనందంగా జరుపుకోవాలని తెలిపారు. కానీ పతంగుల వల్ల పర్యావరణం, పక్షులకు హాని జరగకుండా చూడాలని పేర్కొన్నారు. చైనా మాంజా వాడకం వల్ల తీవ్రంగా అనర్థాలున్నాయని తెలిపారు.

సంక్షేమ పథకాల అమల్లో ఉద్యోగుల పాత్ర అమోఘం

శాసనమండలి చైర్మెన్ స్వామిగౌడ్

- టీఎన్జీవో డైరీ ఆవిష్కరించిన హోంమంత్రి మహమూద్ అలీ



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను పేద ప్రజలకు చేర్చడంలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల పాత్ర అమోఘమని శాసనమండలి చైర్మెన్ స్వామిగౌడ్ కొనియాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు ఆయన ఈ సందర్భంగా ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. టీఎన్జీవో అంటేనే సకల జనుల సమ్మెకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో టీఎన్జీవో కేంద్ర సంఘం ఆధ్వర్యంలో స్టేట్ స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం జరిగింది. హోంమంత్రి మహమూద్ అలీ ముఖ్య అతిథిగా హాజరై టీఎన్జీవో రూపొందించిన 'డైరీ-2019' ఆయన ఆవిష్కరించారు. అనంతరం స్వామిగౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం ఉద్యోగులు ఎంత కష్టపడ్డారో, నేడు సంక్షేమ పథకాలను పేదలకు చేర్చడంలోనూ అంతే కష్టపడ్డారని ప్రశంసించారు. ఉద్యమ సమయంలో ఇరవై రెండు రోజులు హైదరాబాదు నుండి ప్రజలను చైతన్యం చేయడం కోసం గ్రామాల్లోకి వెళ్లామని, ఈ సమయంలోనే ఎన్నో బాధలు పడ్డామని గుర్తు చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యలు రాష్ట్ర ముఖ్యమంత్రి కె చంద్రశేఖరావుకు తెలుసన్నారు. త్వరలోనే సమస్యల పరిష్కారం కోసం చొరవ తీసుకోవాలని సూచించారు. పీఆర్సీపై ఇప్పటికే టీఎన్జీవో నేతలతో అధికారులు చర్చలు జరిపారని చెప్పారు. కాంట్రాక్టు ఉద్యోగులను పర్మనెంట్ చేద్దామంటే కొంతమంది కోర్టుకు వెళ్లారని చెప్పారు. న్యాయపరమైన సమస్యలకు త్వరలోనే పరిష్కారం లభిస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బంగారు తెలంగాణ బాటలో అడుగులు వేస్తున్నదని చెప్పారు. బెవరేజెస్ కార్పొరేషన్ చైర్మెన్ దేవీప్రసాదరావు మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేస్తామని ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన నేతలు చెప్పారని, ఆయా పార్టీలు పాలిస్తున్న రాష్ట్రంలో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు.

ఉద్యమ సమయంలో ఉద్యోగుల సమస్యల కంటే ఈ ప్రాంత సమస్యకు అధిక ప్రాధన్యత ఇచ్చారని చెప్పారు. కేసీఆర్ నాయకత్వంలోని టీఎన్జీవో ఉద్యోగుల సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. కేంద్రంలో ప్రాంతీయ పార్టీలు ఏకమైతే సీపీఎస్ రద్దుకు మద్దతు లభిస్తోందన్నారు. టీఎన్జీవో అధ్యక్షులు కారెం రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎన్జీవో ఉద్యోగులు కీలక పాత్ర మరవలేనిదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పై ఉద్యోగులకు ఎన్నో అపోహలు కల్పించారని, వాటన్నిం టిని ఉద్యోగులు ఐక్యంగా తిప్పికొట్టారని చెప్పారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉద్యోగుల విభజన జరగలేదు కానీ హై కోర్టు విభజన జరిగిందన్నారు. త్వరలోనే ఉద్యోగుల విభజన జరుగుతుందని నమ్మకం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి నందినీ సిద్దారెడ్డి, టీఎన్జీవో నేతలు రేచల్, రాజేందర్, ముజీమ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతు

బీడీ కార్మిక యూనియన్ల రాష్ట్ర నాయకులు


అభివాదం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

దేశవ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతుగా బీడీ కార్మికులంతా పాల్గొంటారని బీడీ కార్మిక యూనియన్ల రాష్ట్ర నాయకులు అన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 8, 9 తేదీల్లో జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె సందర్భంగా రాష్ట్ర బీడీ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం నిజామాబాద్ నగరంలోని నూతన అంబేద్కర్ భవనంలో రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బీడీ కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలను అదుపులో పెట్టాలని కోరారు. కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దుచేయాలనీ, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలనీ అన్నారు. కార్మిక చట్టాల సవరణ ఆపాలనీ, బీడీ పరిశ్రమను జీఎస్టీ నుంచి మినహాయించాలనీ డిమాండ్ చేశారు. బీడీ కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించే వరకు బీడీ పరిశ్రమను నిర్వీర్యం చేసే చర్యలను మానుకోవాన్నారు. 45 రోజుల్లో కార్మిక సంఘాల రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం రాష్ట్రంలోని ఏడు లక్షల మంది బీడీ కార్మికులు జనవరి 8, 9 తేదీల్లో జరిగే సార్వత్రిక సమ్మెలో పాల్గొంటారని తెలిపారు.సదస్సులో తెలంగాణ బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమ, ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ, తెలంగాణ బీడీ వర్కర్స్ ఫెడరేషన్ సామల మల్లేషం(ఏఐటీయూసీ), నిజామాబాద్ బీడీ మజ్దూర్ సంఫ్(ఐఎన్టీయూసీ) స్వామి, శ్రామికశక్తి తెలంగాణ బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులు అనుసూయ, తెలుగునాడు బీడీ కార్మిక యూనియన్(టీఎన్టీయూసీ) ఇస్మాయిల్ పటేల్, టీఆర్ఎస్ కేవీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మౌలానా, నవ తెలంగాణ బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఖాజా మోహినుద్దీన్ మాట్లాడారు. ఈ రాష్ట్ర సదస్సుకు నరేందర్, సిద్ధిరాములు, గోవర్ధన్, రాజన్న, లింగం, నరసింహులు, లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. తెలంగాణ బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర నాయకులు నూర్జహాన్ వేదికపైకి నాయకులను ఆహ్వానించారు.

సంప్రదాయం పేరుతో లింగ సమానత్వాన్ని అడ్డుకుంటారా?

ఆర్‌ఎస్ఎస్, బీజేపీ నేతలకు సురవరం సూటి ప్రశ్న

- పార్లమెంటు ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలి
- ప్రధాని హోదాలో మోడీ అబద్ధాలు
- రాఫెల్‌పై జేపీసీ వేయాల్సిందే


మాట్లాడుతున్న సురవరం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సంప్రదాయం పేరుతో లింగసమానత్వాన్ని అడ్డుకుంటారా?అని ఆర్‌ఎస్ఎస్-బీజేపీ నేతలను సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి సూటిగా ప్రశ్నించారు. 1991కు ముందు లేని సంప్రదాయం ఇప్పుడెందుకని అడిగారు. 1991 వరకు స్త్రీలు శబరిమలలోకి ప్రవేశించే వారని గుర్తు చేశారు. స్త్రీకి ఆస్తి హక్కు, స్వేచ్ఛ ఉండొద్దనీ ఆర్‌ఎస్ఎస్, బీజేపీ కోరుకుంటున్నాయని చెప్పారు. చివరికి దేవుడిని సందర్శించే హక్కునూ కాలరాస్తున్నాయని విమర్శించారు. దీన్ని ప్రజలంతా ఖండించాలని అన్నారు. ప్రధాన మంత్రి హోదాలో నరేంద్ర మోడీ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని చెప్పారు. ఆర్‌ఎస్ఎస్-బీజేపీ చెప్పిన అంశాలనే ప్రభుత్వ భావాలుగా చెప్పడం సరైంది కాదన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శబరిమలలో ఆర్‌ఎస్ఎస్-బీజేపీ సాగిస్తున్న హింసాకాండకు మోడీ ప్రభుత్వం అండ ఉందన్నారు. శబరిమలపై సుప్రీం కోర్టు తీర్పును బీజేపీ స్వాగతించడం లేదన్నారు. అదే రాఫెల్‌పై సుప్రీం తీర్పును స్వాగతిస్తోందనీ, జేపీసీ ఎందుకని ప్రశ్నిస్తున్నారనీ చెప్పారు. కేరళలో సుప్రీం తీర్పును అమలు చేయాలని మానవహారం చేయడం అభినందనీయమని అన్నారు. కమ్యూనిస్టులు మతానికి వ్యతిరేకం కాదనీ, మతోన్మాదానికి వ్యతిరేకమని చెప్పారు. కమ్యూనిస్టు ప్రభుత్వాలు ఎక్కడా మతాలను రద్దు చేయలేదని గుర్తు చేశారు. కేరళలో నంబూద్రిపాద్ ప్రభుత్వం వచ్చిన కొత్తలోనూ ఇలాంటి ఘటనలే జరిగాయని చెప్పారు. చివరికి కేంద్రం కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని రద్దు చేసిందన్నారు. ఇప్పుడే దాన్ని పునరావృతం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని విమర్శించారు. ఆర్‌ఎస్ఎస్ రాజ్యాంగానికి, మహిళల సమానత్వానికి వ్యతిరేకమని అన్నారు. శబరిమల ఆలయంలోకి మహిళలను రానివ్వకపోవడమంటే మనుధర్మాన్ని పాటించడం తప్ప మరొకటి కాదన్నారు. మోడీ ప్రశ్నించడాన్ని తట్టుకోలేరనీ, అందుకే విలేకరుల సమావేశం నిర్వహించడం లేదని విమర్శించారు. మన్‌కీబాత్, ఇతర సమావేశాలు, బహిరంగసభల్లో మాట్లాడ్డం తప్ప ప్రశ్నలు స్వీకరించడం లేదన్నారు. కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ తెలియదనడం ఈ ఏడాదిలోనే పెద్ద జోక్ అని అన్నారు. ఇలాంటి మాటలతో ఎవరిని నమ్మిస్తారని చెప్పారు. నిజాలు నిగ్గుతేలాలంటే రాఫెల్‌పై జేపీసీ వేయాల్సిందేనని డిమాండ్ చేశారు. నల్లధనాన్ని తెల్లధనంగా చేసేందుకే నోట్లు రద్దు చేశారని అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీకి వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

సార్వత్రిక సమ్మెకు సీపీఐ మద్దతు

ఈనెల 8,9 తేదీల్లో కేంద్ర కార్మిక సంఘాలు చేపట్టే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సురవరం సుధాకర్‌రెడ్డి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, కనీస వేతనాల అమలు, అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత కోసం సమ్మె జరుగుతోందన్నారు. కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. కార్మికుల్లో పెల్లుబుకుతున్న అసంతృప్తిని అర్థంచేసుకొని సమస్యలు పరిష్కరించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

ప్రతిపక్షాల్లేని ప్రజాస్వామ్యం ప్రమాదం : చాడ

రాష్ట్రంలో ప్రతిపక్షాల్లేని ప్రజాస్వామ్యం కావాలని టీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ కోరుకుంటున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ఎద్దేవా చేశారు. ప్రతిపక్షాల్లేని ప్రజాస్వామ్యం ప్రమాదకరమని అన్నారు. జిల్లాల పెంపునకు ప్రాతిపదిక ఏంటో, ఎందుకు పెంచుతున్నారో కేసీఆర్‌కే తెలుసని చెప్పారు. ఎన్ని జిల్లాలు పెంచితే అంత గొప్ప అని భావిస్తున్నారని ఎద్దేవా చేశారు. బీసీల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 23 శాతానికి తగ్గించడం సమంజసం కాదన్నారు. బీసీలకు జరిగిన అన్యాయాన్ని సరిచేయాలనీ, లేదంటే తగిన మూల్యం చెల్లించకతప్పదని హెచ్చరించారు.

కార్మికుల్ని బానిసలుగా మార్చే కుట్ర

పార్లమెంట్ ముందుకు కార్మిక చట్టాల నిర్వీర్య బిల్లు

- కార్మిక, కర్షక, ప్రజా ప్రయోజనాల దృష్ట్యానే 8, 9 తేదీల్లో సార్వత్రిక సమ్మె
- సమ్మెను జయప్రదం చేయండి : ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉజ్జిని రత్నాకర్‌రావు

'కార్పొరేట్‌శక్తుల చేతుల్లో కార్మికుల్ని బానిసలుగా చేసే కుట్ర సాగుతున్నది. అందులో భాగంగానే కార్మిక చట్టాల నిర్వీర్యానికి మోడీ సర్కారు తెరలేపింది. 8 పనిగంటల విధానానికి తూట్లు పొడిచి పొడిగించే యత్నాన్ని తీవ్రతరం చేసింది. కార్మికుల కనీస హక్కులను, రక్షణలను, సంక్షేమ పథకాలను అమలు పర్చలేని దుర్భర పరిస్థితులను సృష్టిస్తోంది. పర్మినెంట్ ఉద్యోగ వ్యవస్థకు తిలోదకాలిస్తూ కార్మికులను వాడుకుని వదిలేసే పూర్తి దుర్మార్గ చర్యకు పూనుకుంటున్నది. మరోవైపు నిత్యావసర సరుకుల ధరల నియంత్రణ చట్టానికి తూట్లు పొడిసింది. రైతాంగం తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోయేలా చేస్తున్నది. ఇలా కార్మిక, కర్షక బాగోగులను పట్టించుకోవడం మానేసి కార్పొరేట్ల సేవలో మోడీ సర్కారు మునిగితేలుతున్నది. ఈనేపథ్యంలో ప్రజా ప్రయోజనాల దృష్ట్యానే అనివార్యంగా 8, 9 తేదీల్లో సమ్మెకు దిగాల్సి వచ్చింది' అని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఉజ్జిని రత్నాకర్‌రావు చెప్పారు. రెండు రోజుల సార్వత్రిక సమ్మెకు సంబంధించి నవతెలంగాణ ప్రతినిధికి ఇంటర్వ్యూ ఇచ్చారు.

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రశ్న : రెండు రోజుల పాటు సమ్మెకు ఎందుకు దిగాల్సి వచ్చింది?

జవాబు : పరిశ్రమల యాజమాన్యాలకు మేలు చేసేలా 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా కుదిస్తూ రూపొందించిన బిల్లును మోడీ సర్కారు పార్లమెంటు ముందుకు తీసుకెళ్లింది. ఇతర దేశాల నుంచి పెట్టుబడులను ఆహ్వానించి ఇక్కడ ఉత్పత్తులు తయారు చేసుకుని మార్కెట్లు పెంచుకునేలా బహుళజాతి సంస్థలకు వెసులుబాటు కల్పించేందుకే ఈ చర్యకు పూనుకున్నది. కార్మికులకు సామాజిక భద్రతగా దోహదపడుతున్న ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాట్యూటీ, పింఛన్ వంటి వాటిని తొలగించే కుట్రను ముమ్మురం చేసింది. ఇంకోవైపు పర్మినెంట్ ఉద్యోగ వ్యవస్థను, 8 గంటల పనివిధానాన్ని తొలగించి కార్పొరేట్ల చేతుల్లో కార్మికుల్ని బానిసలుగా చేసే ప్రమాదకర కుట్ర దేశంలో చాపకింద నీరులా జరుగుతున్నది. కార్మికుల సంక్షేమ నిధిని షేర్‌మార్కెట్‌లో పెట్టాలన్న సర్కారు నిర్ణయం దుర్మార్గం. భారతదేశంలో అసంఘటిత రంగంలో ఉన్న 47 కోట్ల మంది కార్మికులకు ఎలాంటి చట్టాలు, సంక్షేమ పథకాలు వర్తించట్లేదు. సుప్రీం కోర్టు ఆదేశించినా..సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనం అమలులో సర్కారు చోద్యంగా చూస్తున్నది. మరోవైపు కనీసం వేతనాలు కార్మికులకు అందకపోక...నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. ఇంకోవైపు పండించిన పంటలకు కనీస మద్దతు ధర దొరక్క రైతాంగం అల్లాడుతున్నది. ఇలా మోడీ సర్కారు అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా అనివార్యంగా సమ్మెకు దిగాల్సి వచ్చింది.

ములాఖాత్



రైల్వే, రక్షణ, ఆర్టీసీ, ఆటో యూనియన్లు కూడా సమ్మెలో పాల్గొనటానికి కారణమేమి?

పబ్లిక్ రవాణా రంగంలో కీలకంగా ఉన్న రైల్వే, ఆర్టీసీలను ప్రయివేటుపరం చేసే చర్యలను మోడీ సర్కారు వేగతరం చేసింది. ఇప్పటికే 400 రైల్వే స్టేషన్లు ప్రయివేటుపరం చేసింది. ఆర్టీసీకి లాభాలు తెచ్చిపెడుతున్న కీలక రూట్లను ప్రయివేటు ట్రాన్స్‌పోర్టు యాజమాన్యాల చేతుల్లో పెట్టేందుకు ఆర్టీసీని నిర్వీర్యం చేస్తున్నది. ప్రమాదకరమైన రోడ్డు స్టేఫ్టీ బిల్లును తెస్తోంది. దీంతో భారమంతా డ్రైవర్లమీదే పడనున్నది. ఇది ప్రమాదకరం. రక్షణ రంగంలోకి విదేశీ పెట్టుబడులను ఆహ్వానించడం అంటే దేశ సార్వభౌమత్వాన్ని తాకట్టుపెట్టడమే. మోడీ సర్కారు అనుసరిస్తున్న ఈ చర్యలతో రక్షణ, రైల్వే, ఆర్టీసీలు కూడా అనివార్యంగా పాల్గొంటున్నాయి.

సమ్మెలో ఏయే కార్మిక సంఘాలు పాల్గొంటున్నాయి?

11 కేంద్ర కార్మిక సంఘాలుండగా...అందులో ఒక్క బీఎంఎస్(బీజేపీ అనుబంధం) అన్ని సంఘాలూ పాల్గొంటున్నాయి. దీనికి తోడు దేశ వ్యాప్తంగా ఉన్న బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, కోల్, ఎల్ఐసీ, ఫార్మా, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్నభోజన కార్మికులు, ఆటోరిక్షా, ఇలా 400 ఇండిపెండెంట్ యూనియన్లు సమ్మెలో పాల్గొననున్నాయి. అయితే, రక్షణ, రైల్వే రంగాల్లో నిరసన కార్యక్రమాలు మాత్రమే చేపట్టనున్నారు. వారు పూర్తిస్థాయిలో సమ్మెలో పాల్గొనట్లేదు.

రెండు రోజుల సమ్మె సందర్భంగా ఏయే కార్యక్రమాలు చేపట్టనున్నారు?

దేశవ్యాప్త సమ్మెలో భాగంగా 8వ తేదీన కార్మికులంతా హైదరాబాద్‌లో భారీ ప్రదర్శన చేపట్టాలని ఆల్ ట్రేడ్ యూనియన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశంలో నిర్ణయించడం జరిగింది. చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో అన్ని రంగాల కార్మికులు పాల్గొననున్నారు. తొమ్మిదో తేదీన మండల, డివిజన్, జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నాం. ఆర్టీసీ, సింగరేణి సంస్థలో గుర్తింపు సంఘాలుగా ఉన్న టీఆర్ఎస్ పార్టీ టీఆర్ఎస్‌కేవీ అనుబంధ యూనియన్లు పూర్తిస్థాయిలో మద్దతు ప్రకటిస్తే తెలంగాణలో సమ్మె పూర్తిగా విజయవంతమవుతుంది. గ్రామపంచాయతీ, జీపీ, మధ్యాహ్నభోజన కార్మికులు, ఆటో డ్రైవర్లు ఈ సమ్మెలో స్వచ్ఛందంగా పాల్గొనబోతున్నారు.

డిగ్రీ కాలేజీల్లో తనిఖీలు!

- త్వరలో నిపుణుల కమిటీ నియామకం
- ఉన్నత విద్యామండలి కసరత్తు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రయివేటు డిగ్రీ కాలేజీల్లో తనిఖీలకు రంగంసిద్ధమైంది. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (టీఎస్‌సీహెచ్ఈ) అధికారులు ఈ దిశగా కసరత్తు ప్రారంభించినట్టు సమాచారం. తనిఖీల కోసం త్వరలోనే నిపుణుల కమిటీని నియమించే అవకాశమున్నది. ఆ కమిటీ అన్ని విశ్వవిద్యాలయాల పరిధిలోని డిగ్రీ కాలేజీలను సందర్శించనుంది. ప్రధానంగా ప్రమాణాలపై కాలేజీ యాజమాన్యాలను ఆరా తీయనుంది. విశ్వవిద్యాలయాల నిబంధనలకు అనుగుణంగా కాలేజీలు, తరగతి గదులు, మౌలిక వసతులు, అర్హత గల బోధన, బోధనేతర సిబ్బంది, ల్యాబోరేటరీలు, గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్‌లు ఇలా అన్ని అంశాలనూ పరిగణనలోకి తీసుకొని తనిఖీలు చేపట్టనుంది. ఒక అడ్రస్ పేరుతో ఇంకో స్థలం వద్ద కాలేజీ నడపడాన్ని తీవ్రంగా పరిగణించనుంది. ఈ అంశాన్నీ తనిఖీ చేయనుంది. రాష్ట్రంలో 2018-19 విద్యాసంవత్సరంలో 1041 ప్రభుత్వ, ప్రయివేటు డిగ్రీ కాలేజీలున్నాయి. వాటిల్లో 4,03,002 సీట్లున్నాయి. 2,03,201 సీట్లు భర్తీ అయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 1,99,801 సీట్లు మిగిలి ఉన్నాయి. రాష్ట్రంలో 864 ప్రయివేటు డిగ్రీ కాలేజీలున్నాయి. ఆయా కాలేజీల్లో తనిఖీలు చేపట్టేందుకు ఉన్నత విద్యామండలి అధికారులు కసరత్తు చేస్తున్నారు. రాష్ట్రంలో జరిగిన ముందస్తు ఎన్నికల్లో కేజీ టు పీజీ ప్రయివేటు విద్యాసంస్థల జేఏసీ పేరుతో కాంగ్రెస్ నేతృత్వంలోని మహాకూటమికి మద్దతు ప్రకటించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో టీఆర్ఎస్ రెండోసారి అధికారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలోనే ప్రయివేటు డిగ్రీ కాలేజీల్లో తనిఖీలు జరిపేందుకు సిద్ధమవుతున్నట్టు కొన్ని ఆరోపణలు వస్తున్నాయి. తెలంగాణ ఆవిర్భావం తర్వాత ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో తనిఖీలు జరిగాయి. దీంతో ప్రమాణాలు పాటించని కాలేజీలు స్వచ్ఛంధంగా మూతపడ్డాయి. కొన్ని కాలేజీల్లోని కోర్సులకు ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. ప్రమాణాలు పాటించిన కాలేజీలే మనుగడ సాధించాయి. ఇదే పద్ధతిని ప్రయివేటు డిగ్రీ కాలేజీలకూ వర్తింపచేయాలని టీఆర్ఎస్ ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం.

సాంఘిక బహిష్కరణ చేసిన పెత్తందారులను శిక్షించాలి: కేవీపీఎస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దళితులను సాంఘిక బహిష్కరణ చేసిన గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ)ల పెత్తందారులను కఠినంగా శిక్షించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాజ్యాంగేతర శక్తిగా వీడీసీల ముసుగులో అగ్రకుల పెత్తందారులు మారంపల్లి దళితులను సాంఘిక బహిష్కరణ చేశాయని తెలిపారు. తక్షణమే ఆ పెత్తందారులను అరెస్టు చేయాలనీ, కఠినంగా శిక్షించాలనీ డిమాండ్ చేశారు. వీడీసీల పేరుతో పెత్తందారులు రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అవమాన పరుస్తున్నారని తెలిపారు. అంబేద్కర్ భవన్ నిర్మాణాన్ని అడ్డుకోవడం హేయమైన చర్య అని పేర్కొన్నారు.

షట్‌డౌన్ ఎత్తివేతకు ఆమోదం



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కాదని ప్రతినిధుల సభ సభ్యులు యూఎస్ షట్‌డౌన్ ఎత్తేసేందుకు వీలుగా బిల్లును ఆమోదించారు. అమెరికా-మెక్సికో సరిహద్దులో గోడ నిర్మాణానికి నిధులు కేటాయించాలని ట్రంప్ చేస్తున్న డిమాండ్‌ను పక్కన పెట్టి.. ఎలాంటి నిధులు ఇవ్వకుండానే సభ బిల్లును ఆమోదించింది. గత నవంబరులో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో ప్రతినిధుల సభలో డెమోక్రాట్లు ఆధిక్యం సాధించిన సంగతి తెలిసిందే. దీంతో, రిపబ్లికన్లు వ్యతిరేకించినప్పటికీ డెమోక్రాట్ల మెజార్టీ ఉండటంతో బిల్లులు ఆమోదించారు. అయితే సెనేట్‌లో రిపబ్లికన్లదే పైచేయి.

ఒకవేళ యూఎస్ కాంగ్రెస్ గోడకు నిధులు కేటాయించకుండా బిల్లును ఆమోదించినట్టయితే ట్రంప్ వీటో అధికారాలతో దాన్ని రద్దు చేస్తానని హెచ్చరిస్తున్నట్టు సమాచారం. మెక్సికో సరిహద్దులో గోడ నిర్మాణానికి నిధులు కేటాయించేంత వరకు ద్రవ్య వినిమయ బిల్లుపై సంతకం పెట్టేదిలేదని ట్రంప్ వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే నిధుల కేటాయిపునకు డెమోక్రాట్లు అంగీకరించడం లేదు. తాజాగా ప్రతినిధుల సభకు స్పీకర్‌గా ఎంపికైన డెమోక్రాట్ నేత నాన్సీ పెలోసి మరోసారి ఆ విషయాన్ని స్పష్టంచేశారు. ఇరు వర్గాలు వెనక్కి తగ్గకపోవడంతో గత రెండు వారాలుగా అమెరికాలో పాక్షిక షట్‌డౌన్ కొనసాగుతోంది. పలు ప్రభుత్వ కార్యక్రమాలకు నిధులు అందడం లేదు. ఎంతో మంది ఫెడరల్ ఉద్యోగులు జీతాలు లేకుండా పనిచేయాల్సి వస్తోంది.

త్వరలో కిమ్-ట్రంప్ భేటీ

- కిమ్ లేఖ అందిందన్న ట్రంప్

ఉ.కొరియా అధ్యక్షుడు కిమ్‌జోంగ్ ఉన్ రాసిన లేఖ తనకు అందిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. సమీప భవిష్యత్‌లోనే తామిరువురి మధ్య మలి భేటీ వుంటుందని భావిస్తున్నానని ఆయన బుధవారం ఇక్కడ చెప్పారు. వైట్‌హౌస్‌లో జరిగిన ఈ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను కిమ్‌జోంగ్ ఉన్ నుండి గొప్ప లేఖను అందుకున్నానని చెప్పారు. త్వరలోనే తమ మధ్య మరో భేటీ వుంటుందని, బహుశ ఇది సమీప భవిష్యత్‌లోనే జరిగే అవకాశాలున్నాయని ఆయన వివరించారు. అంతకు ముందు డిసెంబర్ చివరిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, కిమ్‌తో భేటీ జనవరి లేదా ఫిబ్రవరిలో వుండవచ్చని చెప్పిన విషయం తెలిసిందే. కొరియా ద్వీపకల్పం అణు నిరాయుధీకరణకు సంబంధించి ఉ.కొరియా ఇటీవలి కాలంలో కొన్ని సానుకూల సంకేతాలు పంపుతున్న నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయటం గమనార్హం. కొత్త సంవత్సర సందేశంలో కిమ్ మాట్లాడుతూ తాను అణు నిరాయుధీకరణ ప్రక్రియను కొనసాగిస్తానని, ట్రంప్‌తో ఎప్పుడైనా మలి భేటీకి తాను సిద్ధంగా వున్నానని చెప్పిన విషయం తెలిసిందే.

బ్రెగ్జిట్ డీల్‌కి ఆమోదం కష్టమే..!

- ఒప్పందాన్ని తిరస్కరించొద్దంటున్న మంత్రులు



లండన్: యూరోపియన్ యూనియన్ (ఈయూ)తో బ్రిటన్ ప్రధాని థెరిస్సా మే కుదుర్చుకున్న బ్రెగ్జిట్ ఒప్పందానికి పార్లమెంటు ఆమోదం తెలిపే అవకాశాలు ఏమాత్రం కన్పించడం లేదు. ఒప్పందం లేకుండానే నిష్క్రమించినట్టయితే దేశానికి తిప్పలు తప్పవని మంత్రులు హెచ్చరించారు. రెండేండ్ల బ్రెగ్జిట్ చర్చల ప్రక్రియ మార్చి29తో ముగియనుంది. ఈ లోగా ఏదో ఒక ఒప్పందం కుదిరితే సరే. లేకుంటే ఒప్పందం లేకుండానే ఈయూ నుంచి బ్రిటన్ బయటకు రావాల్సి ఉంటుంది. థెరిస్సా ఒప్పందాన్ని వ్యతిరేకిస్తున్న అధికార పార్టీ ఎంపీలు కొందరు రెండో రిఫరెండమ్‌కు వెళ్లాలని డిమాండ్ చేస్తున్నారు. ఉన్నంతలో ఇదే మెరుగైన ఒప్పందం ఇదేనని మంత్రులు వాదిస్తున్నారు. నోడీల్ వల్ల ఉత్పత్తి ఖర్చులు , ఎగుమతి సుంకాలు పెరిగిపోయి బ్రిటిష్ రైతులు, ఆహార సంస్థలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పర్యావరణ మంత్రి గోవ్ హెచ్చరించారు. అంతేగాకుండా, సరిహద్దుల్లో తనిఖీలు పెరిగినట్టయితే రేవుల్లో సరుకుల ఎగుమతులు దిగుమతలు మందగిస్తాయని ఆయన తెలిపారు. ఈ ఒప్పందంపై ఈ నెల14 న ఓటింగ్ జరగనుంది. థెరిస్సా ఒప్పందానికి ప్రధాన అడ్డంకి 'బ్యాక్‌స్టాప్'కు వ్యతిరేకత. స్టాప్ గ్యాప్ అనేది ఉత్తర ఐర్లాండ్‌కు, ఈయూలోని ఐర్లాండ్ రిపబ్లిక్‌కు మధ్య రాకపోకలు, సరుకుల రవాణా, సుంకాల విధింపు, తనిఖీలకు సంబంధించినది. థెరిస్సా ఒప్పందాన్ని బ్రిటిష్ ఎంపీలు ఎక్కువ మంది వ్యతిరేకించడానికి ఈ 'బ్యాక్ స్టాప్' అంశమే ప్రధాన కారణం. ఐరిష్ సముద్రంలో ఉన్న ఈ దీవిలో ఉత్తర ఐర్లాండ్‌కు, ఐర్లాండ్ రిపబ్లిక్‌కు మధ్య వాణిజ్య సుంకాలు, తనిఖీలు, భద్రతా పరంగా స్పష్టంగా సరిహద్దు రేఖ ఉండాలనేది బ్రిటన్ వాదన. ఈ రెండు దీవుల మధ్య సరిహద్దులు, తనిఖీలు, సుంకాలతో విభజన తీసుకొచ్చినట్టయితే అది ఆ ప్రాంతంలో అశాంతికి దారితీసే అవకాశాలున్నాయి. ఈయూ జోన్‌లోని వాణిజ్య నిబంధనలే ఈ దీవి వరకు అమలు చేయాలని ఇయు వాదిస్తోంది. ఈ సమస్య ఇప్పట్లో తేలేది కాదు కాబట్టి బ్రెగ్జిట్ గడువు దగ్గర పడుతున్నందున మిగతా వాటిపై ఒక ఒప్పందానికి వచ్చి ఈ అంశం వరకు తర్వాత చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చంటూ ఈయూతో థెరిస్సా రాజీ పడ్డారు. దీనివల్ల బ్రిటన్ నిష్క్రమణ తర్వాత కూడా తన దేశ సరిహద్దులు, వాణిజ్య సుంకాల నియంత్రణకు సంబంధించిన స్వేచ్ఛను కోల్పోతుంది.

చైనా చేతిలో తిరుగులేని అస్త్రం..

'మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్'

బీజింగ్: అభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానంలో అమెరికాతో పోటీపడుతున్న చైనా..రక్షణ రంగంలోనూ ఆ దేశానికి ధీటుగా ఎదుగుతోంది. అమెరికా తయారుచేసుకున్న 'మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్'కు ధీటుగా చైనా ఇప్పుడో భారీ బాంబ్‌ను తయారుచేసుకుంది. చైనా రక్షణ రంగం నోరింకో (చైనా నార్త్ ఇండస్ట్రీస్ (గ్రూప్ కార్పోరేషన్ లిమిటెడ్) రూపొందించిన ఈ నాన్ న్యూక్లియర్ బాంబ్‌కు సంబంధించి చైనా మీడియా ప్రసారం చేసింది. చైనాకు చెందిన 'మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్'గా దీన్ని పరిగణిస్తున్నారు. చైనా రక్షణ శాఖ నోరింకోకి చెందిన అధికారిక వెబ్‌సైట్‌లో దీనికి సంబంధించిన ఓ ప్రమోషనల్ వీడియోను పోస్ట్ చేశారు. హెచ్-6కే బాంబర్ ద్వారా దీన్ని ప్రయోగించగా భారీ పేలుడు చోటు చేసుకుంది. ప్రమోషనల్ వీడియోలో ఆ దృశ్యాలన్ని కనిపించాయి. బాంబు పొడవు సుమారు ఐదు నుంచి ఆరు మీటర్లు ఉంటుందని చైనా డిఫెన్స్ అనలిస్ట్ వియ్ డొంగ్‌జు తెలిపారు. ఈ బాంబును ప్రయోగించడం ద్వారా అనుకున్న లక్ష్యాన్ని పూర్తిగా విధ్వంసం చేయవచ్చునని, పెద్ద భవనాలు, డిఫెన్స్ శిబిరాలను సైతం నామరూపాల్లేకుండా చేయవచ్చునని అన్నారు. అమెరికా బాంబుతో పోలిస్తే దీని బరువు, పొడవు తక్కువగానే ఉంటుందన్నారు. అమెరికా బాంబును తరలించాలంటే కచ్చితంగా ఎయిర్‌క్రాఫ్ట్ కావాల్సిందేనని, అదే చైనా బాంబును 'బాంబర్' సాయంతో ఎక్కడికైనా తరలించవచ్చునని చెప్పారు. అన్ని రంగాల్లోనూ అగ్రరాజ్యం అమెరికాను బలంగా ఢీకొంటున్న చైనా.. ఇప్పుడు రక్షణ రంగంలోనూ తమ సత్తా ఏంటో చాటింది.




'కాశ్మీర్లో వారిని కాల్చి చంపుతాం. కేరళలో వారినే భక్తులంటాం' అనే శీర్షికతో 'టెలిగ్రాఫ్ ప్రచురించిన ఫోటో ఇది. వివిధ ఆందోళనల సందర్భంగా రాళ్లు విసిరే కాశ్మీరీ యువతపై పెద్ద ఎత్తున నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అణచివేత చర్యలకు దిగుతున్న విషయం తెలిసిందే. శబరిమల దేవాలయంలోకి ఇద్దరు మహిళల ప్రవేశానంతరం బీజేపీ ఆర్ఎస్ఎస్ గుండాలు రాళ్లు, బాంబులు విసురుతూ హింసాకాండకు దిగుతున్నా వారిని భక్తులంటూ వెనకేసుకురావడాన్ని ప్రస్తావిస్తూ టెలిగ్రాఫ్ ఈ ప్రశ్న వేసింది.

మాక్రన్ విధానాల పట్ల ప్రజల్లో అసంతృప్తి

పారిస్ : ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రన్ విధానాల పట్ల దేశంలోని మూడు వంతుల మంది ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఆయన తొందరపాటు నిర్ణయాలను మంత్రివర్గ సభ్యులు కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని ఒడెక్సా అనే సంస్థ నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. దేశ జనాభాలో కేవలం 25శాతం మంది మాత్రమే మాక్రన్ ప్రభుత్వం పట్ల సంతోషంగా ఉన్నారరని ఆ సర్వే పేర్కొంది. గతేడాది ఏప్రిల్‌లో 59శాతం మంది ప్రజలు మాక్రన్ పట్ల అసంతృప్తిగా ఉంటే అది ఇప్పుడు 75శాతానికి చేరింది. కింది స్థాయి కార్మికులు, రైతుల నుంచే కాకుండా ఎగువ, మధ్య తరగతి ఆదాయవర్గాల నుంచి కూడా ప్రభుత్వం తీరు పట్ల అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రధాని, హోం మంత్రులతో పాటు కీలకమైన స్థానాల్లో ఉన్న పలువురి పట్ల కూడా ప్రజలు చాలా అసంతృప్తితో ఉన్నారు. ప్రధానిని వ్యతిరేకిస్తున్నవారు 54శాతం మంది ఉండగా హోం మంత్రిని వ్యతిరేకిస్తున్న వారు 53శాతం మంది ఉన్నారు. ఇదిలావుండగా, ఫ్రాన్స్‌లో ఇంధన ధరల పెంపును నిరసిస్తూ ఆందోళనలు కొనసాగుతున్నాయి.

సూడాన్‌లో కొనసాగుతున్న నిరసనలు

- అధ్యక్షుడు రాజీనామా చేయాలని డిమాండ్



ఖార్‌తౌమ్ : సూడాన్ అధ్యక్షుడు ఒమర్ అల్ బషీర్ తక్షణమే రాజీనామా చేయాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. అంబుర్‌మాన్ నగర వీధుల్లోకి వందలాది మంది తరలివచ్చి బషీర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్లకార్డులు, బ్యానర్లు చేబూని 'ప్రెసిడెంట్ స్టెప్‌డౌన్' అంటూ బిగ్గరగా నినాదాలు చేశారు. కాగా, సూడాన్‌లో నిత్యావసర, చమురు ధరలు విపరీతంగా పెరిగాయి. ధరల పెంపును నిరసిస్తూ గతేడాది డిసెంబర్19న ప్రారంభమైన నిరసనలు ఇంకా కొనసాగుతున్నాయి. ఓ పక్క నిరసనలు ఉవ్వెత్తున ఎగిసిపడుతుంటే అధ్యక్షుడు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో నిరసనలు ఉధృ తమయ్యాయి. బషీర్ తక్షణమే రాజీనామా చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఆయన 30ఏండ్ల నిరంకుశ పాలనలో తామెంతో నష్టపోయామని అన్నారు. సూడాన్ అభివృద్ధి పథంలో పయణించాలంటే బషీర్ తక్షణమే అధ్యక్ష పదవి నుంచి వైదొలగాలని డిమాండ్ చేశారు.

థాయ్‌ను తాకిన 'పబుక్' తుఫాను

బ్యాంకాక్ : పబుక్ తుఫాను థాయ్‌లాండ్‌ను తాకింది. తీరం వెంబడి బలమైన ఈదురుగాలులు వీస్తున్నాయి. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలమట్టమయ్యాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నఖోన్సీ తమ్మారా ప్రావిన్స్‌లోని వందలాది ఇండ్లు ధ్వంసమయ్యాయి. దీంతో, వందలాది మంది నిరాశ్రయులయ్యారు. కోహ్ సమూయ్, కోహ్ తావు, కోహ్ ఫాన్గాన్ దీవులను సందర్శించేందుకు వచ్చిన పర్యాటకులు తుఫానులో చిక్కుకున్నారు. తుఫాను తాకిడితో విమానాశ్రయాలు తాత్కాలికంగా మూతపడ్డాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప ఇండ్ల నుంచి బయటకు రావొద్దని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. కోహ్ ఫాన్గాన్ జిల్లా కలెక్టర్ క్రిక్‌రాయ్ సోంగ్తానే తుఫాను సంభవించిన ప్రాంతాల్లో పర్యటించారు. దాదాపు 10వేల మంది కోహ్ ఫాన్గాన్ దీవిలో చిక్కుకున్నారని చెప్పారు. సహాయక చర్యలు చేపట్టామని అన్నారు. థస్లా జిల్లాలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు అధికారులు తెలిపారు. ప్రాణ, ఆస్తినష్టానికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు. తుఫాను నేపథ్యంలో థాయ్‌లాండ్ పర్యటనను రద్దు చేసుకోవాలని బ్రిటన్ విదేశాంగ మంత్రి బ్రిటిషర్లను హెచ్చరించింది. కాగా, 1989లో గే తుఫాను థాయ్‌లాండ్‌ను అతలాకుతలం చేసింది. ఈ విపత్తులో వందలాది మంది మృతిచెందారు.

ఐరిష్‌తో వందశాతం పారదర్శకత

రాష్ట్ర సివిల్ సప్లయి కమిషనర్ అకున్ సభర్వాల్

- సిరిసిల్ల జిల్లాలో రేషన్ దుకాణాల తనిఖీ



ఐరిష్ విధానాన్ని పరిశీలిస్తున్న అకున్ సభర్వాల్

నవతెలంగాణ- సిరిసిల్ల/తంగళ్లపల్లి

కంటి చూపు(ఐరిష్) ఆధారంగా రేషన్ సరుకుల పంపిణీలో వందశాతం పారదర్శకత సాధ్యపడుతుందనీ, అర్హులకే నిత్యావసర సరుకులు అందుతాయనీ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ అకున్ సభర్వాల్ అన్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా జేసీ యాస్మిన్‌బాషాతో కలిసి తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి, రామన్నపల్లె, సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్, ప్రగతినగర్‌లోని రేషన్ షాపుల్లో ఐరిష్ ఆధారిత సరుకుల పంపిణీని శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

ఈ-పాస్ విధానంలో వేలి ముద్రలు అరిగిన వృద్ధులు, పనిచేసే శ్రామికులు, కొన్ని దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి సరుకులు తీసుకోలేని పరిస్థితి ఉందన్నారు. దీనికి పరిష్కారం కోసం ప్రభుత్వం కంటి చూపు ఆధారంగా సరుకులు అందించేందుకు ఐరిష్ విధానాన్ని జనవరి-1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులోకి తెచ్చిందన్నారు.

జేసీ యాస్మిన్ బాషా మాట్లాడుతూ.. జిల్లాలోని 344చౌకధరల దుకాణాల్లో లక్షా71వేల ఆహార భద్రత కార్డుదారులకు సకాలంలో సరుకులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుం టామన్నారు.

అవినీతి రహిత సమాజమే లక్ష్యం

- ఆల్ ఇండియా యాంటీ కరప్షన్ కమిటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అవినీతి రహిత సమాజంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఆల్ ఇండియా యాంటీ కరప్షన్ కమిటీ తెలిపింది. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ కమిటీ తెలంగాణ స్టేట్ కమిటీ చైర్మెన్ అనూప్ చక్రవర్తి మాట్లాడారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారిధిగా తమ సంస్థ పని చేస్తుందన్నారు.

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం, ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతిని అంతమొందించడంలో చురుకైన పాత్ర పోషిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో విశ్వనాథ్, రేట్ల, పద్మజ, పూర్ణచందర్‌గౌడ్, సాయిచందన్, గౌతమ్ యాదవ్, స్వరూప్, దిలీప్, శరత్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను సవరిస్తే సహించేది లేదు

దేశ భద్రత కోసమే సమ్మె : సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు

- సార్వత్రిక సమ్మె జీపుజాతా ప్రారంభం



నవతెలంగాణ-సంగారెడ్డి టౌన్

అనేక త్యాగాలు, పోరాట ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలను సవరిస్తే సహించేది లేదనీ, దేశభద్రత కోసం జరుగుతున్న ఈ సమ్మెలో అందరూ పాల్గొనాలనీ సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అన్నారు. శుక్రవారం సంగారెడ్డి పట్టణంలో సమ్మె ప్రచారజాతాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జాతీయ కార్మిక, ఉద్యోగ సంఘాల ఫెడరేషన్లు ఐక్యంగా సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు. కార్మిక హక్కులకు నష్టం కలిగేలా చట్టాలను సవరిస్తే తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం నాలుగున్నరేండ్లుగా ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను దూకుడుగా కొనసాగిస్తోందన్నారు. వాటిని నిరసిస్తూ 2015, 2016 సంవత్సరాల్లో రెండు అఖిల భారత సమ్మెలను కార్మికవర్గం నిర్వహించిందనీ, 2017 నవంబర్ 9,10,11 తేదీల్లో లక్షలాది మందితో పార్లమెంట్ వద్ద మహాధర్నా నిర్వహించామనీ గుర్తు చేశారు. భారత రైతాంగం ఉప్పెనలా ఉవ్వెత్తున ఉద్యమాలు నిర్వహిస్తున్నా కేంద్ర ప్రభుత్వం తన విధానాన్ని మార్చుకోకుండా కార్పోరేట్లకు కొమ్ముకాస్తోందని విమర్శించారు.

అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గుతున్నా దేశంలో డీజిల్, పెట్రోల్ రేట్ల పెరుగుదలకు కళ్లెం వేయకపోగా, ప్రతి రోజూ పెట్రో ఉత్పత్తుల ధరలను పెంచుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమం, కార్మిక హక్కుల రక్షణ, ఆర్థిక స్వావలంభనను కాపాడుకునేందుకు జరుగుతున్న ఈ సమ్మెలో అన్ని రంగాల కార్మికులు, ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని 2016 అక్టోబర్‌లో సుప్రీంకోర్టు తీర్పునిచ్చి రెండేండ్లు దాటినా అమలు అతీగతీలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ స్కీంలలో పనిచేస్తున్న కోటిమంది ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించేందుకు నిరాకరిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి జయరాజు, సీఐటీయూ ఉపాధ్యక్షులు సాయిలు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ల తొత్తు బీజేపీ

శ్రమజీవులను బానిసలుగా మార్చిన మోడీ

- దేశవ్యాప్త సమ్మెకు తరలిరావాలి: సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సాయిబాబు

నవతెలంగాణ- గోదావరిఖని

స్వదేశీ నినాదంతో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు తొత్తుగా మారి పాలన సాగిస్తోందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సాయిబాబు అన్నారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ ఈ నెల 8, 9 తేదీల్లో జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అన్ని తరగతుల ప్రజలు, కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

మోడీ ప్రభుత్వం అమలు చేసే నయా ఉదారవాద విధానాల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ అమలు, రాఫెల్ కుంభకోణాలు, బ్యాంకింగ్ రంగంలో నష్టాలు తదితరాలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

రక్షణ, రైల్వే, బ్యాంక్ ఇన్సూరెన్స్ రంగాల్లో ఎఫ్‌డీఐలను అనుమతించడం వంటి చర్యలను వ్యతిరేకిస్తూ ఈ సమ్మెను నిర్వహిస్తున్నామని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం కార్మికులకు నష్టం జరిగే రీతిలో కార్మిక చట్టాల సవరణకు పూనుకుని శ్రమ జీవులను బానిసలుగా మార్చే నిర్ణయాలను చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

సాంఘిక, సంక్షేమ నిధి రూ.24లక్షల కోట్లను షేర్ మార్కెట్ వ్యాపారానికి మళ్లించడానికి మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.

నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించి అదుపులో పెట్టాలనీ, కనీస వేతనం నెలకు రూ.18వేలుగా నిర్ణయించాలనీ డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి రెగ్యులరైజ్ చేయాలనీ, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలనీ అన్నారు.

కార్మిక చట్టాల సవరణను ఆపాలనీ, నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలనీ కోరారు. సమ్మెలో పాల్గొనేలా టీఆర్ఎస్ ప్రభుత్వం, దాని అనుబంధ కార్మిక సంఘాలు నిర్ణయం తీసుకోవాలని కోరారు. సింగరేణి గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ నాయకులతో చర్చలు జరుపుతున్నామన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు బుర్ర తిరుపతి, కార్యదర్శి వేల్పుల కుమారస్వామి, ఆర్జీ-1 కార్యదర్శి మెండె శ్రీనివాస్, నర్వెట్ల నర్సయ్య, రంగారావు, ఆనంద్, సాగర్ పాల్గొన్నారు.

అనంతరం ఎన్టీపీసీ గేట్-2 వద్ద కాంట్రాక్టు కార్మిక సంఘాల ఐక్య వేదిక గేట్ మీటింగ్, ఆర్జీ-1 డివిజన్‌లోని సీఎస్పీ గేట్ మీటింగ్‌లో సాయిబాబు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎం.సాయిబాబు

ఆర్ఎస్ఎస్-బీజేపీ మత ఛాందస కుట్రలు తిప్పికొట్టాలి

మహిళల మనోభావాలను గౌరవించాలి

- సుప్రీం తీర్పును అమలు చేస్తున్న కేరళ ప్రభుత్వానికి జేజేలు : సీపీఐ(ఎం)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కేరళ ప్రభుత్వం అమలు చేస్తున్నందుకు సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ జేజేలు పలికింది. ఆర్ఎస్ఎస్-బీజేపీ మతఛాందస కుట్రలకు పాల్పడుతోందనీ, రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చి నిరసనలు, ఆందోళనలు చేస్తూ కేరళలో ఉద్రిక్త పరిస్థితులను రెచ్చగొడుతూ విధ్వంస చర్యలకు పాల్పడుతున్నాయని తెలిపింది. మత ఘర్షణలను రెచ్చగొడుతూ శాంతి భద్రతల సమస్యను సృష్టించాలని చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చింది. ఆర్ఎస్ఎస్-బీజేపీ కుట్రలను ఖండించింది. ఈ మేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాజ్యాంగం కల్పించిన స్త్రీ, పురుష సమాన హక్కులను గౌరవిస్తూ అన్ని వయస్సుల మహిళలకూ ఆలయ ప్రవేశాన్ని అనుమతిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును యథాతథంగా అమలు చేయాలన్న కేరళ ప్రభుత్వ నిర్ణయాన్ని రాజకీయ దురుద్దేశ్యంతో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అడ్డుకుంటున్నాయని తెలిపారు. ఈనెల 1న శబరిమలపై సుప్రీం కోర్టు తీర్పునకు మద్దతుగా లక్షలాది మంది మహిళలు కేరళలో 620 కిలోమీటర్ల పొడవునా మానవహారం నిర్మించి సాంఘిక దురాచారాన్ని రూపుమాపాల్సిన అవసరాన్ని చాటి చెప్పారని పేర్కొన్నారు. అయినప్పటికీ, ఆలయ ప్రవేశపు అంశాన్ని ఆ రాజకీయ పార్టీలు రాజకీయంగా వాడుకుంటూ మత సమీకరణలు చేసి ఘర్షణలు సృష్టిస్తున్నాయని విమర్శించారు. ఆ పార్టీలు మొదట్లో తీర్పును ఆహ్వానించినప్పటికీ, భక్తులలో వున్న ఛాందసభావాలను వాడుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా హింసను, అల్లర్లను ప్రేరేపిస్తున్నాయని తెలిపారు. ప్రణాళిక ప్రకారం హింస, విధ్వంసాన్ని రెచ్చగొడుతున్న శక్తులను లౌకిక, ప్రజాస్వామ్య శక్తులందరూ తిప్పి కొట్టాలని పేర్కొన్నారు. కేరళలో శాంతి భద్రతలను కాపాడేందుకు సహకరించాలని కోరారు.

అజీం ప్రేమ్‌జీ వర్సిటీలో 26 వరకు పీజీ దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్


అజీం ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయంలో ఈ నెల 26వ తేదీ వరకు పీజీ ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని,ఆసక్తి గల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వర్సిటీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ యస్ గిరిధర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

దేశ వ్యాప్తంగా ఎంపికచేయబడిన 30 నగరాల్లో ఫిబ్రవరి పదో తేదీన పరీక్ష నిర్వహిస్తామని, మార్చిలో ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు. పీజీ ప్రవేశ పరీక్షకు సంబంధించిన పూర్తి వివరాల కోసం www. azimapremjiuniversity.edu.in/pg వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

9 నుంచి టీజీటీ, పీజీటీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

టీజీటీ, పీజీటీ అభ్యర్థులకు చెందిన సర్టిఫికెట్లను ఈ నెల తొమ్మిదో తేదీన పరిశీలించనున్నట్టు టీఆర్ఈఐఆర్‌బీ చైర్మెన్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులను 1:2 నిష్పత్తిలో సర్టిఫికెట్ల పరిశీలనకు పిలవనున్నట్టు పేర్కొన్నారు. అభ్యర్థులు పూర్తి వివరాల కోసం www.treird.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. ఐదో తేదీన వెబ్‌సైట్‌లో సబ్జెక్టులవారీగా హాల్‌టికెట్ నెంబర్లను అందుబాటులో ఉంచుతామని తెలిపారు.


బాలకృష్ణ

నో సెన్సార్ కట్స్

నందమూరి బాలకృష్ణ ప్రధాన పాత్రధారిగా నటిస్తున్న బయోపిక్ 'ఎన్టీఆర్ - కథా నాయకుడు'. ఈ చిత్రానికి సంబంధించి సెన్సార్ కార్యక్రమాలు శుక్రవారం పూర్తయ్యాయి. యు సర్టిఫికెట్ సొంతం చేసుకున్న ఈ చిత్రం ఈనెల 9న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సందర్భంగా చిత్రయూనిట్ తెలియజేస్తూ, 'సెన్సార్ పూర్తయ్యింది. ఎలాంటి కట్స్ లేవు. 2 గంటల యాభై నిమిషాల నిడివితో ఈ చిత్రం ఉంటుంది. ఎన్టీఆర్ జీవితం ఆధారంగా రూపొందుతున్న ఈ బయోపిక్‌లో ఎన్టీఆర్‌గా బాలకృష్ణ పరకాయ ప్రవేశం చేశారు. విద్యాబాలన్, ప్రకాష్‌రాజ్, రానా దగ్గుబాటి, సుమంత్, కళ్యాణ్‌రామ్, నరేష్, మురళీ శర్మ, కైకాల సత్యనారాయణ, రకుల్ ప్రీత్‌సింగ్, నిత్యామీనన్, బ్రహ్మానందం తదితరులు నటన ప్రేక్షకులను ఆద్యంతం అలరిస్తుంది. అలాగే ఈ చిత్రానికి ఎం.ఎం.కీరవాణి సమకూర్చిన సంగీతం, జ్ఞానశేఖర్ కెమెరా పనితనం ప్రధాన హైలైట్స్‌గా నిలుస్తాయి' అని తెలిపింది.

నవచిత్రం

13 ఏండ్ల తర్వాత సినిమా..!


వెంకటేష్, వి.వి.వినాయక్

వెంకటేష్, వి.వి.వినాయక్ కాంబినేషన్‌లో 'లక్ష్మీ' సినిమా రూపొంది ఘన విజయం సాధించిన విషయం విదితమే. తాజాగా మరోసారి వీరి కాంబినేషన్‌లో ఓ సినిమా రాబోతుంది. దాదాపు 13 ఏండ్ల తర్వాత వెంకటేష్ హీరోగా వినాయక్ ఓ సినిమాని రూపొందించేందుకు ప్లాన్ చేస్తున్నారు. వినాయక్ గతేడాది రూపొందించిన 'ఇంటలిజెంట్' నిరాశ పరిచింది. ఆ తర్వాత బాలకృష్ణతో సినిమా చేయబోతున్నట్టు వార్తలు వినిపించాయి. కానీ అది ఇప్పట్లో వర్కౌట్ అయ్యేలా లేదు. దీంతో వినాయక్ తాజాగా వెంకటేష్‌కి ఓ కథను నెరేట్ చేశారట. బాగా ఇంప్రెస్ అయిన వెంకీ ఈ సినిమా చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. ప్రస్తుతం వెంకటేష్ 'ఎఫ్2'లో నటిస్తున్నాడు. వరుణ్ తేజ్ మరో హీరోగా నటిస్తున్న ఈ మల్టీస్టారర్‌కి అనిల్ రావిపూడి దర్శకత్వం వహించారు. ఈ నెల 12న సినిమా విడుదల కానుంది.

భారీ కాంబినేషన్‌లో పీరియాడికల్ సినిమా


అమితాబ్ బచ్చన్, ఐశ్వర్యరాయ్, విక్రమ్, శింబు, జయం రవి


మణిరత్నం

మంచి ఫీల్ గుడ్ చిత్రాలకు మణిరత్నం పెట్టింది పేరు. ఇటీవల ఆయన రూపొందించిన సినిమాలు ఆశించిన ఫలితాన్ని రాబట్టలేకపోతున్నాయి. గతేడాది మల్టీస్టారర్ చిత్రం 'నవాబ్'తో పర్వాలేదనిపించుకున్న ఆయన తాజాగా పీరియడ్ నేపథ్యంలో సాగే భారీ మల్టీస్టారర్‌ని రూపొందించాలని ప్లాన్ చేస్తున్నారు. అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కించబోతున్న ఈ సినమాలో బాలీవుడ్ బిగ్ బి అమితాబ్ బచ్చన్ ప్రధాన పాత్ర పోషించనున్నారు. స్క్రిప్ట్ విన్న అనంతరం మణిరత్నంతో కలిసి పనిచేసేందుకు అమితాబ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సమాచారం. ఇదే సెట్ అయితే అమితాబ్, మణిరత్నం కాంబినేషన్‌కిది తొలి సినిమా అవుతుంది. అమితాబ్‌తోపాటు ఐశ్వర్యరాయ్, శింబు, విక్రమ్, జయంరవి ప్రధాన పాత్రధారులుగా ఈ సినిమాలో నటించనున్నారని తెలుస్తోంది. మణిరత్నం దర్శకత్వంలో ఐశ్వర్యరాయ్ 'ఇద్దరు', 'గురు', 'విలన్' చిత్రాల్లో నటించింది. దీంతో ఈ తాజా సినిమాకి కూడా మరో మాట లేకుండా ఐష్ పచ్చ జెండా ఊపిందట. ఏఆర్ రెహ్మాన్ సంగీతం సమకూర్చనున్న ఈ చిత్రానికి జయమోహన్ రైటర్‌గా పనిచేస్తున్నారు. కల్కీ కృష్ణమూర్తి రాసిన 'పొన్నియిన్ సెల్వన్' అనే నవల ఆధారంగా ఈ సినిమాను రూపొందించబోతున్నారు. అమితాబ్ బచ్చన్ ప్రస్తుతం తెలుగులో 'సైరా నరసింహారెడ్డి', హిందీలో 'బద్లా', 'బ్రహ్మాస్త్ర' చిత్రాల్లో నటిస్తున్నారు.

ఊపందుకున్న మహిళా ప్రధాన బయోపిక్‌లు


జయలలిత


కల్పనా చావ్లా


లక్ష్మీ అగర్వాల్


సైనా నెహ్వాల్

బయోపిక్‌లిప్పుడు పలు చిత్ర పరిశ్రమలకు సక్సెస్‌ఫుల్ ఫార్ములా. ఆసక్తికర సంఘటనలు కలిగిన, స్ఫూర్తివంతమైన వ్యక్తుల జీవితాలకు డిమాండ్ బాగుంది. సినిమా పరిశ్రమలో వెలిగిన స్టార్ హీరోలు, హీరోయిన్లు, క్రీడాకారులు, సామాజిక వేత్తలు, శాస్త్రవేత్తలు.. ఇలా గొప్ప వ్యక్తుల జీవితాలను తెరపై ఆవిష్కరించేందుకు దర్శక, నిర్మాతలు ఆసక్తి చూపుతున్నారు. అందులో భాగంగా ప్రస్తుతం బాలీవుడ్‌లో మహిళా ప్రధాన బయోపిక్‌లు ఊపందుకున్నాయి.

తెలుగు, తమిళం, హిందీలో దాదాపు పదికి పైగా మహిళా ప్రధాన బయోపిక్‌లు ఈ ఏడాది తెరకెక్కుతుండటం విశేషం. బయోపిక్స్‌లో బాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న చిత్రం 'మణికర్ణిక: ది క్వీన్ ఆఫ్ ఝాన్సీ'. తొలి భారత స్వాతంత్ర్య సంగ్రామంలో బ్రిటీష్ పాలకులపై పోరాడిన వీర వనిత ఝాన్సీ రాణి లక్ష్మీబాయి జీవిత చరిత్రను ఆధారంగా చేసుకుని ఈ బయోపిక్‌ని రూపొందిస్తున్నారు. క్రిష్, కంగనా రనౌత్ సంయుక్తంగా ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. లక్ష్మీబాయి పాత్రలో కంగన అద్భుత నటనతో మెస్మరైజ్ చేయబోతున్నారు. ఈ నెల 25న సినిమా విడుదల కాబోతుంది. తాజాగా విడుదలైన తెలుగు ట్రైలర్‌కి విశేష స్పందన లభించింది.

మరో ఆసక్తికర బయోపిక్ 'ది ఐరన్ లేడీ'. అలనాటి సినీ నటి, తమిళనాడు మాజీ సీఎం జయలలిత జీవితం ఆధారంగా ప్రియదర్శిని రూపొందిస్తున్న చిత్రమిది. జయలలిత పాత్రలో నిత్యా మీనన్ నటిస్తున్నారు. ఇటీవల విడుదలైన ఫస్ట్‌లుక్ ఆకట్టుకుంది. దీంతోపాటు జయలలిత జీవితం ఆధారంగా సుందర్ సి ఓ బయోపిక్‌ని, గౌతమ్ మీనన్ ఓ వెబ్ సిరీస్‌ని రూపొందించబోతున్నారు. ఢిల్లీకి చెందిన యాసిడ్ దాడి బాధితురాలు లక్ష్మి అగర్వాల్ జీవితంపై మేఘనా గుల్జర్ మరో బయోపిక్‌ని తెరకెక్కిస్తున్నారు. ఇందులో లక్ష్మి అగర్వాల్ పాత్రలో దీపికా పదుకొనె నటించబోతుండటం విశేషం. 'చాపక్' పేరుతో రూపొందుతున్న ఈ సినిమా త్వరలోనే షూటింగ్‌ని ప్రారంభించుకోనుంది.

చిన్న వయసులోనే భారత బ్యాడ్మింటన్ క్రీడాకారిణిగా అంతర్జాతీయ వేదికపై రాణించి భారత కీర్తి ప్రతిష్టను ప్రపంచ వ్యాప్తంగా చాటిన బాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్ జీవితం ఆధారంగా బయోపిక్ రూపొందుతున్న విషయం విదితమే. సైనా పాత్రలో శ్రద్ధా కపూర్ నటిస్తున్న ఈ చిత్రానికి అమోల్ గుప్తా దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే ప్రారంభమైన ఈ సినిమా శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. బాడ్మింటన్‌లో సైనా 23 టైటిల్స్ గెలుచుకోవడం విశేషం.

90వ దశకంలో శృంగార ప్రధానమైన చిత్రాలతో అగ్ర హీరోలకి దీటుగా రాణించిన ప్రముఖ కథానాయిక షకీలా జీవితం ఆధారంగా 'షకీలా' పేరుతోనే బాలీవుడ్‌లో మరో బయోపిక్‌ని రూపొందిస్తున్నారు. షకీలాగా రిచా చద్దా నటిస్తున్న ఈ చిత్రానికి ఇంద్రజిత్ లంకేష్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్ ఆకట్టుకుంది. సినిమాపై అంచనాలను పెంచింది.

దీంతోపాటు అండమాన్ నికోబార్ దీవులకు చెందిన ప్రముఖ సైకిలిస్ట్ దెబోరా హెరాల్డ్ జీవితాన్ని తెరపై ఆవిష్కరించబోతున్నారు. దెబోరాగా జాక్వెలిన్ నటించబోతున్నారు. దెబోరా యూనియన్ సైకిలిస్ట్ ఇంటర్నేషనల్ ర్యాంకింగ్స్‌లో నాలుగో స్థానాన్ని సాధించిన తొలి భారతీయ క్రీడాకారిణిగా నిలిచింది. అత్యంత సాహసవంతురాలైన ఆమె ప్రస్తుతం 2020 ఒలంపిక్స్ కోసం సన్నద్ధమవుతున్నారు.

అలాగే తొలి మహిళా పైలట్ గుంజన్ సక్సేనా జీవితం ఆధారంగా కరణ్‌జోహార్ ఓ బయోపిక్ తెరకెక్కించబోతున్నారు. ఇందులో గుంజన్ పాత్రలో జాన్వీ కపూర్ నటించనున్నారు. ఆమె లుక్‌కి సంబంధించిన ఓ ఫొటో ఇటీవలే సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. అలాగే తొలి మహిళా వ్యోమగామి కల్పనా చావ్లా జీవితం ఆధారంగా నిర్మాత అజిత్ అందారె ఓ బయోపిక్‌కి ప్లాన్ చేస్తున్నారు. ఇందులో కల్పనాగా ప్రియాంక చోప్రా నటించనున్నట్టు తెలుస్తుంది. దీంతోపాటు మహిళా క్రికెట్ టీమ్ కెప్టెన్ మిథాలీ రాజ్‌పై ఓ బయోపిక్ రూపొందించేందుకు బాలీవుడ్‌లో సన్నాహాలు జరుగుతున్నాయి.

అలాగైతేనే థియేటర్‌కి రండి..



ప్రియాంక గ్లోబల్ స్టార్‌గా రాణిస్తున్న విషయం విదితమే. 'బేవాచ్', 'ఏ కిడ్ లైక్ జేక్' వంటి హాలీవుడ్ చిత్రాల్లో నటించి మెప్పించారు. ఈ సినిమాలు బాక్సాఫీసు వద్ద నిరాశపరిచినా, ప్రియాంక నటనకు మాత్రం మంచి మార్కులే పడ్డాయి. ప్రియాంక నటిస్తున్న మరో హాలీవుడ్ చిత్రం 'ఈజ్ నాట్ ఇట్ రొమాంటిక్'. ఫాంటసీ కామెడీగా రూపొందిన ఈ సినిమాలో రెబెల్ విల్సన్, లియామ్ హెమ్స్వార్త్, ఆడమ్ డీవైన్, ప్రియాంక ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రంలోని ప్రియాంక ఫస్ట్‌లుక్ విడుదలైంది. తన ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులతో ప్రియాంక ఈ ఫస్ట్‌లుక్‌ని పంచుకుంది. 'ఈ లుక్ మిమ్మల్ని చంపేయగలిగితే.. ఫిబ్రవరి 13న అందాల ఇసబెల్లాను తెరపై చూసేందుకు రండి. 'ఈజ్ నాట్ ఇట్ రొమాంటిక్' కోసం నేను వెయిట్ చేయలేకపోతున్నా' అని తెలిపింది. ఇందులో ఆమె యోగా అంబాసిడర్ ఇసబెల్లా పాత్రలో నటించింది. వాలెంటైన్స్ డే సందర్భంగా ఈ సినిమా విడుదల కానుంది. దీంతోపాటు హాలీవుడ్‌లో క్రిస్ పాట్ సరసన 'కౌబాయ్ నింజా వికింగ్' చిత్రం, హిందీలో 'ది స్కై ఈజ్ పింక్' చిత్రంలోనూ నటిస్తోంది.


'ఈజ్ నాట్ ఇట్ రొమాంటిక్'లో ప్రియాంక చోప్రా లుక్

ఆ సినిమాతో రియలైజ్ అయ్యా..


కైరా అద్వానీ

'నాకు డాన్స్ అంటే ఇష్టం. 'వినయ విధేయ రామ'లో బాగా డాన్స్ చేసే అవకాశం రావడం చాలా హ్యాపీ' అని అంటోంది కైరా అద్వానీ. 'భరత్ అనే నేను' తర్వాత తెలుగులో ఆమె నటిస్తున్న చిత్రం 'వినయ విధేయ రామ'. రామ్‌చరణ్ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా కైరా అద్వానీ శుక్రవారం మీడియాతో ముచ్చటించింది. ఆ విశేషాల సమాహారం ఆమె మాటల్లోనే...

నా ఫస్ట్ మాస్ కమర్షియల్ చిత్రం..

నేను నటిస్తున్న మొదటి కమర్షియల్ చిత్రమిది. నమ్మలేని సంఘటనలను నమ్మేలా చేయడం కమర్షియల్ సినిమా ప్రత్యేకత. అంతేకాదు నా మొదటి తెలుగు సినిమా 'భరత్ అనే నేను'కి ఇది పూర్తి భిన్నమైనది. లార్జర్ దేన్ లైఫ్ అనేలా ఉంటుంది. బిగ్ మాస్ కమర్షియల్ చిత్రం. ఇలాంటి సినిమాలను తీయడంలో దర్శకుడు బోయపాటి దిట్ట. భారీ స్టార్ కాస్టింగ్ ఉంటుంది. చరణ్, అర్యన్ రాజేష్, ప్రశాంత్, వివేక్ ఒబెరాయ్ ఇలా.. చాలా మంది పెద్ద నటీనటులున్నారు. సినిమా అంతా పెద్ద ఫ్యామిలీలా ఉంటుంది. చాలా గ్రాండియర్‌గా ఉంటుంది. బోయపాటి ఈ కథ చెప్పినప్పుడు సినిమా ఫీలింగ్‌ని తేవడం కోసం యాక్షన్ చేసి చూపించారు. దీనికి నేను బాగా ఇంప్రెస్ అయ్యాను. యాక్షన్, కామెడీ, ఫ్యామిలీ సెంటిమెంట్ ఇలా అన్ని ఎమోషన్స్‌తో కూడిన టిపికల్ కమర్షియల్ సినిమా ఇది.

నటి కావడానికి కారణం అదే..

చరణ్ అమేజింగ్ కోస్టార్. తను డాన్స్ బాగా చేస్తాడు. చాలా ఎనర్జిటిక్. చిన్నప్పట్నుంచి నాకు డాన్స్ అంటే ఇష్టం. నటి కావడానికి ఓ కారణం కూడా అదే. ఇందులో పరిపూర్ణంగా డాన్స్ చేసే అవకాశం వచ్చింది. చరణ్ కూడా నా డాన్స్‌ని ప్రశంసించారు. 'నా ఫేవరేట్ డాన్సర్‌తో డాన్స్ చేశా' అని చెప్పడం ఆనందంగా ఉంది. 'రామా లవ్ సీత..' నా ఫేవరేట్ సాంగ్. అది చాలా గ్రాండియర్‌గా ఉంటుంది. చిత్రీకరణలో దాదాపు 800 మంది బ్యాక్‌గ్రౌండ్ డాన్సర్లు పాల్గొనగా, ప్రేమ్ రక్షిత్ మాస్టర్ కంపోజ్ చేశారు. నేనిప్పటి వరకు నటించిన అతిపెద్ద సాంగ్ అదే. ఇందులో నేను సీత పాత్రలో కనిపిస్తాను. సంప్రదాయాలకు పెద్ద పీట వేసే ఫ్యామిలీ మాది. అయితే నేను పేరుకే సీత. అందరి ముందు వినయంగా కనిపించినప్పటికీ పూర్తి భిన్నంగా వ్యవహరిస్తాను. చరణ్‌ని ఆటపట్టిస్తుంటాను. డామినేట్ చేస్తుంటాను. రామగా చరణ్ నటించారు. రామ, సీత మధ్య ఆసక్తికర రిలేషన్ ఉంటుంది. ఇది అన్ని వర్గాల ప్రేక్షకులకు బాగా నచ్చుతుంది.

ఆయన ఏం చెబితే అది చేస్తా..

నేను స్పాంటేనియస్ యాక్టర్‌ని. పాత్ర కోసం ముందుగా ప్రీపేర్ అవ్వను. డైరెక్ట్‌గా చేసేస్తాను. కాకపోతే లాంగ్వేజ్ విషయంలో ఇబ్బంది ఉంటుంది. ఈ సినిమాకు పనిచేసేటప్పుడు డైలాగ్స్ కోసం ముందుగానే ప్రీపేర్ అయ్యాను. బేసిక్‌గా నేను దర్శకుడి హీరోయిన్‌ని. సినిమా షూటింగ్ సమయంలో పూర్తిగా దర్శకుడి ఆధీనంలోకి వెళ్ళిపోతాను. ఆయన ఏం చెబితే అది చేస్తా. సినిమాలో నా పాత్ర నిడివి ఎంతనేది పట్టించుకోను. ఎంత ప్రాధాన్యత ఉందనేదే చూస్తాను. తెరపై నా ప్రజెన్స్‌ని ఆడియెన్స్ ఫీలవుతున్నారా? లేదా అనేది ఆలోచిస్తాను. నా దృష్టిలో స్క్రిప్టే కింగ్.

పాన్ ఇండియా నటిగా రాణించాలని..

నటిగా ఒక భాషకు పరిమితమవ్వాలనుకోవడం లేదు. నాకు సౌత్, నార్త్ అనే తేడా లేదు. అన్ని భాషల్లోనూ నటించాలనుకుంటున్నా. 'బాహుబలి'కి ముందు నేను కూడా పరిమితంగానే ఆలోచించా. ఆ సినిమా రియలైజ్ అయ్యేలా చేసింది. భారతీయ సినిమాను ఒక్కటి చేసింది. గ్లోబల్ ఆడియెన్స్‌ని ఎంటర్‌టైన్ చేయడం ముఖ్యం. స్క్రిప్ట్, పాత్ర బాగుంటే డిజిటల్ ప్లాట్‌ఫామ్ అయినా ఓకే. అందుకే గతేడాది నెట్‌ఫ్లిక్స్ 'లస్ట్ స్టోరీస్' చేశా. కరణ్ జోహార్‌కి నేను పెద్ద ఫ్యాన్‌ని. ఆయన ఓ రోజు కాల్ చేసి 'లస్ట్‌స్టోరీస్' గురించి చెప్పారు. ఆయన తీస్తున్న సినిమాలకది పూర్తి భిన్నమైనది. తెలుగులో నటించడానికి కారణం నమ్రత. మహేష్‌తో నటించడం నాకు డ్రీమ్ లాంచ్. ఈ సినిమా నా కెరీర్‌లో పెద్ద టర్నింగ్ పాయింట్. ఆ సినిమా తర్వాత బాలీవుడ్‌లో ఆఫర్లు వచ్చాయి. మహేష్‌బాబు, చరణ్ ఫ్యామిలీ ఓరియెంటెడ్ హీరోలు. వారి ఫ్యామిలీతోనూ నాకు మంచి అనుబంధం ఏర్పడింది.

విజయ్ దేవరకొండకి పెద్ద ఫ్యాన్‌ని..

ప్రస్తుతం హిందీలో 'కళంక్'తోపాటు 'కబీర్ సింగ్'(తెలుగు 'అర్జున్‌రెడ్డి'కి రీమేక్), 'గుడ్ న్యూస్'లో నటిస్తున్నా. 'అర్జున్‌రెడ్డి' నాకిష్టమైన సినిమా. ఈ సినిమాతో విజయ్ దేవరకొండకి పెద్ద అభిమానినయ్యా. అత్యద్భుతంగా నటించాడు. మేం చేస్తున్న రీమేక్‌ని దానితో పోల్చే అవకాశం ఉంది. కానీ బెస్ట్ అవుట్‌పుట్ కోసం చాలా హార్డ్ వర్క్ చేస్తున్నాం.

ప్రేక్షకుల్ని మెప్పించే మణికర్ణిక


కమల్ జైన్, విజయేంద్రప్రసాద్, కంగనా రనౌత్

ఝాన్సీ రాణి లక్ష్మీబాయి జీవితం ఆధారంగా రూపొందుతున్న చిత్రం 'మణికర్ణిక: ది క్వీన్ ఆఫ్ ఝాన్సీ'. కంగనా కనౌత్ ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి క్రిష్‌తోపాటు కంగనా రనౌత్ దర్శకత్వం వహించారు. జీ స్టూడియోస్ పతాకంపై కమల్‌జైన్, నిశాంత్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 25న హిందీతోపాటు తెలుగులో విడుదల కానుంది. శుక్రవారం హైదరాబాద్‌లో తెలుగు ట్రైలర్‌ని విడుదల చేశారు.

ఈ సందర్భంగా కంగనా రనౌత మాట్లాడుతూ, 'నాకు తెలుగు భాషంటే చాలా ఇష్టం. తెలుగు పదాల శబ్దం చాలా మాధుర్యంగా ఉంటుంది. అందుకే ఈ సినిమా డబ్బింగ్ విషయంలో చాలా శ్రద్ధ తీసుకున్నాం. ఈ సినిమాను గతేడాది ఆగస్ట్‌లోనే పూర్తి చేయాల్సింది. కానీ దర్శకుడు క్రిష్ మరో ప్రాజెక్ట్‌తో బిజీ కావడం వల్ల ఓవర్‌నైట్‌లో నేను దర్శకత్వ బాధ్యతల్ని తీసుకున్నా. టీమ్ అంతా ఈ చారిత్రక నేపథ్య చిత్రాన్ని ఎంతగానో ప్రేమించారు. అందరి సపోర్ట్‌తో దర్శకురాలిగా నా బాధ్యతను నెరవేర్చాను. లక్ష్మీబాయి పాత్ర కోసం గుర్రపు స్వారీ, కత్తిసాములో శిక్షణ తీసుకున్నా. షూటింగ్ సమయంలో గాయపడ్డాను. అయినా కథపై ప్రేమతో అంకిత భావంతో శ్రమించాను. ఈ సినిమా విషయంలో దర్శకురాలిగా ఎప్పుడూ అభద్రతాభావానికి గురి కాలేదు. మహోన్నతమైన మన చరిత్రను ఇప్పుడంతా మర్చిపోతున్నారు. దేశం కోసం రక్తం ధారబోసిన వీరుల్ని స్మరించుకోవాలన్న సంకల్పంతో ఈ సినిమాను రూపొందించాం. దేశ చరిత్రలో మరుగున పడిన వీరులు ఎందరో ఉన్నారు. వారి చరిత్ర నేటి తరానికి తెలియాల్సిన అవసరం ఉంది' అని అన్నారు. ఆర్.నారాయణమూర్తి చెబుతూ, 'దేశభక్తి సినిమా చేస్తున్నందుకు కంగనాని అభినందిస్తున్నా. ట్రైలర్‌లో ఆమె అభినయం నన్ను మంత్రముగ్ధుల్ని చేసింది' అని చెప్పారు. 'విజయేంద్రప్రసాద్ 'బాహుబలి' తర్వాత ఈ చిత్రానికి కథ అందించారు. కంగనా పెద్దగా ఎత్తు లేకపోయినా, నటన పరంగా ఆకాశమంత ఎత్తు ఎదిగింది. క్రిష్ నెల రోజుల్లో మూడు సినిమాలను రిలీజ్ చేస్తున్నాడు. అతను వదిలిపెట్టిన బాణంలాంటి ఈ సినిమాను కంగనా పూర్తి చేశారు. చిత్ర బృందానికి అభినందనలు' అని తమ్మారెడ్డి భరద్వాజ తెలిపారు. 'ఈ సినిమాను ఆదరించాలని కోరుకుంటున్నా' అని నిర్మాత కమల్ జైన్ తెలిపారు. 'మనమంతా గర్వించదగిన చిత్రమిది. దేశభక్తి ప్రధాన చిత్రాలు భారీ నిర్మాణ విలువలతో తెరకెక్కడం మంచి పరిణామం. అత్యద్భుతమైన అభినయానికి ప్రతీక కంగనా రనౌత్' అని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ తెలిపారు.

ప్రమాదంలో భారత సాంకేతిక విద్య

- ఐఏసీటీఈ విధానాల ఫలితం?

న్యూఢిల్లీ: భారత దేశంలో సాంకేతిక విద్య క్లిష్టపరిస్థితుల్లో ఉన్నది. విద్యాసంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకురావడం, ఉన్నత ప్రమాణాలు క్షీణించడం వంటి అంశాలను ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ) సమర్థవంతంగా నియంత్రించలేకపోయిందని వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఐఐటీ హైదరాబాద్ చైర్మెన్ బీవీఆర్ మోహన్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పరిచిన కమిటీ.. జాతీయ సాంకేతిక విద్య మండలికి తాజాగా ఒక రిపోర్టును అందజేసింది. 2020 నుంచి కొత్తగా ఇంజనీరింగ్ కాలేజీలను ఏర్పాటు చేయరాదని, ప్రతి రెండేండ్లకు ఇంజనీరింగ్ విద్యను సమీక్షించాలని అందులో సూచించింది. సాంప్రదాయక ఇంజనీరింగ్ సబ్జెక్టులు మెకానికల్, కెమికల్, ఎలక్ట్రికల్, సివిల్‌లోని పరిమితికి మించి ఉన్న సామర్థ్యాలను సాంకేతిక రంగంలో నూతన ఆవిష్కరణలు కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్, డేటా సైన్స్‌లాంటి విషయాల్లోకి బదిలీ చేయాలని సిఫారసు చేసింది. అయితే ఈ రిపోర్టు సమస్య మూలాలు, దశాబ్దాలుగా అమలు చేస్తున్న ఏఐసీటీఈ అసంబద్ధ విధానాలపై ఎలాంటి సిఫారసులు చేయలేదు. 2016-17లో 3,921 ఇంజనీరింగ్ కాలేజీల్లోని 15.5లక్షల బీఈ/బీటెక్ సీట్లలో 51శాతం ఖాళీగా ఉన్నాయని, ఇది అవసరానికి మించిన కాలేజీలున్న విషయాన్ని వెల్లడిస్తున్నది.



1990 నుంచి 2010 మధ్య ఏఐసీటీఈ అనుమతితో ఇంజనీరింగ్ కాలేజీలు పుట్టగొడుగుల్లా పెరిగాయి. ఈ కాలేజీల్లో చాలా వరకు మౌలిక వసతులు, విద్యా ప్రమాణాలను పర్యవేక్షించడంలో ఏఐసీటీఈ దారుణంగా విఫలమైందని నిపుణులు చర్చిస్తున్నారు. గత ఐదేండ్ల నుంచి ఇంజనీరింగ్ విద్య నాణ్యతపై ఈ రెగ్యులేటర్ మరింత నిస్సారంగా మారిందని చెబుతున్నారు. 2003లోనే పెరుగుతున్న కాలేజీలపై యుఆర్ రావు కమిటీ ఏఐసీటీఈని హెచ్చరించింది. పరిశ్రమకు కావల్సిన నైపుణ్యాలకు, విద్యార్థులకు బోధిస్తున్న సబ్జెక్టుల్లో తీవ్ర వ్యత్యాసమున్నదని, దీన్ని నియంత్రించడంలోనూ రెగ్యులేటర్ విఫలమైనట్టు ఒక రిపోర్టు వెల్లడించింది. 95శాతం ఇంజనీరింగ్ పట్టభద్రులు సాఫ్ట్‌వేర్ పరిశ్రమ ఉద్యోగాలకు అనర్హులుగా ఉన్నట్టు ఆస్పైరింగ్ మైండ్స్ 2017 రిపోర్టు తేల్చడం గమనార్హం.

ఉద్యోగాలకు అర్హులుగా ఉన్న టాప్ 10 ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్‌లలో టాప్ ముగ్గురికి మాత్రమే తమ రంగంలో జరుగుతున్న పరిశోధనలపై అవగాహన ఉన్నదని తేల్చిన ఓ రిపోర్టు.. దేశంలో సాంకేతిక విద్య ఏ స్థాయికి దిగజారిపోయిందో వెల్లడిస్తున్నది.

షెల్టర్ హోమ్‌లా.. శాడిస్టు హోమ్‌లా?

- ప్రభుత్వ రిపోర్టులో వెల్లడైన విస్మయకర వాస్తవాలు

న్యూఢిల్లీ: దేశంలోని షెల్టర్ హోమ్‌లు చిన్నపిల్లల పాలిట శాడిస్టు హోమ్‌లుగా పరిణమించాయి. అనాథలు, మానవ అక్రమ రవాణా బాధిత చిన్నారులు, కుటుంబాలు వదిలేసిన పిల్లలుండే ఈ షెల్టర్ హోమ్‌లపై ప్రభుత్వం మొదటిసారి దేశవ్యాప్తంగా నిర్వహించిన సమీక్షలో విస్మయకర వాస్తవాలు వెలుగుజూశాయి. మహిళా శిశు అభివృద్ధి శాఖకు గణాంకాల సలహాదారు రత్న అంజన్ జేనా నేతృత్వంలోని కమిటీ సమీక్షించి ఈ నివేదికను గతేడాది సెప్టెంబర్‌లో ప్రభుత్వానికి సమర్పించింది. షెల్టర్ హోమ్‌లలోని చాలా మంది చిన్నారులు రాత్రిపూట పర్యవేక్షణకు నోచుకోవడం లేదని, క్రమశిక్షణ పేరిట భౌతిక శిక్షలకు గురవుతున్నారని, అరకొర పౌష్టికాహారం, తగిన వైద్య, న్యాయ సదుపాయాలూ అందడం లేదని ఈ రిపోర్టు తెలిపింది. అంతేకాదు, సరైన విద్య, నైపుణ్య శిక్షణ లేకుండా ఏండ్ల తరబడి మగ్గుతున్నారని వివరించింది. బీహార్‌లోని ముజఫర్‌పూర్ షెల్టర్ హోమ్‌లో 20 మంది చిన్నారులపై నెలలుగా లైంగికదాడి జరిగిన ఉదంతం వెలుగులోకి వచ్చిన సందర్భంలోనే ఈ రిపోర్టు రావడం గమనార్హం. 3.8 లక్షలమంది చిన్నారులున్న 9,589 సంరక్షణ కేంద్రాలపై సమీక్ష నిర్వహించి రూపొందించిన ఈ రిపోర్టులో.. కేవలం ఏడు శాతం హోమ్‌లు మాత్రమే సామాజిక ఆడిట్ నిర్వహించాయని వివరించింది. 50శాతం షెల్టర్ హోమ్‌లు పిల్లలను నిబంధనల ప్రకారం శిశు సంక్షేమ కమిటీ(సీడబ్ల్యూసీ) లేదా జువైనల్ జస్టిస్ బోర్డు(జేజేబీ) ముందుకు తీసుకురాలేదని తెలిపింది. 31శాతం హోమ్‌లు మాత్రమే చిన్నారుల సోషల్ ఇన్వెస్టిగేషన్ రిపోర్టులను సీడబ్ల్యూసీ, జేజేబీలకు సమర్పించాయని వివరించింది.



65శాతం హోమ్‌లు మాత్రమే పిల్లలకు భద్రతనిచ్చేలా వారిని వయసు, లింగం ఆధారంగా విభజించాయని, చిన్నారుల రక్షణ విధానాలను రాతపూర్వకంగా కలిగి ఉన్న హోమ్‌లు 24శాతం మాత్రమేనని తెలపడం గమనార్హం. 46శాతం హోమ్‌లు మాత్రమే పిల్లలకు సంరక్షణను ఇస్తున్నాయని, ఆర్థిక ఆడిట్‌లను సంబంధిత అధికారులకు అందిస్తున్న హోమ్‌లు 40శాతంలోపేనని తేల్చింది. కాగా, వ్యక్తుల, ఎన్జీవోల విరాళాలు, అంతర్జాతీయ గ్రాంట్ల కంటే ప్రభుత్వ నిధులపైనే మెజార్టీ హోమ్‌లు ఆధారపడి ఉన్నాయని తెలి పింది. మెజార్టీ షెల్టర్ హోమ్‌ల నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై పలువురు సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కార్మికుల పోరాటానికి ఎర్రజెండా అండ


(మొదటిపేజీ తరువాయి)

జరిగాయని పేర్కొన్నారు. పార్లమెంట్ వద్ద ధర్నాలు నిర్వహించామని తెలిపారు. రైతుల సమస్యలపై వివిధ రాష్ట్రాల్లో ఆందోళనలు సాగుతున్నాయని తెలిపారు. అయినా ప్రభుత్వం తన విధానాలను మార్చుకోవడానికి సిద్ధంగా లేదని తెలిపారు. కార్పొరేట్లకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కొమ్ము కాస్తోందని విమర్శించారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వంటి చర్యలు ఆర్థిక వ్యవస్థను అతలాకుతం చేశాయని వివరించారు. వాటితో పాటు మత విద్వేషాలు రెచ్చగొడుతోందని తెలిపారు.

బీజేపీ ప్రభుత్వం కార్మి కులకు ఉన్న ప్రాథమిక హక్కులను కాలరాస్తోందని పేర్కొన్నారు. అధిక ధరలు, ఉపాధి కల్పన, కనీసవేత నాలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల అమ్మకాలను ఆపాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు వ్యవస్థ రద్దు, కార్మిక చట్టాల సవరణను నిలిపివేయాలని కోరారు. ప్రజాపంపిణీ వ్యవస్థను పటష్టం చేయాలనీ, సంక్షేమ పథకాలు అమలు పరచాలనీ, నూతన పింఛన్ విధానం రద్దు చేయాలనీ, వ్యవసాయ కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలనీ, రైతులకు మద్దతు ధర వంటి సమస్యలపై కార్మిక సంఘాలు దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయని తెలిపారు.రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు ఇప్పటికే మద్దతును ప్రకటించాయని పేర్కొన్నారు. ఈ సమ్మెలో వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు సంఘీభావంగా పాల్గొనాలని కోరారు. కార్మికులు, ఉద్యోగులు, రైతులు, వ్యవసాయ కార్మికులు ఐక్యంగా పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ట్రేడ్ యూనియన్ చట్టాలను మార్చే కుట్ర

కార్పొరేట్లకు అండగా మోడీ సర్కార్ : సీఐటీయూ



న్యూఢిల్లీ: కార్మిక సంఘాల చట్టంలో సవరణలు చేస్తూ మోడీ సర్కారు తీసుకున్న నిర్ణయం పట్ల సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సీఐటీయూ) ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది కార్మిక సంఘాల చట్టాలను మార్చే కుట్రలో భాగమేనని ఆరోపించింది. కార్మిక సంఘాల చట్టం-1926లో సవరణలకు కేంద్ర క్యాబినెట్ రెండు రోజుల క్రితం ఆమోద ముద్ర వేసిన నేపథ్యంలో సీఐటీయూ పై విధంగా స్పందించింది. ఇప్పటివరకూ ఉన్న 'నమోదైన కార్మిక సంఘాలు' (రిజిష్టర్డ్ ట్రేడ్ యూనియన్స్) స్థానంలో 'గుర్తింపు పొందిన కార్మిక సంఘాలు' అని చేర్చడానికి వీలుగా సంబంధిత చట్టంలో నిబంధనలను సవరించారు. దీనిపై సీఐటీయూ స్పందిస్తూ.. ప్రతిపాదిత సవరణలు సందేహాస్పదంగా ఉన్నాయని తెలిపింది. కార్మికుల హక్కులను కాలరాసే కుట్రలో భాగంగానే మోడీ సర్కారు ఈ సవరణలు చేసిందని ఆరోపించింది. సవరణలు చేసిన చట్టం.. కార్మికులకు కేవలం గుర్తింపును మాత్రమే ఇస్తుందని, నమోదు హక్కులు కల్పించదని పేర్కొంది. బీజేపీ సర్కారు కార్మికుల చట్టాలను మారుస్తూ.. కార్పొరేట్లకు తొత్తుగా వ్యవహరిస్తున్నదని విమర్శించింది. ఈ క్రమంలోనే సంబంధిత చట్టంలో మార్పులు చేస్తున్నదని ఆరోపించింది.

కారులో సెట్టింగ్

(మొదటిపేజీ తరువాయి)

77 మంది ఎమ్మెల్యేలు మిగులుతారు.

వీరిలో 16 మంది ఎమ్మెల్యేలుగా తొలిసారి ఎన్నికయ్యారు. మరో ఇద్దరికి స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పదవులు దక్కనున్నాయి. వీరుపోను మరో 59 మంది ఎమ్మెల్యేలు మిగులుతారు. వీరంతా ఒకటి కన్నా ఎక్కువసార్లు ఎమ్మెల్యేలుగానో లేక ఎంపీలుగానో పనిచేశారు. కాబట్టి సామాజిక, జిల్లా సమీకరణాల కోణంలో పరిశీలించి వీరందరిలోంచి 18 మందికి పార్లమెంటరీ కార్యదర్శి పదవులివ్వాలని కేసీఆర్ భావిస్తున్నారు. గత పాలనలో ఆరుగురిని పార్లమెంటరీ కార్యదర్శులుగా నియమించిన సంగతి విదితమే. అయితే కోర్టు కేసులు, ఆదేశాలతో వాటిని ప్రభుత్వం రద్దు చేసింది. అందుకే ఈ దఫాలో నియామకాల్లో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని నిర్ణయించింది. జార్ఖండ్, ఢిల్లీ మాదిరిగా ప్రత్యేక చట్టం చేసి 18 మందికి పార్లమెంటరీ కార్యదర్శి పదవులిచ్చేందుకు కసరత్తులు మొదలయ్యాయి.

అత్యంత విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఖమ్మం నుంచి పువ్వాడ అజయ్, వరంగల్ నుంచి అరూరి రమేష్, దాస్యం వినయబాస్కర్, నల్గొండ నుంచి నోముల నర్సింహయ్య, రమావత్ రవీంద్రకుమార్, గ్యాదరి కిషోర్, గొంగిడి సునీత, నిజామాబాద్ నుంచి బాజిరెడ్డి గోవర్దన్, గంపా గోవర్ధన్, షకీల్ అహ్మద్, అదిలాబాద్ నుంచి రేఖా నాయక్, కోనేరు కొనప్ప, బాల్క సుమన్, కరీంనగర్ నుంచి ఒడితెల సతీష్ కుమార్, గంగుల కమలాకర్, మెదక్ నుంచి సోలిపేట రామలింగారెడ్డి, పద్మా దేవేందర్‌రెడ్డి, మహబూబ్ నగర్ నుంచి శ్రీనివాస్‌గౌడ్, గువ్వల బాలరాజు, రంగారెడ్డి నుంచి కేపీ వివేకానంద... ఇలా వీరందరూ పార్లమెంటరీ కార్యదర్శుల పోస్టుల జాబితాలో ఉన్నారు. వీరిలో 18 మందిని సీఎం ఎంపిక చేయనున్నారు.

ఏపీ సీఎం కాన్వాయ్‌కు అడ్డు

- చంద్రబాబు పర్యటనలో బీజేపీ ఆటకాయింపు



కాకినాడ: ఏపీలోని కాకినాడ నాగమల్లితోట జంక్షన్ వద్ద ఏపీ సీఎం చంద్ర బాబు కాన్వాయ్‌ను బీజేపీ నేతలు అడ్డుకున్నారు. సీఎం డౌన్ డౌన్ అంటూ నినా దాలు చేశారు. వాహనశ్రేణికి అడ్డగించే ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. బస్సులో ఉన్న చంద్రబాబు బయటకు వచ్చి కాన్వాయ్‌ను అడ్డుకున్న బీజేపీ లీడర్లపై ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రానికి మోడీ ఏంచేశారంటూ మండిపడ్డారు. రాష్ట్రంలో ఉండటానికి బీజేపీ నేతలకు అర్హత లేదన్నారు. రాష్ట్రానికి మోడీ చేసిన అన్యాయాన్ని మీరు సమర్థిస్తారా ?అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రాన్ని, దేశాన్ని మోడీ నిలువున ముంచేశారని విమర్శించారు. కాకినాడలో తలపెట్టిన 'జన్మభూమి- మా ఊరు' కార్యక్రమానికి వెళుతుండగా ఈ ఘటన జరగటంతో..పోలీసు వర్గాలు అప్రమత్తమయ్యాయి.

నలుగురు ఎస్పీలకు డీఐజీలుగా పదోన్నతి

- త్వరలో కొత్త పోస్టింగ్‌లు

నవతెలంగాణ -ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో నలుగురు ఎస్పీ స్థాయి అధికారులకు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(డీఐజీ)లుగా పదోన్నతులు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పదోన్నతులు పొందిన వారిలో కరీంనగర్ నగర పోలీసు కమిషనర్ కమలాసన్‌రెడ్డి, సంగారెడ్డి జిల్లా ఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, నగర పశ్చిమ మండలం డీసీపీ ఎఆర్ శ్రీనివాస్, ఇంటెలిజెన్స్ విభాగం ఎస్పీ శివకుమార్‌లు ఉన్నారు. ఈ నలుగురు అధికారులు 2004 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందినవారు. మొదట గ్రూప్ వన్ ద్వారా డీఎస్పీలుగా పోలీసు శాఖలో చేరిన వీరు అంచెలంచెలుగా అదనపు ఎస్పీ, నాన్ కేడర్ ఎస్పీలుగా పదోన్నతులు పొంది వివిధ విభాగాలలో పనిచేసి మంచి పేరును సంపాదించారు. 2004లో వీరు ఐపీఎస్ అధికారులుగా కన్‌ఫర్డ్ అయ్యారు. డీఐజీలుగా పదోన్నతులు పొందిన వీరికి త్వరలోనే కొత్త పోస్టింగ్‌లు లభించనున్నాయి.

ఏకగ్రీవానికి ఒత్తిడి వద్దు

(మొదటిపేజీ తరువాయి)

అంశంపై శుక్రవారం హైదరాబాద్‌లోని ఒక హోటల్లో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఎన్నికల సంఘం నియమించిన ఎన్నికల సాధారణ, వ్యయ పరిశీలకులు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికలపై సంబంధిత అధికారులకు పూర్తి అవగాహన కల్పించామన్నారు. ఎన్నికల నిర్వహణపై తుది నిర్ణయం పరిశీలకులదేనని చెప్పారు. ప్రధానంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన, సజావుగా పోలింగ్ జరిగేందుకు తీసుకోవల్సిన చర్యలపై అవగాహన కల్పించామని తెలిపారు. ఇందుకుగాను ప్రతి జిల్లాకు ఎన్నికల పరిశీలకులను నియమించామన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. అభ్యర్థులు పరిమితికి మించి ఖర్చు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గత ఎన్నికల్లో చేసిన ఖర్చులు చూపని వారిని ఈ ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా గుర్తించామని వివరించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి ప్రతి పంచాయతీల్లో పోలీస్ యంత్రాంగాన్ని అందుబాటులో ఉంచుతామని చెప్పారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అవసరమైతే అదనపు బలగాలను దించుతామని తెలిపారు. గ్యాస్ డిస్ట్రిబ్యూటర్స్, రేషన్ డీలర్లు కూడా పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయవచ్చని తెలిపారు.



యథావిధిగా పాత పథకాలు

రాష్ట్రంలో అమలవుతున్న పాతపథకాలు యథావిధిగా కొనసాగుతాయని నాగిరెడ్డి వివరించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున కొత్త పథకాలను అనుమతించబోమన్నారు. రైతుబంధు చెక్కుల పంపిణీ లాంటి పథకాలు అమలవుతాయని తెలిపారు.

జీహెచ్, మున్సిపల్ కార్పొరేషన్లలో "నో" కోడ్

గ్రేటర్ హైదరాబాద్, మున్సిపల్ కార్పొరేషన్లలో ఎన్నికల కోడ్ వర్తించదని నాగిరెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. కోడ్‌కు సంబంధించి కొన్ని మార్గదర్శకాలను విడుదల చేయనున్నట్టు తెలిపారు.

ఈసీతో సీఎస్, డీజీపీ భేటీ

పంచాయతీ ఎన్నికల నిర్వహణా ఏర్పాట్లకు సంబంధిచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి శుక్రవారం ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డితో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా ఎన్నికలకు కావాల్సిన సిబ్బంది, రవాణా అంశాలపై సీఎస్, పోలింగ్ రోజుల్లో భద్రతా ఏర్పాట్లు, కావల్సిన సిబ్బంది గురించి డీజీపీ మహేందర్‌రెడ్డి చర్చించారు.

నరకం అనుభవించాం

న్యూఢిల్లీ : దేశంలోని పెద్ద పెద్ద నగరాల్లో కోట్లాదిమంది నిర్మాణరంగ కార్మికులుగా బతుకుతున్నారు. నిత్యం పని ఉండాలని కోరుకునే జీవులు వీరు. చేతిలో పనిని...వీరి జేబులోని నగదును 'నోట్లరద్దు' నిర్ణయం దెబ్బకొట్టింది. మొదటి మూడు నెలలు వీరి పరిస్థితి ఎలా ఉంది?అన్నదానిపై ఆర్థికవేత్త రితూ దివాన్, పరిశోధకురాలు రాధా సెహగల్ అధ్యయనం చేశారు. ఇంధనరంగ కార్మికుల, వారి కుటుంబ సభ్యుల అనుభవాలతో 'డీమానిటైజేషన్ : ఫ్రమ్ డిప్రివేషన్ టు డెస్టినేషన్' పుస్తకాన్ని రాసి, ఇటీవలే విడుదలచేశారు. ఇందులో ప్రధానంగా కార్మికుల ఆరోగ్య, విద్యా అవసరాలు ఎలా తీరాయన్నది తెలిపారు. ఆ విషయాలు ఇలా ఉన్నాయి. నిర్మాణరంగ పనులు జోరుగాసాగే కాలం, నిర్మాణరంగ కార్మికులకు ఎక్కువగా పని దొరికే సమయం.. ఏప్రిల్-మే 2018 మధ్య ఈ పరిశోధన సాగింది. నోట్లరద్దు నిర్ణయం నేరుగా 'కార్మికలోకాన్ని' తాకింది. వారి దైనందిన జీవితాల్ని అతలాకుతలం చేసింది. నోట్లరద్దు ప్రభావం చాలాకాలం ఉండటం వల్ల కార్మికుల పనిసామర్థ్యాన్ని దెబ్బతీసింది. పేదరికం నుండి మరింత కిందికి వెళ్లిపోయారు. పిల్లల విద్యా, వైద్య అవసరాలు అప్పుల్ని తెచ్చిపెట్టాయి.

ఇక్కడా మహిళలే..

వైద్య అవసరాలు ఎలా తీరాయి? అని కార్మికుల కుటుంబాల్ని ప్రశ్నించగా, సగానికిపైగా కుటుంబాలు వారి వైద్య అవసరాల్ని 3నెలలు వాయిదా వేసుకున్నామని చెప్పారు. చేతిలో నగదు లేకపోవటం వల్ల వైద్య చికిత్స పొందటం చాలా ఆలస్యమైందని మరికొంత మంది చెప్పారు. అత్యవసర పరిస్థితి ఉందని చెబితే, మందుల దుకాణంలో పాత నోట్లు తీసుకొన్నారనీ, దీంతో ప్రమాదం తప్పిందనీ సర్వేలో పాల్గొన్నవారు ఆందోళనవ్యక్తం చేశారు.

కార్మికుల వద్ద చాలా కొద్ది మొత్తం నగదు ఉండటం, ఏదో అత్యవసరం రావటంతో అదీ ఖర్చు కావటం, వైద్యం కోసం చేతిలో డబ్బులేని పరిస్థితి ఏర్పడింది. 55 శాతం కార్మికుల ఇండ్లల్లో మహిళలు తమ వైద్య అవసరాల్ని పక్కకుపెట్టారు. కేవలం నోట్లరద్దు కారణంగా మందుల్ని ఎక్కువ ధర ఇచ్చి కొనాల్సివచ్చిందని చెప్పారు. చేతిలో నగదు లేకపోవటం వల్ల పెద్ద పెద్ద క్యూలైన్లలో నిలబడాల్సి వచ్చిందని అనేకమంది గుర్తుచేసుకున్నారు.

అప్పులకోసం పరిగెత్తాం..

నవంబరు 2016-జనవరి 2017 మధ్యకాలంలో అనారోగ్య సమస్యలతో హాస్పిటల్‌కు వెళ్లామని సర్వేలో పాల్గొన్న 34.8శాతం మంది చెప్పారు. ఇందులో దాదాపు 95శాతం కార్మికులు మరో చోట అప్పుజేసి వైద్య అవసరాన్ని తీర్చుకున్నారు. అప్పుకోసం పని ఇచ్చిన కాంట్రాక్టర్ దగ్గరికి, బంధువుల ఇండ్లకు పరిగెత్తారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌కు వెళ్లామని చెప్పినవారు 45.9శాతం. ప్రయివేటు హాస్పిటల్స్‌కు, ఇతర క్లీనిక్స్ వెళ్లామని చెప్పినవారు 41.5శాతం. మొదట్లో పాత నోట్లు మాత్రమే చేతిలో ఉండటం వల్ల ప్రయివేటు హాస్పిటల్స్ అవి తీసుకోవడానికి నిరాకరించాయి. దీంతో వైద్య చికిత్సకోసం తిరిగి ప్రభుత్వ హాస్పిటల్స్‌కు తిరిగొచ్చారు. ఇలాంటి అనుభవం ఎక్కువగా మహిళలకు ఎదురైంది.

బడిమాన్పించి..పనికి...

నోట్లరద్దు కార్మికుల కుటుంబాల్లోని పిల్లల చదువులపై ప్రభావం చూపింది. నగదు కొరత వల్ల ప్రయివేటు స్కూల్స్ మానిపించి, ప్రభుత్వ స్కూళ్లలో చేర్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు గుడ్డు దొరకని పరిస్థితి ఏర్పడింది. అనేక రోజుల పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం లభ్యం కాలేదు. 227 కార్మికుల కుటుంబాల పిల్లలపై అధ్యయనం చేయగా, అందులో 60శాతం కుటుంబాలు ప్రభావితమయ్యాయి. వీరంతా సమయానికి స్కూల్ ఫీజులు చెల్లించలేకపోయారు. పిల్లల్ని పనికి పంపించామని 25 శాతం కుటుంబాలు చెప్పాయి. పనిలేకపోవటంతో, ఆదాయంలేక తిరిగి గ్రామాలకు వెళ్లిపోయిన కుటుంబాలు 16 శాతం. భారత ఆర్థిక వ్యవస్థకు 'నోట్లరద్దు' వల్ల కలిగిన నష్టం అంతా ఇంతా కాదు. నగదు ద్వారా చెల్లింపులు జరిపే కార్మికులు, గ్రామీణ ప్రజలు పెద్ద ఎత్తున ప్రభావితమయ్యారు. నోట్లరద్దు నిర్ణయం తీసుకొని రెండేండ్లు దాటినా ఇప్పటికీ ఆ ప్రభావం వారిపై కనపబడుతోంది. అందునా నిర్మాణరంగ కార్మికులు తీవ్రంగా నష్టపోయారు. నోట్లరద్దు నిర్ణయం వల్ల నిర్మాణరంగంలో పనులన్నీ ఆగిపోయాయి.

స్టార్టప్.. ప్యాకప్..!

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రం ప్రకటించింది. ఇంక్యుబేషన్ సదుపాయంతో పాటు నిధులు, పన్ను మినహాయింపు కల్పించనున్నట్టు వెల్లడించింది. కాగా.. 82 శాతం కంపెనీలకు ఇప్పటికీ ఎలాంటి ప్రయోజనాలు అందకపోవడంతో పాటు 32శాతం పరిశ్రమలకు ఆదాయపు పన్నుశాఖ నుంచి నోటీసులు రావడం గమనార్హం. బకాయి పడ్డ పన్ను చెల్లించాల్సిందేని సదరు కంపెనీలకు ఐటీ ఆదేశాలు జారీ చేసింది. దీనిపై స్టార్టప్ కంపెనీల యాజమాన్యాలు తీవ్ర వ్యతిరేకత తెలపడంతో కేంద్రం కొన్ని చర్యలు చేపట్టింది. కంపెనీలు బకాయి పడ్డ పన్నులను బలవంతంగా వసూలు చేసే చర్యలు చేపట్టవద్దని ఐటీ శాఖను కేంద్రం డిసెంబర్ 24న ఆదేశించింది. కేంద్రం ఆదేశాలిచ్చినా కొన్ని కంపెనీలకు ఐటీ నుంచి నోటీ సులు అందడంపై సదరు యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా యి. స్టార్టప్ విధానం దివాలా తీయడంతో 24 శాతం కంపెనీలను మూసివేస్తామని యాజమాన్యాలు ప్రకటించాయి. అంతేకాక.. 5 శాతం కంపెనీలను అమ్మేయనున్నట్టు యజమానులు సూచనప్రాయంగా తెలిపారు.

సీసం వున్న నూడుల్స్ తినాలా?

(మొదటిపేజీ తరువాయి)

పట్టించినందుకు రు.640కోట్ల మేరకు నష్టపరిహారం చెలించాలని కోరుతూ నెస్లే ఇండియాపై జాతీయ వినియోగదారుల కమిషన్ (ఎన్‌సీడీఆర్‌సీ)లో కేంద్ర ప్రభుత్వం దాఖలు చేసిన కేసును సుప్రీం కోర్టు గురువారం పునరుద్ధరించింది. నెస్లే ఇండియా తరపున హాజరైన సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి మాట్లాడుతూ, మ్యాగీలో నిర్దేశిత ప్రమాణాల మేరకే సీసం వుందని అంగీకరించారు. దానిపై జస్టిస్ డి.వై.చంద్రచూడ్ స్పందిస్తూ, "సీసం వున్న మ్యాగీని ఎవరైనా ఎందుకు తినాలి?" అని ప్రశ్నించారు. ఇతర ఉత్పత్తుల్లో కూడా కొంత మొత్తంలో సీసం వుంటుందని సింఘ్వి దీనికి బదులిచ్చారు. కాగా, మ్యాగీ నూడుల్స్‌ను పరీక్షకు పంపిన మైసూర్‌లోని కేంద్ర ఆహార సాంకేతిక పరిశోధనా సంస్థ (సిఎఫ్‌టిఆర్‌ఐ) నుండి వచ్చే నివేదికను బట్టి ఎన్‌సీడీఆర్‌సీలో కార్యకలాపాలు సాగుతాయని చెప్పారు. దీనిపై సింఘ్వి మాట్లాడుతూ ఈ విషయం ఇప్పుడు నిష్ప్రయోజనంగా మారిందని, మైసూర్ ల్యాబ్ నివేదిక తమకు అనుకూలంగా వచ్చిందని, మోనో సోడియం గ్లూటామేట్ (ఎంఎస్‌జీ) వున్నట్టు నిర్ధారణ కాలేదని చెప్పారు. అందువల్ల ఈ అంశాన్ని తిరిగి ఎన్‌సీడీఆర్‌సీకి పంపరాదని సింఘ్వి మరో సీనియర్ న్యాయవాది అరవింద్ దత్తార్ వాదించారు. ల్యాబ్ నివేదిక వచ్చిన తర్వాత నిర్ణయించేది ఏమీ లేదన్నారు. దానిపై బెంచ్ స్పందిస్తూ, 'కమిషన్ అధికారాలను తామెందుకు హరిస్తామని, ల్యాబ్ నివేదికలను కమిషన్‌కు పంపుతామని, అక్కడే పరిష్కారమవుతున్నదని బెంచ్ పేర్కొంది.

ట్రక్కు గుర్తు వల్లే ఉత్తమ్ గెలుపు

(మొదటిపేజీ తరువాయి)

ఆరు సీట్లను గెలిచామని అన్నారు. ఉద్యమ సమయం నుంచి ఆ జిల్లా నేతలు కష్టపడి పని చేస్తున్నారని.. ఫలితంగా ప్రస్తుత ఎన్నికల్లో నల్లగొండలో మహామహుల్ని మట్టి కరిపించారని తెలిపారు. పోగొట్టుకున్న చోటే వెతుక్కోవాలన్నట్టు హుజూర్‌నగర్‌లో మరింత కష్టపడి పని చేయటం ద్వారా వచ్చే ఎన్నికల్లో పార్టీని గెలిపించాలని కోరారు. ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్ నేతల బుర్రలు పాడయ్యాయని విమర్శించారు. ఓటర్లు ఇచ్చిన తీర్పుతో కొంతమంది కాంగ్రెస్ నేతలు రిటైర్‌మెంట్ తీసుకున్నారని చెప్పారు. మరికొంత మంది మీడియాకు కూడా దూరమయ్యారని ఎద్దేవా చేశారు. మొత్తం మీద కాంగ్రెస్ నేతలు ఇప్పుడు కోలుకునేలా లేరని విమర్శించారు. క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీని బలోపేతం చేయాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పది ఇండ్లకో కార్యకర్త చొప్పున.. వంద మందికో కార్యకర్తను తయారు చేసుకోవాలని సూచించారు.

రేపటి నుంచి 13 వరకు కేసీఆర్ దుబాయ్ పర్యటన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివారం నుంచి ఈనెల 13 వరకు దుబాయ్‌లో పర్యటించనున్నారు. అక్కడ జరిగే ఇంటర్నేషనల్ ఇండస్ట్రియల్ సమ్మిట్‌లో ఆయన పాల్గొననున్నారు. సీఎంతోపాటు ప్రభుత్వ ప్రధాన సలహాదారు డాక్టర్ రాజీవ్‌శర్మ, సీఎంవో ముఖ్య కార్యదర్శి నర్సింగ్‌రావు, పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్ కూడా దుబాయ్‌కు వెళ్లనున్నారు. మరోవైపు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, ఏపీ సీఎం చంద్రబాబుకు కూడా ఇదే నెలలో దుబాయ్‌లో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ పర్యటన వెనుక రాజకీయ కారణాలేమైనా ఉన్నాయా..? అనే గుసగుసలు కూడా వినపడుతున్నాయి.

ఆర్టీసీని ప్రజాప్రయోజన సంస్థగా గుర్తించాలి

- బడ్జెట్‌లో ఒకశాతం నిధులు కేటాయించాలి
- ఎక్స్‌పర్ట్ కమిటీకి ఎస్‌డబ్ల్యూఎఫ్ నివేదిక

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)ని ప్రజాప్రయోజన సంస్థగా గుర్తించాలని తెలంగాణ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) కోరింది. రాష్ట్ర బడ్జెట్‌లో ఒక శాతం నిధులు కేటాయించాలని సూచించింది. శుక్రవారం హైదరాబాద్‌లో ప్రభుత్వం నియమించిన ఎక్స్‌పర్ట్ కమిటీతో ఎస్‌డబ్ల్యూఎఫ్ భేటీ అయ్యింది. 11 ఆర్టీసీలను అధ్యయనం చేసిన నివేదికను ఆ కమిటీకి అందజేసింది. అనంతరం ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు ఓ ప్రకటన విడుదల చేశారు. కాలుష్య నివారణ, ఇంధన వ్యయంలో ఆర్టీసీలు అగ్రభాగాన ఉన్నాయని తెలిపారు. వ్యక్తిగత వాహనాల వాడకం తగ్గించి ఆర్టీసీ బస్‌లలో ప్రయాణించేలా ప్రభుత్వం ప్రోత్సహించాలని సూచించారు. దేశంలో లేని విధంగా టీఎస్‌ఆర్టీసీకి వస్తున్న ఆదాయంలో 19.44 శాతం పన్నుల రూపంలో చెల్లిస్తోందనీ, దీన్ని తగ్గించాలనీ కోరారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల ఫలితంగా 2014లో 57 వేలు ఉన్న కార్మికులు నేడు 52 వేలకు తగ్గారని తెలిపారు. అయినా ఒక ఆర్థిక సంవత్సరంలో ఎక్కువ మంది రవాణా చేసిన సంస్థగా టీఎస్‌ఆర్టీసీ నిలిచిందని పేర్కొన్నారు. ఇది సమిష్టి కృషి ఫలితమేనని తెలిపారు. 2018 మార్చి నాటికి ప్రభుత్వం నుంచి ఆర్టీసీకి చెల్లించాల్సిన బకాయిలు రూ.2,208 కోట్లు ఉండగా, కేవలం రూ.508 కోట్లే విడుదల చేసిందని పేర్కొన్నారు. 2014లో రూ.2,057 కోట్ల అప్పు ఉండగా, 2017-18 నాటికి రూ.2,883 కోట్ల అప్పు ఉందని తెలిపారు. నాలుగేండ్లలో అప్పు, అసలు, వడ్డీ చెల్లింపు కోసం టీఎస్‌ఆర్టీసీ రూ.2,939 కోట్లు చెల్లించిందని పేర్కొన్నారు. నాలుగేండ్లలో ఆర్టీసీ నష్టం రూ.2,505 కోట్లు ఉందని తెలిపారు. పెట్రో ఉత్పత్తులపై వ్యాట్‌ను తగ్గించాలని సూచించారు. జీఎస్టీ పరిధిలోకి తేవాలని కోరారు. గ్రామీణ, పట్టణ ప్రాంత సర్వీసులలో వస్తున్న నష్టాల్ని ప్రభుత్వమే భరించాలని తెలిపారు. రీయింబర్స్‌మెంట్ డబ్బులను ప్రతినెల విడుదల చేయాలని పేర్కొన్నారు. టీఎస్‌ఆర్టీసీలోని జోనల్, డివిజన్ వ్యవస్థను రద్దు చేయాలని తెలిపారు. దీనివల్ల రూ.70 కోట్ల ఖర్చు వృధా అవుతుందని పేర్కొన్నారు. కండక్టర్లు, డ్రైవర్ల ఉద్యోగ భద్రతకు ఆటంకంగా ఉన్న రెగ్యులేషన్స్‌ను మార్చాలని సూచించారు. టికెట్లు తీసుకొనే బాధ్యత ప్రయాణీకులపైనే ఉండాలని తెలిపారు. వైద్య సౌకర్యాలను మెరుగుపరచాలని పేర్కొన్నారు. తార్నాకలో ఉన్న ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీగా మార్చాలని కోరారు.

21 రోజుల్లో విలీన గ్రామాల్లో ఎన్నికలు

హైదరాబాద్ : తెలంగాణ వ్యాప్తంగా పలు జిల్లాల్లోని వివిధ గ్రామాలను సమీపంలోని మున్సిపాల్టీలు/మున్సిపల్ కార్పొరేషన్లల్లో విలీనం చేయడాన్ని సవాల్ చేసిన కేసును తెలంగాణ హైకోర్టు విచారించింది. దాదాపు 95కిపైగా నమోదు అయిన పలు కేసులు శుక్రవారం విచారణకు రాగానే ప్రభుత్వ న్యాయవాది కల్పించుకుని గ్రామాల విలీనానికి ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోరాదని, ఒకవేళ ఈ కేసులో కనుక హైకోర్టు ఉత్తర్వులు జారీచేస్తే విలీనం చేసిన గ్రామాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. హైకోర్టు ఉత్తర్వులు కనుక జారీచేస్తే 21రోజుల్లోగా విలీన గ్రామాలకు ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వ అదనపు ఏజీ రామచందర్‌రావు హామీఇచ్చారు. దీనిని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ. రాజశేఖర్‌రెడ్డిలతో కూడినధర్మాసనం రికార్డుచేసుకుంది. హైకోర్టు గ్రామాల విలీనాన్ని సవాల్ చేసిన వ్యాజ్యాలపై విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది.

దిగ్విజయ్‌కు ఊరట

కాంగ్రెస్ నాయకుడు దిగ్విజయ్ సింగ్‌కు హైకోర్టులో ఊరట లభించింది. మజ్లిస్ ప్రధాన కార్యదర్శి దాఖలు చేసిన క్రిమినల్ కేసులో కింది కోర్టు ఇచ్చిన ఎన్బీడబ్ల్యూ ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శివశంకరరావు ఆదేశాలు జారీ చేశారు.

సెన్సెక్స్ ▲ 181 35,695 | నిఫ్టీ ▲ 55 10,727

డాలరుకు రూపాయి విలువ 69.72


బంగారం(10గ్రా) రూ. 31,548



వెండి (కేజీ) రూ. 40,140


కోడిగుడ్లు (వందకి)

హైదరాబాద్	439	విజయవాడ	445
ఒక్కగుడ్డుకు	4.70	చెన్నై	453
వరంగల్	441	ముంబయి	494



టెలికాం ఆదాయానికి 22 శాతం గండి



న్యూఢిల్లీ: టెలికాం రంగంలో సంచలనంగా దూసుకువచ్చి.. తక్కువ ధరలతో ఎక్కువ మంది టెలికాం వాడకందారులను సంపాదించి చుకున్న రిలయన్స్ జియో ప్రభావం ప్రభుత్వ ఖజానాపై కూడా పడింది. గత ఆర్థిక సంవత్సరం (2018-19) టెలికాం సర్వీస్ ప్రొవైడర్స్ సేవల అమ్మకాలు తగ్గడంతో ఆదాయాలు క్షీణించిన కారణంగా.. ఖజానాకు 22 శాతం మేర గండి పడినట్టుగా ప్రభుత్వం శుక్రవారం పార్లమెంటుకు తెలిపింది. ప్రభుత్వానికి ఏజీయూసీ రిసిప్ట్ తగ్గినట్టుగా టెలికాం శాఖ మంత్రి మనోజ్ సిన్హా రాజ్యసభలో సభ్యులు అడిగిన ఒక ప్రశ్నకు లిఖిత పూర్వక సమాధానంగా తెలిపారు. టెలికాం సేవల అమ్మకం నుంచి ప్రభుత్వం లైసెన్స్ ఫీజులు, స్పెక్ట్రమ్ చార్జీల వసూళ్లుగా ఆదాయం వస్తోంది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో టెలికాం రంగం ఏజీఆర్ 18.62 శాతం కుంగి రూ.1,60,787.9 కోట్ల నుంచి రూ.1,30,844.9 కోట్లకు పడిపోయిందని ప్రభుత్వం తెలిపింది. దీంతో ప్రభుత్వానికి లైసెన్స్ ఫీజ్, ఎస్‌యూసీ ఆదాయం తగ్గిపోయిందని మంత్రి తెలిపారు. ఇదే సమయంలో సర్కారుకు లైసెన్స్ ఫీజు ఆదాయం కూడా 18.12 శాతం కుంగి రూ.13,0032 కోట్ల నుంచి రూ.10,670.6 కోట్లకు క్షీణించిందని సర్కారు తెలిపింది. మొబైల్ ఆపరేటర్లకు కేటాయించిన రేడియోవేవ్స్ మొత్తంపై గణించే ఎస్‌యూసీ ఆదాయం కూడా 29 శాతం తగ్గి రూ.7,048 కోట్ల నుంచి రూ.4,984 కోట్లకు కుంగినట్టుగా సర్కారు గణాంకాల రూపంలో వెల్లడించింది.

రూ.లక్ష లోపు ఆర్థిక మోసాలపైనా నజర్



న్యూఢిల్లీ: ఆర్థిక మోసాల కట్టడి చేసే విషయంలో ప్రభుత్వం వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని ఐటీ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ రాజ్యసభకు తెలిపారు. రూ.లక్ష లోపు ఆర్థిక మోసాలను సమీక్షించేందుకు గాను ప్రభుత్వం, భారతీయ రిజర్వు బ్యాంక్‌తో కలిసి పని చేస్తోందని ఆయన అన్నారు. సమాచార చౌర్యం, సోషల్ నెట్‌వర్కింగ్ వెబ్‌సైట్ల నుంచి ఇతర మార్గాల్లో సమాచారాన్ని తస్కరించడాన్ని నివారించేందుకు గాను "పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు" ముసాయిదాను రూపొందించినట్టుగా ఆయన తెలిపారు. డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డులు, ఏటీఎం కార్డులు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ మోసాలకు సంబంధించిన కేసుల పరిశీలనను బ్యాంకులతో కలిసి ఆర్బీఐ నిర్వహిస్తోందని ఆయన తెలిపారు. భారత్ నుంచి ఎలాంటి డేటా చౌర్యాన్ని అయినా నిరోధిస్తామని ఆయన అన్నారు. అన్ని రకాల మోసాలను నిలవరించేలా కఠిన చర్యలు తీసుకోనున్నట్టుగా రవి శంకర్ ప్రసాద్ తెలిపారు. ఆర్బీఐ ఇప్పటికే రూ.లక్షకు మించిన మోసాలకు సంబంధించిన కేసులను పరిశీలిస్తోందని మంత్రి తెలిపారు. సైబర్ ప్రపంచంలో అనిశ్చితి కారణంగా ఈ విభాగాలలో సమస్యలు తలెత్తుతూనే ఉన్నాయని మంత్రి తెలిపారు. అయినా ప్రభుత్వం డేటా సంరక్షణకు చర్యలు తీసుకొంటోందని ఆయన తెలిపారు. ఇందుకు గాను ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. డేటా సంరక్షణ విషయంలో ఎలాంటి వెనుకడుగు వేసేది లేదన్న మంత్రి దేశంలో అందిన ఫిర్యాదుల మేరకు ఫేస్‌బుక్‌పై కేసు నమోదు చేసి చర్యలు తీసుకున్న సంగతిని ఆయన గుర్తు చేశారు.

విలీనంతో చౌకగా రుణాలు

బ్యాంకింగ్‌లో ఉద్యోగ కోతలు ఉండవు: జైట్లీ



న్యూఢిల్లీ: బ్యాంకుల విలీనం వల్ల ఈ రంగంలో ఉద్యోగ కోతలు ఉండవని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ స్పష్టం చేశారు. ప్రభుత్వ రంగ బ్యాంకులైన దేనా బ్యాంకు, విజయ బ్యాంకులు బ్యాంక్ ఆఫ్ బరోడాలో విలీనం చేసేందుకు కేంద్ర మంత్రివర్గం ఇటీవల ఆమోదం తెలిపిన నేపథ్యంలో ఆయన ఈ ప్రకటన చేయడం విశేషం. బ్యాంకుల విలీనం విషయమై ఆర్థిక మంత్రి జైట్లీ శుక్రవారం లోక్‌సభలో ప్రకటన చేస్తూ బ్యాంకుల విలీనం వల్ల ప్రజలకు మేలే జరుగుతుందని అన్నారు. విలీనంతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లాంటి అతిపెద్ద బ్యాంకింగ్ సంస్థలు ఏర్పడుతాయని ఆయన స్పష్టం చేశారు. రుణ వ్యయం కూడా తగ్గుతుందని జైట్లీ వివరించారు. దీంతో చౌకగా రుణాలు లభిస్తాయని ఆయన స్పష్టం చేశారు. బ్యాంకు ఉద్యోగుల సమ్మెలను నిరసనలను పట్టించుకోకుండా ప్రభుత్వం బ్యాంకుల విలీనం విషయంలో ముందుకు పోవడంపై సర్వత్రా విమర్శలు వెలువడుతున్న నేపథ్యంలో బ్యాంకు ఉద్యోగులకు పూర్తి భరోసా కలిగించేలా జైట్లీ ప్రకటన చేయడం విశేషం. బ్యాంకుల నిరర్థక ఆస్తులు తగ్గుతున్నాయని, దాదాపు రూ.3లక్షల కోట్ల సొమ్మును తిరిగి వ్యవస్థలోకి తీసుకువచ్చేందుకు తాము అమలులోకి తెచ్చిన దివాల చట్టం ఎంతగానో దోహదం చేస్తోందని జైట్లీ వివరించారు. ప్రభుత్వ రంగ బ్యాంకులకు ప్రతిపాదిత మూలధనీకరణ పథకం కింద డిసెంబరు 31 నాటికి రూ. 51,533 కోట్ల ఆర్థిక చేయూతను బ్యాంకులకు అందించినట్టుగా తెలిపారు. '2018-19 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనాల్లో రూ. 65వేల కోట్లను ప్రభుత్వ రంగ బ్యాంకుల రికాపిటలైజేషన్ కోసం కేటాయించాం. ఇందులో డిసెంబరు 31 నాటికి రూ. 51,533 కోట్లను బ్యాంకులకు ఇచ్చాం. నిరర్థక ఆస్తులతో ప్రభుత్వ రంగ బ్యాంకులు నష్టాలను చవిచూస్తున్నాయి' అని జైట్లీ తెలిపారు. మొత్తం 21 ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 11 బ్యాంకులను తక్షణ దిద్దుబాటు చర్యల నియమావళి కిందకు తీసుకొచ్చినట్లు తెలిపారు. పరిస్థితులు కుదురుకోగానే ఆయా బ్యాంకులకు తగిన ఊరట కల్పించనున్నట్టుగా ఆయన వివరించారు. ప్రభుత్వ రంగ బ్యాంకులను కాపాడుకొనే దిశగా సర్కారు అన్ని చర్యలను చేపడుతోందని ఆయన తెలిపారు.

27 మంది ఆర్థిక నేరగాళ్లు దేశం దాటారు..!



గడిచిన ఐదేండ్ల కాలంలో దాదాపు 27 మంది ఎగవేతదారులు, ఆర్థిక నేరగాళ్లు దేశం దాటి పారిపోయారని కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి శివ్‌ప్రతాప్ శుక్లా లోక్‌సభకు తెలి యజేశారు. 27 మంది ఆర్థిక నేరగాళ్లలో దాదాపు 20 మందిపై రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయా ల్సిందిగా ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించినట్లు ఆయన వెల్లడించారు. భారత్ అధికారుల అభ్యర్థన మేరకు.. దేశం విడిచి పారిపోయిన ఎనిమిది మందిపై ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేసినట్లు లోక్‌సభకు ఇచ్చిన రాతపూర్వక సమాధానంలో ఆయన పేర్కొన్నారు. ఆరు కేసుల్లోని నిందితులను భారత్ తిరిగి పంపించాల్సిందిగా కోరుతూ అభ్యర్థనలు పెట్టినట్లు తెలిపారు. బ్యాంకులకు రూ.9వేల కోట్ల మేర రుణాలు ఎగ్గొట్టి లండన్‌లో తలదాచుకుంటున్న విజయ్ మాల్యాను భారత్‌కు తిరిగి పంపించేందుకు బ్రిటన్‌కు చెందిన స్థానిక కోర్టు అంగీకరించినట్లు ఆయన లోక్‌సభకు తెలియజేశారు. కంపెనీలకు రూ.50 కోట్ల అంతకు పైన రుణాలు ఇచ్చే సమయంలో బ్యాంకు అధికారులు ప్రమోటర్లు/ డైరెక్టర్ల పాస్‌పోర్టు కాపీలను తీసుకోవాల్సిందిగా ప్రభుత్వం బ్యాంకులకు సూచించినట్లు ఆయన పేర్కొన్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు రూ.13 వేల కోట్ల కుంభకోణంలో ప్రధాన నిందితులుగా ఉన్న నీరవ్ మోదీ, మోహుల్ ఛోక్సీలను భారత్ రప్పించేందుకు ప్రభుత్వ తగిన చర్యలు చేపడుతున్నట్టుగా మంత్రి తెలిపారు. దేశంలో ఆర్థిక మోసగాళ్ల ఆగడాలు ఇకపై చెల్లకుండా చట్టాన్ని కఠినతరం చేస్తున్నట్టుగా ఆయన వెల్లడించారు.

'కనీసం' దెబ్బకు 2.4 కోట్ల కనెక్షన్లు కట్..!

న్యూఢిల్లీ: ప్రముఖ టెలికాం నెట్‌వర్క్‌లైన భారతీ ఎయిర్‌టెల్, వోడాఫోన్ ఐడియాలు కేవలం మూడు నెలల్లో 2.4 కోట్ల మంది టెలికాం సేవల వాడకందారులను కోల్పోయాయి. ఈ నెట్‌వర్క్‌లు తక్కువ ఆదాయం కలిగించే చందాదారులను తొలగించే ప్రయత్నాలలో భాగంగా కనీస రీచార్జ్ విధానాన్ని అమలులోకి తేవడంతో చాలా మంది వినియోగదారులు తమ కనెక్షన్లను తీయించేస్తున్నారు. దీంతోసబ్‌స్క్రైబర్స్ విషయంలో దేశంలోనే అతి పెద్ద టెలికాం ఆపరేటర్ అయిన వోడాఫోన్ ఐడియా సెప్టెంబరు నుంచి నవంబరు మధ్య కాలంలో 20.57 మిలియన్ల మంది చందాదారులను కోల్పోగా, భారతీ ఎయిర్‌టెల్ సెప్టెంబరు నుంచి అక్టోబరు మధ్యలో 42.2 లక్షల మంది టెలికాం సేవల వాడకందారులను కోల్పోయింది. ఎయిర్‌టెల్ నుంచి నవంబరులో 1,01,534మంది సబ్‌స్క్రైబర్స్ వెళ్లిపోయారు. రానున్న కొన్ని నెలల్లో ఈ ఆపరేటర్ల నుంచి ఇంకా చాలా మంది వాడకందారులు వెళ్లిపోయే అవకాశం కనిపిస్తోంది. వోడాఫోన్ ఐడియా, ఎయిర్‌టెల్‌ల అత్యంత తక్కువ రీఛార్జ్ (డేటా,వాయిస్) ప్లాన్ రూ.35 వద్ద ప్రారంభమవుతోంది. ఈ టెలికాం నెట్‌వర్క్‌లు అతి తక్కువ రీఛార్జ్ ప్లాన్ ధర పెంచడం వల్ల ఈ ప్రభావం దాదాపు 70 నుంచి 90 మిలియన్ల వినియోగదారులపై పడుతోందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

భారీ ఏసీ సేవలకు 'ఎయిర్ వింగ్స్'



నవతెలంగాణ-వాణిజ్య విభాగం: భారీ స్థాయిలో ఏసీ సౌకర్యం అవసరమయ్యే వారి సౌకర్యార్థం తాము 'ఎయిర్‌వింగ్స్' పేరుతో రూఫ్‌టాప్ ఏసీ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్టుగా ఎవెన్స్ గ్రూపు సీఎండీ వెంకటేశ్వర్ తెలిపారు. భారత్‌లో నే మొట్టమొదటిసారిగా తమ సంస్థ ఈ సేవలను అందుబాటులోకి తెచ్చినట్టుగా ఆయన వివరించారు. ఎయిర్‌వింగ్స్‌తో బాహ్య ప్రాంతంలో ముఖ్య నేతల సభలతో పాటు భారీ ఈవెంట్లకు ఎయిర్ కండీషనింగ్ సేవలను అంది స్తున్నట్టుగా ఆయన తెలిపారు. భారీ సభలు, కార్పొరేట్ ఈవెంట్స్, ప్రదర్శనలు, వివాహాలకు అందుబాటు ధరల్లో రూఫ్‌టాప్ ఏసీలను అందించేలా సంస్థను రూపొందించినట్టుగా తెలిపారు. ప్రాథమికంగా దక్షిణాదిలో సేవలు అందిస్తున్నట్టు వివరించారు.

జిగేలుమన్న వెండి ధర.. జోరు తగ్గిన పసిడి



న్యూఢిల్లీ: వరుసగా మూడు రోజులు పెరిగిన బంగారం ధర శుక్రవారం స్వల్పంగా తగ్గింది. కాగా కిలో వెండి ధర మాత్రం రూ.40,000కు చేరింది. న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 99.9 శాతం, 99.5 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.145 తగ్గి వరుసగా రూ.32,690, రూ.32,540 గా నమోదయ్యింది. కాగా కిలో వెండిపై రూ.440 ప్రియమై రూ.40,140కి ఎగిసింది. అదే విధంగా 100 వెండి నాణేల ధర రూ.76,000గా నమోదయ్యింది. రానున్న రోజుల్లో వెండి ధరలు మరింత కొండెక్కె అవకాశాలు కనిపిస్తున్నాయని బులియన్ మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలో ఒడిదొడుకులు కూడా ధరపై ప్రభావం చూపుతున్నాయి.

40 శాతం వాటా మాదే: ఎస్‌బీఐ



నవతెలంగాణ, వాణిజ్య విభాగం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొత్తం గృహ రుణాల్లో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) 40 శాతం పైగా వాటాతో అగ్రస్థానంలో ఉందని ఆ బ్యాంకు అమరావతి సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ (సిజిఎం) మనీ పల్వేసన్ అన్నారు. ఈ రంగంలో మెరుగైన వృద్ధి రేటు నమోదవుతుందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ మొత్తం ఎస్‌బిఐ కార్యకలాపాల్లో ఎపి రీజియన్ వాటా కీలకంగా ఉందన్నారు. ఇక్కడ రూ.26,367 కోట్ల గృహ రుణాలు జారీ చేశామన్నారు. 2018 డిసెంబర్ ముగింపు నాటికి బ్యాంకు మొత్తం అడ్వా న్సులు రూ. 85,143 కోట్లు, డిపాజిట్లు రూ. 95,194 కోట్లకు చేరాయన్నారు. మొత్తంగా రూ. 1.80 లక్షల కోట్ల వ్యాపారం కలిగి ఉన్నామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి డిసెంబర్ నాటికి అడ్వాన్సులు 18.45 శాతం పెరిగి రూ.10,348 కోట్లుగా, డిపాజిట్లు 10.71 శాతం పెరిగి రూ.7080 కోట్లుగా నమోదయ్యాయయని అన్నారు. ఎస్‌ఎంఇలకు రూ.13,360 కోట్ల అప్పులిచ్చామని చెప్పారు.

అభ్యర్థులను తొందరగా ప్రకటించండి

- కాంగ్రెస్ సమీక్షల్లో నేతల ఆవేదన



నవతెలంగాణబ్యూరో-హైదరబాద్

పార్టీ అభ్యర్థులను ఆలస్యంగా ప్రకటించడం వల్లే ఓడిపోయామని కాంగ్రెస్ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్లనే ఎన్నికల ప్రచారానికి ఎక్కువగా సమయం దొరకలేదని వాపోయారు. ఈ నేపథ్యంలో పార్లమెంటు అభ్యర్థులైనా తొందరగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆదిలాబాద్, పెద్దపల్లి, నిజామాబాద్, జహీరాబాద్, వరంగల్ పార్లమెంటు నియోజకవర్గాలకు చెందిన నేతలతో టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి రామచంద్రకుంతియా, ఏఐసీసీ జాతీయ కార్యదర్శి శ్రీనివాసన్ తదితరులు సమావేశమయ్యారు. అందులో భాగంగా గ్రామపంచాయతీ, పార్లమెంటు ఎన్నికలపై చర్చించారు. కాంగ్రెస్‌పార్టీ తరుపున ఓడిపోయిన అభ్యర్థులు తమ ఓటమికి వేర్వేరు కారణాలు వివరించినట్టు తెలిసింది. కొంత మంది పార్టీ అంతర్గత కుమ్ములాటలు కారణమని చెప్పగా, మరికొంత మంది ఆలస్యంగా టికెట్ ఇవ్వడంతో ప్రచారానికి ఎక్కువగా సమయం దొరకలేదని కరీంనగర్‌కు చెందిన నేత ఒకరు తెలిపారు. టీఆర్ఎస్ ముందుగా అభ్యర్థులను ప్రకటించడంతోపాటు ప్రచారం చేయడానికి వారికి కావాల్సిన సమయం ఉండటంతో ప్రతి గడపను తొక్కారని వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఆర్నెళ్ల ముందు అభ్యర్థులను ప్రకటిస్తామని చెప్పి...ఏడు రోజుల ముందు అభ్యర్థులను ప్రకటించారని వాపోయారు. దీంతో అభ్యర్థి ఎవరో తెలియక, టికెట్ ఎవరికి వస్తోందో అర్థంకాక ఎవరికి వారే అన్నట్టు వ్యవహరించారని వివరించారు. ఇతర పార్టీలతో పొత్తులు, సీట్లపై జరిగిన చర్చల్లోనూ జాప్యం జరిగింది. ఎవరికి టికెట్ ఇవ్వదలిచారో వారికి ప్రచారం చేసుకోవాలని ముందు చెప్పి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. ఓటమికి బాధ్యత వహించకుండా టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు సమీక్షలు నిర్వహిస్తున్నారని కరీంనగర్ జిల్లాకు చెందిన సీనియర్ నేత స్పందించారు.

ఎంపీ అభ్యర్థుల జాబితా సిద్ధం చేయండి

- పీసీసీలకు ఏఐసీసీ ఆదేశం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యరుల జాబితా సిద్ధం చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ కమిటీలకు ఏఐసీసీ ఆదేశించింది. యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కోరింది. శుక్రవారం ఈమేరకు ఏఐసీసీ కార్యాలయం ఒక ప్రకటనను విడుదల చేసింది. ఆ వివరాలిలా ఉన్నాయి. రాబోయే పార్లమెంట్ ఎన్నికల కోసం ఏఐసీసీ కొత్త కమిటీలతో ఎన్నికలకు సిద్ధమవుతున్నది. జనవరి 3వ తేదీన డిల్లీలో జరిగిన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, ఇన్‌చార్జీల సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను పీసీసీ కమిటీలకు పంపించింది. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ)లను తిరిగి నియమించాలని, వాటితోపాటు ఎన్నికల కోసం కొత్తగా ఐదు కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించింది. జనవరి 8వ తేదీలోగా ఎన్నికల కోసం పిసిసి స్థాయిలో ఐదు కమిటీలను ఏర్పాటు చేయాలి. అందులో కోఆర్డినేషన్ కమిటీ, ప్రదేశ్ ఎన్నికల కమిటీ, ప్రచార(కాంపెయిన్) కమిటీ, పబ్లిసిటీ కమిటీ, మీడియా కో ఆర్డినేషన్ కమిటీ నియమించాలని కోరింది. జనవరి 15 తర్వాత నుంచి ఈ కమిటీలు పని చేయడం ప్రారంబించాలని ఆదేశించింది. పీసీసీ, డీసీసీ, నగర కమిటీలు, బ్లాక్, వార్డు కమిటీలను జనవరి 15వ తేదీ లోగా నియమించాలని, బూత్ కమిటీలు 30 వరకు పూర్తి చేయాలని, ఫిబ్రవరి నెలఖారు నాటికి కొత్తగా నియమించిన అన్నిస్థాయిల్లోని కమిటీలకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని కోరింది. ఎన్నికలు సమీపిస్తుండడంతో పీసీసీ కమిటీలలో ఉన్న కార్యనిర్వాహక అధ్యక్షులకు, ఉపాధ్యక్షులకు, ప్రధాన కార్యదర్శులుగా, కార్యదర్శులకు ప్రత్యేకంగా పని విభజన చేసి బాధ్యతలు అప్పగించాలని సూచించింది.

పోడు భూములు దక్కేనా..

అటవీ హక్కుల చట్టం అమలు కోసం ఆదివాసీల ఆరాటం

- సీఎం హామీతో చిగురిస్తున్న ఆశలు

తరతరాలుగా అడవితల్లిని నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసీలు ఆ అడవిపై హక్కు కోసం ఎదురుచూస్తున్నారు. సాంప్రదాయ బద్ధంగా వస్తున్న పోడు వ్యవసాయాన్ని గుర్తిం చి ఆ భూములపై హక్కులు కల్పించాలని ఏండ్ల తరబడి పోరాటం చేస్తూనే ఉన్నారు. ఆదివాసీల పోరాటంతో కేంద్ర ప్రభుత్వం అటవీ హక్కుల చట్టాన్ని అమల్లోకి తెచ్చి పదేండ్లు గడచినా దీనిని రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేయలేదు. మరో వైపు హరిత హారం పేరుతో భూములను గుంజుకోవటం వివాదాస్పదమైంది. పోడు భూములపై హక్కులు కల్పిస్తామని ఎన్నికల హామీలో భాగంగా ఇటీవల సీఎం కేసీఆర్ చేసిన ప్రకటనతో ఆదివాసీల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. రాష్ట్ర వ్యాప్తంగా రెవిన్యూ, అటవీ శాఖలు చేస్తున్న ఉమ్మడి సర్వేలోనైనా పోడు భూములను గుర్తిస్తారో లేదో అనే చర్చ ఇప్పుడు సర్వత్రా జరగుతున్నది.

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

ప్రభుత్వ వైఖరిలో మార్పు కోసం ఎదురుచూపు




అటవీ, పోడు భూములపై హక్కుల కోసం జరిగిన సుదీర్ఘ పోరాటాల తర్వాత 2006లో అటవీ హక్కుల చట్టం అమల్లోకి వచ్చింది. 2005 కి పూర్వం అటవీ భూములను సాగుచేసుకుంటున్న వారికి ఈ చట్టం ప్రకారం హక్కులు కల్పించాల్సి ఉండగా రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందనే విమర్శలు పెల్లుబికాయి. అడడుల్లోనూ, కొండ వాలుల్లోనూ చిన్న చిన్న చెట్లను, పొదలను నరికి చేసుకునే వ్యవసాయాన్నే పోడు వ్యవసాయమని ఆదివాసీలు పిలుస్తారు. సాంప్రదాయ బద్దంగా చేసుకునే ఇటువంటి వ్యవసాయంపై రాష్ట్రంలో ఆరు లక్షల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని అనధికారిక అంచనా వల్ల తెలుస్తున్నది. అటవీ హక్కుల చట్టం ప్రకారం గ్రామసభల ద్వారా పోడుదారులను గుర్తించి సబ్‌డివిజన్ స్థాయి, జిల్లా స్థాయి కమిటీలకు పంపాల్సి ఉంది. ఈ కమిటీల్లో నిర్ణయించిన విధంగా పట్టాలు జారీ చేసే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం కట్టబెట్టింది. అటవీ భూములపై ఆదివాసీలకు హక్కులు ఇచ్చే విషయంలో అటవీ శాఖ అడుగడుగునా అడ్డుపడుతూ వచ్చింది. ఫలితంగా అర్హులైన ఆదివాసీలకు కూడా పట్టాలు లభించలేదు. అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయటానికి నోడల్ ఏజెన్సీగా గిరిజన సంక్షేమ శాఖను నియమించినప్పటికీ వివిధ దశల్లో అటవీ అధికారులు పెడుతున్న అభ్యంతరాల వల్ల క్లెయిమ్‌లు పరిష్కారానికి నోచుకోలేదు. అటవీ హక్కుల చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో హక్కుల కోసం 3.30 లక్షల దరఖాస్తులు అందాయి. ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అటవీ హక్కుల కోసం దరఖాస్తులు పెద్ద సంఖ్యలో అందాయి. వీటి ప్రకారం 19.66 లక్షల ఎకరాల పోడు భూములకు హక్కులు కల్పించాల్సి ఉండగా ప్రాథమిక స్థాయిలో జరిగిన గ్రామసభల్లోనే అధికారులు లక్ష దరఖాస్తులను తిరస్కరించి గిరిజనులను నిరాశకు గురి చేశారు. వివిధ దశల్లో కొర్రీల తర్వాత కేవలం 1.74 లక్షల వ్యక్తిగత దరఖాస్తులను పరిష్కరించటం ద్వారా 4.53 లక్షల ఎకరాలకు మాత్రమే హక్కులు కల్పించారు. వ్యక్తిగత దరఖాస్తులను పెద్ద సంఖ్యలో తిరస్కరించిన అధికారులు ప్రపంచ బ్యాంకు ఆదేశాలతో వనసంరక్షణ సమితీల పేరుతో సాముదాయక హక్కులు కల్పించటం కూడా మరో వివాదానికి కారణమైంది. సామూహిక హక్కులతో కేవలం ఫలసాయంలో కొంత అనుభవించే అధికారం ప్రజలకు ఉంటుందే తప్ప యాజమాన్య హక్కులు, అధికారాలు ప్రభుత్వం చేతిలో ఉంటుంది. దీని వల్ల ఆదివాసీ కుటుంబాలకు ప్రయోజనం లేకుండా పోయింది.

హరిత హారం పేరుతో పోడు భూముల స్వాధీనం...

అటవీ హక్కుల చట్టం ద్వారా పోడు భూములకు హక్కులు కల్పించాల్సిన అధికార యంత్రాంగం అది చేయకపోగా హరిత హారం పేరుతో భూములను స్వాధీనం చేసుకోవటం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించింది. ఈ సందర్భంగా కొందరు అటవీ పోలీస్ అధికారులు ఆదివాసీల పట్ల దురుసుగా ప్రవర్తించటం, అక్రమ కేసులు పెట్టడంతో రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాలు అట్టుడికి పోయాయి. దీనితో ఆదివాసీలు ఆందోళన బాట పట్టారు. పోడు భూముల విషయంలో సీఎం కేసీఆర్ ఇటీవల హామీ ఇచ్చినప్పటికి ఇంకా అధికారిక ఉత్తర్వులు కానీ కొత్త మార్గదర్శకాలు కానీ విడుదల కాలేదు. 2005 కి పూర్వం పోడు చేసుకుంటున్న భూములకు హక్కులు ఇవ్వాలని అటవీ హక్కుల చట్టంలో ఉండగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకూ (2014) పోడు భూములు సాగు చేసిన వారందరికీ హక్కులు కల్పిస్తామని సీఎం చేసిన ప్రకటన ఆదివాసీల్లో కొత్త ఆశలు రేకెత్తించింది.

గుత్తి కోయలకు హక్కులు కల్పించాలని డిమాండ్..



చత్తీస్‌గఢ్ నుం చి వలసవచ్చి గోదా వరి లోయలో నివాస ముంటున్న గుత్తి కోయలకు కూడా అటవీ హక్కుల చట్టం వర్తింప చేయాలనే డిమాండ్ ముందుకు వచ్చింది. రిజర్వ్ అడవుల్లో ఇండ్లు నిర్మించుకుని జీవిస్తున్న గుత్తి కోయలను ఆ ప్రాంతం నుంచి ఖాళీ చేయించాలని అటవీ శాఖ అనేక సార్లు ప్రయత్నించింది. అటవీ అధికారులు గుత్తి కోయలపై బల ప్రయోగం చేయటంమే కాక వారి ఇండ్లు తగలబెట్టడం కూడా పలు సందర్భాల్లో జరిగింది. అటవీ హక్కుల చట్టం ప్రకారం వీరి భూములకు కూడా రక్షణ కల్పించాల్సి ఉన్నది. రాష్ట్రంలోని కవ్వాల్, అమ్రాబాద్ టైగర్ జోన్లతో పాటూ పోలవరం ముంపు ప్రాంతంలో ఉంటున్న ఆదివాసీలు కూడా అటవీ హక్కుల చట్టం పరిధిలోకి వస్తారు. అయినప్పటికీ అటవీ శాఖ వీరికి రక్షణ కల్పించకుండా బలవంతంగా అక్కడి నుంచి తరలించే ప్రయత్నం చేస్తున్నది. కేంద్రం నుంచి స్పష్టమైన మార్గదర్శకాలు లేక పోవటమే దీనికి కారణమని అటవీ అధికారులంటున్నారు.

స్వయం ఉపాధి రుణాలకు జీఎస్టీ దెబ్బ

బ్యాంక్ నిబంధనలతో లబోదిబో..

- జీఎస్టీ భారంతో రుణాలు తిరస్కరణ



నవతెలంగాణ - సిటీబ్యూరో

నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి రుణాలకు జీఎస్టీ గుదిబండగా మారిం ది. లబ్దిదారులు జీఎస్టీ భారాన్ని భరించలేక లబోదిబోమంటున్నారు. ఈ విషయం లో ప్రభుత్వ అధికారులు సైతం చేతులెత్తేయడంతో జీఎస్టీ భారాన్ని భరించలేక, మంజూరైన రుణాన్ని వదులుకోలేక తలలు పట్టుకుంటున్నారు. ముషీరాబాద్ మండలానికి చెందిన ప్రదీప్ (పేరు మార్పు) గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. ఎస్సీ కార్పొరేషన్ నుంచి స్వయం ఉపాధి పథకంలో వీడియోగ్రఫీ యూనిట్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. కార్పొరేషన్ నుంచి రూ.3 లక్షల రుణం మంజూరైంది. ప్రతిపాధిత యూనిట్‌ను కొనుగోలు చేసేందుకు లబ్దిదారుడు బ్యాంక్‌కు కొటేషన్ అందజేయాలి. మంజూరైన రుణం కంటే రూ.5 వేలు లేదా రూ. 10 వేలతో అదనంగా కొటేషన్ ఇవ్వడంతో పాటు యూనిట్ కొనుగోలుకు చెల్లించే జీఎస్టీని అదనంగా చూపించాలని బ్యాంక్ సిబ్బంది చెప్పారు. వీడియోగ్రఫీ యూనిట్ కొనుగోలు చేసేందుకు జీఎస్టీ 28 శాతం చెల్లించాల్సి రావడంతో మొత్తం రూ.3.10 లక్షలకు రూ.68 వేలు అదనపు భారం కానుంది. దీంతో అప్పు చేసి జీఎస్టీ భారాన్ని భరించలేక.. మంజూరైన రుణాన్ని వదులుకోలేక సతమతమవుతున్నాడు. హైదరాబాద్ జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్‌ల ద్వారా మంజూరైన రుణాల్లో లబ్దిదారులు ఎదుర్కొంటున్న తీరు ఇది.

అప్పుల పాలవుతున్న లబ్దిదారులు ..

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ విధానంతో ప్రతి వినియోగదారుడు కొనుగోలు చేసిన వస్తువులపై జీఎస్టీ రూపంలో అదనంగా చెల్లించాల్సి వస్తోంది. ఈ అదనపు భారం ప్రభుత్వం, బ్యాంకర్ల సహకారంతో స్వయం ఉపాధి యూనిట్లతో జీవనోపాధి పొందాలనుకునే నిరుద్యోగులకు సైతం తప్పడం లేదు. దీంతో ఒక్కో లబ్దిదారుడు మొత్తం యూనిట్ విలువకు 5 శాతం నుంచి 28 శాతం వరకు జీఎస్టీ చెల్లించాల్సి వస్తోంది. మొత్తం యూనిట్ ధరకు చెల్లించాల్సిన జీఎస్టీ మొత్తాన్ని లబ్దిదారుల ఖాతాలో జమ చేస్తేనే, సదరు బ్యాంకులు సంబంధిత యూనిట్ల కొనుగోలుకు చెక్కు మంజూరు చేస్తున్నారు. దీంతో జీఎస్టీ భారాన్ని మోసేందుకు లబ్దిదారులు అప్పులు చేయాల్సి వస్తోంది. లేదంటే ఏడాదంతా కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ తిరగ్గా తిరగ్గా మంజూరైన రుణాన్ని వదులుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

ఏడాది గడిచినా మంజూరులోనూ జాప్యం..

హైదరాబాద్ జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 2017-18 ఏడాదిలో ఎస్సీ నిరుద్యోగ యువతకు సుమారు రూ.20 కోట్లతో 1186 స్వయం ఉపాధి యూనిట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిలో 957 యూనిట్లకు మాత్రమే ప్రభుత్వం సబ్సిడీ విడుదల చేసింది. అందులో 480 యూనిట్లకు బ్యాంకులు గ్రౌండింగ్ చేశాయి. మరో 229 లబ్దిదారులకు సబ్సిడీ మంజూరు చేయాల్సి ఉండగా, బ్యాంకులు ఇంకా 706 యూనిట్లను గ్రౌడింగ్ చేయాల్సి ఉంది. ఈ ఏడాదికి (2018-19) సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ ముగిసినప్పటికీ, గతేడాది రుణాల మంజూరు ప్రక్రియను పూర్తి చేయ డంలో కార్పొరేషన్ తీవ్ర జాప్యం చేస్తోంది. 2016-17 ఏడాదిలో మొత్తం 390 యూనిట్లు మంజూరు కాగా, వాటిలో 356 యూనిట్లకు మాత్రమే సబ్సిడీ విడుదలైంది. అందులోనూ 25 యూనిట్లకు బ్యాంకర్లు ఇంకా గ్రౌండింగ్ చేయాల్సి ఉంది.

జీఎస్టీ విషయంలో చేసేదేమీ లేదు
బి.మాన్యా నాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ

లబ్దిదారులు తమ యూనిట్లు నెలకొల్పాలంటే ఆయా వస్తువులను కొనుగోలు చేయాల్సిందే. ఏ వస్తువు కొనుగోలు చేసినా నిబంధనల ప్రకారం జీఎస్టీ చెల్లించాలి. ఈ విషయంలో మేమేం చేయలేని పరిస్థితి. లబ్దిదారులు దాదాపుగా యూనిట్లను ఏర్పాటు చేయడానికే మొగ్గు చూపుతున్నారు.



బీ కేర్ ఫుల్...

“అయ్యో డెబిట్ కార్డు పని చేయకపోతే ఎలా? వెంటనే చేయండి. దీని కోసం నేనేమైనా బ్యాంకుకు రావాలా?” కంగారుగా అడిగాడు సుధీర్. “అవసరం లేదు మీ డేబిట్ కార్డు నెంబర్, దానిపై ఉండే ఎక్స్‌పైరీ డేట్, సీవీవీ నెంబర్ చెప్పండి. నేను అప్‌డేట్ చేస్తాను. అప్పుడు మీ మొబైల్‌కి ఓ మెసేజ్ వస్తుంది. అందులో ఓటీపీ నెంబర్ ఉంటుంది. అది చెప్పండి చాలు. వెంటనే మీ కార్డ్ ఎక్స్‌పైరీ పెరిగిపోతుంది” అన్నాడు. అడిగేది బ్యాంక్ మేనేజర్ కదా అని అతను అడిగిన వివరాలన్నీ చెప్పేశాడు. వెంటనే సుధీర్ అకౌంట్ నుండి పది వేల రూపాయలు కట్ అయినట్టు మెసేజ్ వచ్చింది. అది చూసి సుధీర్ షాక్ అయ్యాడు. ఇలాంటి సైబర్ మోసాలు ఈ మధ్య కాలంలో బాగా పెరిగిపోయాయి.

> సుధీర్ చిన్న ప్రైవేట్ కంపెనీలో జాబ్ చేస్తున్నాడు. ఎస్‌బిఐలో అకౌంట్ ఉంది. ఈ మధ్య ఆ బ్యాంక్ మేనేజర్ నుండి అతనికి ఫోన్ వచ్చింది. ‘మీ డెబిట్ కార్డు ఎక్స్‌పైరీ డేట్ ముగిసిపోయింది. ఇకపై మీ కార్డు పని చేయదు. కార్డు ఎక్స్‌పైరీ డేట్ పెంచుకోకపోతే వెంటనే బ్లాక్ అయిపోతుంది” అంటూ భయపెట్టాడు.

ఉచ్చు నుండి బయటపడాలి

టెక్నాలజీ పెరిగిన తర్వాత ఇలాంటి మోసాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. అధునాతనమైన సాంకేతిక విజ్ఞానాన్ని మంచికి కాకుండా ఇలా మోసం చేయడానికి కూడా వాడుకుంటున్నారు. సుధీర్ లాంటి చదువుకున్న వాళ్ళే ఇలా సైబర్ నేరగాళ్ళ ఉచ్చులో పడుతుంటే. క్యాష్ లెస్, ఆన్‌లైన ట్రాన్సాక్షన్ పెరిగిపోయి, ఏటీఎం కార్డు ద్వారానే డబ్బులు డ్రా చేసుకోవాలని బ్యాంకుల్లో చెబుతున్నారు. మరి ఇలాంటి పరిస్థితుల్లో చదువు రాని వారు ఏం చేయాలి? సైబర్ మోసగాళ్ళ ఉచ్చు నుండి ఎలా బయటపడాలి? అందుకే బీ కేర్ ఫుల్... అంటున్నారు ఆర్‌బీఐ వాళ్ళు. దీని గురించి కొన్ని జాగ్రత్తలు కూడా చెబుతున్నారు.

ఎస్ఎమ్ఎస్ ద్వారా తెలుపుతున్నారు

ఈ మధ్య కాలంలో అకౌంట్ ఉన్న ప్రతి ఒక్కరికీ మీ పిన్, సీవీవీ, ఏటీఎం కార్డుల వివరాలు, ఓటీపీ గురించి ఎవరితో షేర్ చేసుకోవద్దంటూ పదే పదే మేసేజ్‌లు వస్తున్నాయి. అలాగే RBI చెల్లింపు, సెటిల్మెంట్ సిస్టమ్స్ 2007 సెక్షన్ 18 (2) ప్రకారం ఆర్టికల్ 18, 2015 లోని నిబంధనల ప్రకారం అన్ని డెబిట్, క్రెడిట్ కార్డులు Chip పైన ఆధారపడి ఉండాలని RBI పేర్కొంది. దీనిని EMV డెబిట్ / క్రెడిట్ కార్డు అని పిలుస్తారు. ప్రస్తుతం వాడుతున్న డెబిట్, క్రెడిట్ కార్డు హోల్డర్లకు ఈ విషయాన్నీ ఎస్ఎమ్ఎస్ ద్వారా జారీ చేస్తున్నారు.



భద్రత కోసం

ఇది అపాయాలకు గురికాకుండా, మరింత భద్రత కలిగించే ఏకైక అయస్కాంత స్ట్రిక్-కార్డు మాత్రమే. ప్రతి క్రెడిట్ / డెబిట్ కార్డును డిసెంబర్ 31, 2018 న EMV చిప్ ఆధారిత కార్డులతో భర్తీ చేయాలని, బ్యాంకు ఖాతాదారులకి గత కొన్నిరోజులుగా వారి బ్యాంకుల నుండి SMS అందుకుంటున్నారు. EMV ఆధారిత కార్డులతో ఉన్న అయస్కాంత స్ట్రిప్-కార్డులను మార్చడానికి వారికి సలహాలు కూడా అందిచబడ్డాయి. అయితే, ఇదే అదునుగా చేసుకొని కొంతమంది సైబర్ నేరగాళ్లు విరుచుకుపడుతున్నారు. తాము బ్యాంకు నుండి కాల్ చేస్తున్నామని, మీకు బ్యాంకు చిప్ కార్డు ఇవ్వడానికి కొన్ని వివరాలను అందిచాల్సి ఉంటుందని మాయ మాటలు చెప్పి, వారి అకౌంట్లలోని సొమ్మును కొల్లగొడుతున్నారు.



ఇది ఎలా సాధ్యం ?

ఆన్లైన్లో మన అకౌంట్ ఓపెన్ చేయాలన్నా లేదా దాని నుండి ఎవరికైనా డబ్బును పంపించాలన్నా కూడా మన బ్యాంక్ లాగిన్ ఐడితో పాటుగా పాస్వర్డ్ కచ్చితంగా అవసరం. కాబట్టి ఇవిలేకుండా అకౌంట్ ఓపెన్ చేయడం కష్టతరం. కానీ, డెబిట్ కార్డు ద్వారా డబ్బును ట్రాన్స్ఫర్ చేయాలన్నా, కార్డు క్లోనింగ్ చేయాలన్నా కూడా కార్డు పూర్తి వివరాలు తెలుసుకుని వుంటే సరిపోతుంది. ప్రస్తుతం బ్యాంకులు అనుసరిస్తున్న చిప్ కార్డు నియమాలను ఆసరాగాచేసికొని సైబర్ నేరగాళ్లు కొంతమంది అకౌంట్ హోల్డర్లకు ఫోన్ చేసి మీకు Chip కలిగిన కొత్త కార్డును ఇవ్వనున్నామని, అందుకు మీ పాత కార్డుతో పాటుగా మీ వివరాలు కావాలని వారిద్వారా వివరాలను తెలుసుకొని వారి అకౌంట్ నుండి డబ్బును తీసుకుంటున్నారు.

ఇలా జరగకుండా ఏమి చేయాలి ?

- వాస్తవానికి, బ్యాంకులు ఎప్పుడు కూడా మీ వివరాలను ఫోను ద్వారా అడిగి తెలుసుకోవడానికి ప్రయత్నించవు. ఎందుకంటే మీకు సంబంధించిన పూర్తి వివరాలు బ్యాంకుల దగ్గర ఉం టాయి. మీకు ఇలాంటి ఫోన్లు వచ్చినపుడు సమాధానం చెప్పవలసిన అవసరం లేదు.
- ఒకవేళ ఫోన్ చేసిన వాళ్ళు మీపై ఎక్కువగా ఒత్తిడి తెచ్చినట్లయితే, మేము మా దగ్గరలోని బ్రాంచిని సంప్రదిస్తామని ఒక్క మాటలో తేల్చి చెప్పండి.
- OTP –వన్ టైం పాస్వర్డ్, ఎటువంటి బ్యాంకు కూడా మీ అకౌంటుకు వచ్చేటటువంటి ఈ OTP గురించి ఎప్పుడు కూడా సమాచారాన్ని సేకరించవు. మిమ్మల్ని మీ OTP గురించి అడుగుతున్నారంటే వాళ్ళు కచ్చితంగా మిమల్ని మోసగిస్తున్నారని అర్థం చేసుకోండి.
- మీ అకౌంటుకు సంబంధించిన వివరాలను మీరు స్వయంగా బ్యాంకును సంప్రదించి తెలుసుకోండి తప్ప, సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకండి.

రూ. 1,299 లకే నోకియా 106 ఫీచర్ ఫోను విడుదల



HMD గ్లోబల్ కంపెనీ భారతదేశంలో ఒక కొత్త నోకియా బ్రాండ్ ఫోన్ను ప్రవేశపెట్టింది. ఈ సంస్థ 2019 ప్రారంభంలో ఈ కొత్త ఫీచర్ ఫోను విడుదల చేసింది. ఇది గత సంవత్సరం అనేక ఆండ్రాయిడ్ స్మార్ట్ ఫోన్లను విడుదల చేసింది. కొత్తగా మార్కెట్లో ప్రవేశపెట్టిన ఈ ఫోన్ పేరు నోకియా 106 (2018). ఈ ఫోన్ అమెజాన్ ఇండియా, ఫ్లిప్ కార్ట్ లలో లభిస్తుంది. సంస్థ అధికారిక వెబ్ సైట్ nokia.com లో కూడా జాబితా చేయబడింది. ఈ ఫోన్ ధర రూ .1299. ప్రస్తుతం ఉన్న జియోఫోన్ ధర కూడా ఇంతే ఉంది. ఇది 4 MB ఇంటర్నల్ మెమొరీని కలిగి ఉంది. 2000 ఫోన్ నెంబర్లు, 500 ఎస్ఎంఎస్ లను ఇందులో నిల్వ చేయవచ్చు. అలాగే ఈ ఫోన్లో నైట్రో రేసింగ్, డేంజర్ డాష్, Tetris, క్లాసిక్ స్నేక్ జంజియా గేమ్ కూడా అందుబాటులో ఉంది. ఇది ఒక 1.8 అంగుళాల QQVGA TFT డిస్ప్లేను కలిగి ఉంది. దీని పిక్సెల్ రిజల్యూషన్ 160X120 గా ఉంటుంది. ఒక మీడియా టెక్ MT6261D ప్రాసెసర్, 4 MB RAM కలిగి ఉంది. అలాగే డ్యూయల్ సిమ్ సపోర్ట్ చేస్తుంది. 800mAh బ్యాటరీ, ఛార్జింగ్ కోసం మైక్రో USB పోర్ట్ ఉంది. అదనంగా, 3.5mm హెడ్ఫోన్ జాక్, FM రేడియో, LED ఫ్లాష్ లైట్లు కూడా ఉన్నాయి.

వాట్సాప్‌లోనూ యూట్యూబ్..!

వాట్సాప్ మెసేజ్‌లలో వచ్చే యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వీడియోలను చూసేందుకు ఆయా యాప్‌లలోకి వెళ్లాల్సిన పనిలేకుండా వాట్సాప్‌లోనే చూసే విధంగా కొత్త ఫీచర్ అందుబాటులోకి వచ్చింది. ఈ ఫీచర్‌ను ‘పిక్చర్ ఇన్ పిక్చర్’గా పిలుస్తారు. ఇప్పటివరకు ఐఫోన్ వినియోగదారులకు మాత్రమే ఇది అందుబాటులో ఉండేది. ఇప్పుడు ఆండ్రాయిడ్ వినియోగదారులకు కూడా దీన్ని వాట్సాప్ చేరువ చేసింది. దీని కోసం యాప్‌ను అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. అనంతరం మెసేజ్‌లలో వచ్చే లింక్‌పై క్లిక్‌చేస్తే చిన్న బాక్స్‌లో నేరుగా వీడియోలు ప్లే అవుతాయి. కావాలంటే వీటిని మధ్యలో నిలిపివేయొచ్చు. ఈ బాక్స్‌ను తెరపై ఎటు కావాలంటే అటు జరుపుకోవచ్చు. వీడియో ప్లే అవుతుండగానే మెసేజ్‌లు కూడా పంపుకోవచ్చు. గ్రూప్ చాట్‌లలోనూ ఈ ఫీచర్ పనిచేస్తుంది.

రూ. 11 లకే 4G ఇస్తున్న మరో నెట్‌వర్క్

TELENOR మొబైల్ నెట్ వర్క్ కంపెని ఒకప్పుడు UNINOR. అయితే ఇది సిగ్నల్ వైజ్ గా ఎక్కువమందికి పెద్దగా పరిచయం లేదు. కాని కంపెని 4G సెగ్మెంట్ లోకి కూడా అడుగు పెట్టింది, ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో. ఇప్పుడు కంపెని 11 రూ లకు one day validity తో unlimited 4G ఇంటర్నెట్ ఇస్తుంది రోజంతా. ఇంకా 239 రూ లకు 6GB 4G ఇంటర్నెట్ ఇస్తుంది. దీనితో పాటు కొన్ని సెలెక్టెడ్ users కు telenor 57 రూ లకు 28 రోజుల validity తో 1 GB 4G డేటా ఆఫర్ అందిస్తుంది. 98 రూపాయలతో రీచార్జ్ చేస్తే 2GB, 28 డేస్ validity ఆఫర్ కూడా ఉంది. అయితే కేవలం కొన్ని ప్రాంతాల్లోనే నెట్ వర్క్ ఉండటం ఒకటే మైనస్ పాయింట్. స్పీడ్స్ విషయంలో కూడా telenor బాగుంది. TRAI నియమాల ప్రకారం ఇది స్పీడ్ విషయంలో 3 వ స్థానంలో ఉంది Jio, ఎయిర్టెల్ తరువాత. ఆంధ్రా తెలంగాణాతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఎక్కడ ఉంది. ఇతర సమాచారం కొరకు కంపెని అఫీషియల్ వెబ్ సైట్ లో చూడవచ్చు.

బీఎస్ఎన్ఎల్ కొత్త ప్లాన్

రిలయన్స్ జియో ఎంట్రీతోనే ఉచిత డేటాని అందిస్తూ అన్ని టెలికం కంపెనీలకు షాకిచ్చింది. తరువాత ప్రభుత్వ టెలికామ్ సంస్థ అయిన భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (BSNL) కొత్త ప్రకటనతో మిగిలిన అన్ని టెలికాం సంస్థలకు షాకిచ్చింది. ప్రస్తుతం తన 7 ప్రీపెయిడ్ ప్రణాళికల పైన రోజువారీ 2.21GB డేటా ఉచితంగా అందిస్తోంది. ఈ ప్రీపెయిడ్ ప్లానులన్నింటికీ కూడా ఈ అఫర్, 31 జనవరి 2019 వరకు అందుబాటులో ఉంటుంది.

Rs 186 ప్లాన్ – ముందుగా రోజువారీ 1GB ఇస్తుండగా, దీని పైన 2.21 GB డేటాని ఉచితంగా ఇస్తోంది. మొత్తంగా ఈ ప్లానుతో ఇపుడు రోజువారీ 3.21 GB, అన్లిమిటెడ్ కాలింగ్, అన్లిమిటెడ్ SMS (100/రోజుకి) ఇంకా 28 రోజుల వ్యాలిడిటీతో ఇస్తోంది. అంతేకాకుండా తన 7 ప్రీపెయిడ్ ప్రణాళికల పైన రోజువారీ 2.21 +దీ అధిక డేటాని ఉచితంగా అందిస్తోంది. BSNL ప్రీపెయిడ్ ప్రణాళికలైనటువంటి, Rs 186, Rs 429, Rs 485,Rs 666, Rs 999 వార్షిక ప్రీపెయిడ్ ప్లాన్స్ అయినటువంటి Rs 1699, Rs 2099 పైన కూడా ఈ 2.21 GB రోజువారీ అధిక డేటాని వర్తింపచేసింది. ముఖ్యంగా BSNL వార్షిక ప్రణాళికలైన Rs. 1699, 2099 లకి కూడా ఈ రోజువారీ 2.21 GB ని ముందు నుండే వర్తింపు చేసింది. ముందు నవంబరు 14 వ తేదీతో ఈ ప్రణాళికలు ముగుస్తుందని ప్రకటించినా, వీటిపైన వినియోగదారుల స్పందన అనుసరించి, ఈ వార్షిక ప్రణాళికలను 31, జనవరి 2019 వరకు అందుబాటులో ఉంచింది.



శాస్త్రీయత ఉందా?



నమ్మకాలు నిజాలు

ప్రశ్న: నూతన సంవత్సరాన్ని ఇంత హడావిడిగా, వినోదంగా జరపడంలో శాస్త్రీయత ఉందా?

- ఎం.జగన్మోహనరెడ్డి, వరంగల్.

జవాబు: నాగరిక సమాజంలో ప్రతిదాన్నీ శాస్త్రీయ దృక్కోణంతో చూడడంలో తప్పులేదుగానీ ప్రతీది శాస్త్రీయ సూత్రాలకు అనుగుణంగానే జరిగి తీరాలనుకోవడం అత్యాశే అవుతుంది. తద్వారా మనం ప్రజల మన్ననల్ని పొందలేము. సామాజిక ప్రగతికి, గమనానికి భంగం కలగనంత వరకు కొన్ని ఆచారాలను రాజ్యాంగం ఆమోదిస్తుంది. వైజ్ఞానిక పరిభాషలో చెప్పాలంటే జనవరి 1వ తేదీకీ, అక్టోబర్ 29వ తేదీకి, మరో ఇతర తేదీకి తేడాలేదు. ఋతువులను బట్టి కూడా కచ్చితంగా ప్రతి సంవత్సరం జనవరి నెల ఒకటవ తేదీనాడు ఈ భూమ్మీద ఒకే విధమైన వాతావరణ పరిస్థితులుంటా యనడానికి లేదు. అంతెందుకు? సుమారు 10 వేల సంవత్సరాల క్రితం భూమ్మీద ఇపుడున్న పరిస్థితులకు పూర్తి వ్యతిరేక పరిస్థితులు ఉండేవి. అంటే భారతదేశం వంటి దేశాల్లో మే, జూన్ నెలల్లో విపరీతమైన చలి ఉండేది. డిసెంబర్, జనవరి నెలల్లో వేసవికాలం ఉండేది. ఇపుడు మనం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో చలి కాలాన్ని చవిచూస్తున్నాము. మొన్నమొన్నటి వరకు మే, జూన్ నెలల్లో విపరీతమైన మండు వేసవికి తట్టుకొన్నాం. కానీ సుమారు 10 వేల సంవత్సరాల తర్వాత పదివేల సంవత్సరాల క్రితం ఉన్న పరిస్థితులే పునరావృతం అవుతాయి. అంటే 2019 సంవత్సరం దరిదాపుల్లో మన తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు ఫిబ్రవరి, మార్చి నెలల్లో కురుస్తాయి. డిసెంబర్, జనవరి నెలలో వేసవి ఉంటుంది. ఏప్రిల్, మే, జూన్ వంటి నెలల కాలంలో విపరీతమైన చలితో ఉంటాము. ఋతువులు, ఉష్ణోగ్రతా పీడన పరిస్థితులు పంటలు, మామిడి పండ్ల కాలం మారుతుంది. తెలుగు సంవత్సరాది, తమిళ సంవత్సరాది, ఆంగ్ల సంవత్సరాది సుమారు ప్రతి 12 నెలలకోసారి పునరావృత మవుతున్నా అవి క్యాలెండర్ ప్రకారమేగానీ ఋతువుల కనుగుణంగా కాదనీ ఇట్టే తెలిసిపోతుంది. నిన్న మొన్న జనవరి 1 వ తేదీన మనం భారత కాలమాన ప్రకారం డిసెంబర్ 31 రాత్రి 12 గంటలు (అర్ధరాత్రి) దాటిన వెంటనే నూతన సంవత్సరంగా జరుపుకొన్నాము. కానీ మన దేశంలో డిసెంబర్ 31 సాయంత్రం 6 గంటలు అవుతుండగా అప్పటికే న్యూజిలాండ్ దేశ ప్రజలు నూతన సంవత్సరాన్ని జరిపేసుకొన్నారు. మనం జనవరి 1వ తేదీ ఉదయాన్నే స్నేహితులకు, బంధువులకు, మిత్రులకు, అధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకొని హడావిడి చేశాం. కానీ మన అమెరికా బంధువులకా సమయం ఇంకా డిసెంబర్ 31 రాత్రి 12 గంటలు దాటలేదు. కాలిఫోర్నియా వంటి రాష్ట్రాల్లో మనం జనవరి 1 వ తేదీ మధ్యాహ్నం 2 గంటల సమయంలో వారికి జనవరి 1వ తేదీ ప్రారంభమయ్యింది. (అంటే డిసెంబర్ 31 అర్ధరాత్రి దాటింది). ప్రపంచ దేశాల్లో 30 నిముషాల వ్యవధిలో ఆయా దేశాల గడియారాలు నడుస్తున్నాయి. అంటే న్యూజిలాండ్‌లో అర్ధరాత్రి దాటి గడియారం 00.00 చూపిస్తుండగా, ఆ క్రితపు రోజు రాత్రి పదిగంటలు (22.00గా) ఆస్ట్రేలియా దేశంలో గడియారం చూపిస్తుంది. మన దేశంలో ఆ క్రితపురోజు సాయంత్రం 5 గంటలై ఉంటుంది. కానీ కాలిఫోర్నియాలో ఆ క్రితపురోజు ప్రారంభమవుతుంటుంది. ఇలా వివిధ దేశాలు వివిధ కాలాలు జరుపుకొనే నూతన సంవత్సరాదికి శాస్త్రీయతంటూ, వైజ్ఞానికతంటూ ఏమీ లేదు. ఇది కేవలం ఆచారం. మా అబ్బాయి డిసెంబర్ 1న రాత్రి 11 గంటలకు పుట్టాడు. వాడు అమెరికాలో తన పుట్టినరోజును మన 2వ తేదీకి జరుపుకొంటున్నాడు, తేదీ కుదరాలి కాబట్టి. ఇదే క్యాలెండర్ తమాషా!



ప్రొఫెసర్
ఎ. రామచంద్రయ్య
సంపాదకులు, చెకుముకి,
జన విజ్ఞాన వేదిక

డియర్ రీడర్స్..

టెక్నాలజీపరంగా మీరేదైనా సమస్యను ఎదుర్కొన్నారా.. దానిని మీరెలా పరిష్కరించారు..? ఇలాంటి అనుభవాలేమైనా ఉంటే మాకు రాసి పంపండి. మా చిరునామా : ‘టెక్‌ప్లస్’ పేజీ, నవ తెలంగాణ దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ఫ్లాట్ నెం. 21/1, ఆజమాబాద్, ఆర్.టి.సి కల్యాణ మండపం వీధి, హైదరాబాద్ - 500020.

tech+@navatelangana.com



1 ఆ్రస్టేలియాలో శతకం బాదిన తొలి భారత వికెట్ కీపర్ రిషబ్ పంత్. 1967లో ఫరూక్ ఇంజినీర్ సాధించిన 89 పరుగులే ఇప్పటివరకూ అత్యధికం. సిడ్నీలో పంత్ చరిత్ర తిరగ రాశాడు.

2 పిన్న వయసులోనే రెండు టెస్టు శతకాలు సాధించిన ఏకైక క్రికెటర్ రిషబ్ పంత్. 21 ఏండ్లలో పంత్ ఇంగ్లాండ్‌లో, ఆ్రస్టేలియాలో ఆతిథ్య జట్లపై శతక బాదాడు.

1258

తాజా సిరీస్‌లో పుజార ఎదుర్కొన్న బంతులు 1258. నాలుగు, అంతకంటే తక్కువ టెస్టుల్లో రిచర్డ్‌సన్ (విండీస్) భారత్‌పై 1358 బంతులాడి అగ్రస్థానంలో ఉన్నాడు. 2002లో ఇంగ్లాండ్‌పై రాహుల్ ద్రవిడ్ 1336 బంతులతో, అలెస్టర్ కుక్ 2012-13లో భారత్‌పై 1285 బంతులతో తర్వాత స్థానాల్లో ఉన్నారు. ఈ జాబితాలో పుజార నాల్గో స్థానంలో నిలిచాడు.

8

టెస్టుల్లో 190ల్లో అవుటైన ఎనిమిదో భారత బ్యాట్స్‌మన్ పుజార. ఆస్ట్రేలియాపై సెహ్వాగ్ తర్వాత ద్వి శతకం ముందు వికెట్ కోల్పోయిన రెండో బ్యాట్స్‌మన్. 2003 మెల్‌బోర్న్‌లో సిక్సర్ కోసం వెళ్లిన వీరూ క్యాచౌట్ కాగా, పుజార డ్రైవ్ చేసి డబుల్ మిస్సయ్యాడు.

చిన్నోడు చితకబాదాడు

- అజేయ 159తో చెలరేగిన రిషబ్ పంత్
- ఆసీస్‌లో శతకబాదిన తొలి వికెట్‌కీపర్
- ద్వి శతకం చేజార్చుకున్న పుజార
- అర్ధ సెంచరీతో మెరిసిన జడేజా
- భారత్ తొలి ఇన్నింగ్స్ 622/7 డిక్లేర్డ్



పెద్దోడికి చిన్నోడు తోడయ్యాడు. పెద్దోడి మెరుపులతో సిడ్నీలో వెనుకంజ వేసిన ఆతిథ్య ఆ్రస్టేలియా, చిన్నోడు చితకబాదగా సిడ్నీపై ఆశలు వదులుకున్నట్టే!. సంప్రదాయ డిఫెన్స్‌తో మొదలెట్టి, టీ20 విన్యాసాలతో విరుచుకుపడిన రిషబ్ పంత్ (159 నాటౌట్) ఆ్రస్టేలియాలో సెంచరీ చేసిన తొలి భారత వికెట్ కీపర్‌గా రికార్డు నెలకొల్పాడు. పుజార (193) ద్వి శతక అవకాశం చేజార్చుకోగా, రవీంద్ర జడేజా (81) అర్ధ సెంచరీతో పంత్ తోడుగా వీర విహారం చేశాడు. పుజార, పంత్, జడేజా మెరుపులతో తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 622/7 పరుగుల భారీ స్కోరు సాధించింది. డిక్లరేషన్ కాస్త ఆలస్యం చేసినా, సిడ్నీ టెస్టుపై కోహ్లిసేన పట్టు బిగించింది. ఇక సిడ్నీలో రెండో అవకాశాలు.. భారత్ విజయం లేదంటే డ్రా!.

సిడ్నీ (ఆ్రస్టేలియా)

సిడ్నీ టెస్టుపై కోహ్లిసేన తిరుగులేని పట్టు సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు సాధించి, బలమైన స్థితిలో నిలిచింది. యువ వికెట్ కీపర్ రిషబ్ పంత్ (159 నాటౌట్, 189 బంతుల్లో 15 ఫోర్లు) భారీ శతకంతో చెలరేగాడు. రవీంద్ర జడేజా (81, 114 బంతుల్లో 7 ఫోర్లు, 1)తో కలిసి ఏడో వికెట్‌కు 204 పరుగుల రికార్డు భాగస్వామ్యాన్ని నెలకొల్పిన పంత్, ఆ్రస్టేలియా బౌలర్లపై ఆధిపత్యం చెలాయించాడు. టెస్టు స్పెషలిస్ట్ చతేశ్వర్ పుజార (193, 373 బంతుల్లో 22 ఫోర్లు) ద్వి శతకానికి ఏడు పరుగుల దూరంలో వికెట్ కోల్పోయాడు. తెలుగు తేజం హనుమ విహారి (42, 96 బంతుల్లో 5 ఫోర్లు) ఓవర్‌నైట్ స్కోరుకు మూడు పరుగులే జోడించాడు. ఆసీస్ బౌలర్లలో స్పిన్నర్ నాథన్ లైయాన్ (4/178), జోశ్ హజెల్‌వుడ్ (2/105) రాణించారు. రెండో రోజు చివరి సెషన్లో పది ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసిన ఆ్రస్టేలియా తొలి ఇన్నింగ్స్‌లో 24/0తో కొనసాగుతున్నది. ఓపెనర్లు మార్కస్ హారీస్ (19), ఉస్మాన్ ఖవాజ (5)లు అజేయంగా ఆడుతున్నారు. నేడు భారత బౌలర్ల ప్రదర్శనపై సిడ్నీ టెస్టు ఫలితం ఆధారపడింది. వికెట్ల వేట జోరుగా సాగితే కోహ్లిసేన విజయం, ఆసీస్ బ్యాట్స్‌మెన్ ప్రతిఘటిస్తే డ్రా దిశగా పయనం!. నేటి 90 ఓవర్ల ఆట సిడ్నీను ఎటు తీసుకెళ్తుందో చూడాలి.

పుజార, పంత్ విహారం : ఓవర్‌నైట్ స్కోరు 303/4తో రెండో రోజు బ్యాటింగ్ మొదలెట్టిన భారత్ ఆరంభంలోనే హనుమ విహారి (42) వికెట్ కోల్పోయింది. మరో మూడు పరుగులే జోడించిన లైయాన్‌పై స్వీప్ షాట్‌కు ప్రయత్నించి షార్ట్ లెగ్‌లో క్యాచౌట్ అయ్యాడు. అజేయ శతకంతో క్రీజులోకి వచ్చిన పుజార వేగంగా పరుగులు రాబట్టాడు. స్ట్రయిట్ డ్రైవ్‌లకు ప్రాధాన్యత ఇచ్చిన పుజార తొలి సెషన్లో ఎదుర్కొన్న 82 బంతుల్లో 51 పరుగులు పిండుకున్నాడు. విహారి నిష్క్రమణతో క్రీజులోకి వచ్చిన పంత్ విచిత్రంగా పుజార శైలిలో బ్యాటింగ్ చేశాడు. అప్పటికే భారత్‌కు మెరుగైన స్కోరు సాధించింది, పంత్ స్వేచ్ఛగా బ్యాట్ ఝులిపిస్తే అందరికీ సంతోషమే. కానీ పంత్ కొత్త ఏడాదిలో సహనం చూపించాడు. పుజార తోడుగా పుజార మాదిరి ఆడాడు. పంత్ తానెదుర్కొన్న తొలి 100 బంతుల్లో కేవలం ఐదింటినే గాల్లోకి లేపాడు. విలక్షణ, విధ్వంసక షాట్లతో విరుచుకుపడే పంత్ ఇంత సహనంతో ఆడటం బహుశా ఇదే తొలిసారి కాబోలు!. వడివడిగా ద్వి శతకం దిశగా కదిలిన పుజార... చివరి నిమిషంలో మనసు మార్చుకుని లైయాన్ బంతిని స్ట్రయిట్‌గా ఆడాడు. తక్కువ ఎత్తులో వచ్చినా, వడిసిపట్టుకున్న లైయాన్ భారత స్టార్ డబుల్ శతకాన్ని అడ్డుకున్నాడు. పుజార నిష్క్రమణ సమమానికి భారత్ స్కోరు 418/6.

521

ఆ్రస్టేలియాపై ఓ సిరీస్ అత్యధిక పరుగులు చేసిన భారత ఆటగాళ్ల జాబితాలో పుజార మూడో స్థానంలో ఉన్నాడు. 2014-15లో కోహ్లి 692, 2003-04లో ద్రవిడ్ 619 పరుగులతో ముందున్నారు.

జడ్డూతో కలిసి విశ్వరూపమే :

రవీంద్ర జడేజా (81)తో కలిసి పంత్ ఏడో వికెట్‌కు రికార్డు భాగస్వామ్యం నమోదు చేశాడు. ఆ్రస్టేలియాలో ఏడో వికెట్‌కు ఏ జోడీ 204 పరుగులు జోడించలేదు. కేవలం 224 బంతుల్లో జడేజా, పంత్ జోడీ ద్వి శతక పరుగులు పిండుకున్నది. పుజార జతగా తొలి అర్ధ సెంచరీకి 85 బంతుల్ని తీసుకున్న పంత్, తర్వాతి 50 పరుగులకు జడేజా తోడుగా 52 బంతుల్నే ఆడాడు. 8 ఫోర్లతో కెరీర్ రెండో శతకం బాదిన పంత్, తర్వాత విశ్వరూపమే ప్రదర్శించాడు. 15 ఫోర్లు, ఓ సిక్సర్‌తో ఆసీస్ బౌలర్లపై విరుచుకు పడ్డాడు. మరో ఎండ్‌లో జడేజా సైతం చెలరేగాడు. 8 ఫోర్ల సాయంతో అర్ధ సెంచరీ సాధించిన జడేజా..లైయాన్‌పై ముందుకొచ్చి ఆడిబోయి క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. రిషబ్ పంత్ ద్వి శతకంపై ఆసక్తి నెలకొన్నా.. జడేజా వికెట్‌తో కెప్టెన్ కోహ్లి 622/7 వద్ద ఇన్నింగ్స్ డిక్లరేషన్ ప్రకటించాడు.

ఖవాజ బతికిపోయాడు :

భారత బ్యాట్స్‌మెన్ జోరుతో చితికిపోయిన ఆ్రస్టేలియాకు మరింత నష్టం జరిగేలా కనిపించినా.. ఆ జట్టు పది వికెట్లతో నేడు బరిలోకి దిగనున్నది. మహ్మద్ షమి వేసిన ఇన్నింగ్స్ మూడో ఓవర్లో ఉస్మాన్ ఖవాజ (5) ఇచ్చిన స్ట్రయిట్ క్యాచ్‌ను రిషబ్ పంత్ నేలపాలు చేశాడు. దీంతో ఆసీస్ వికెట్లేమీ కోల్పోకుండా రెండో రోజును ముగించింది. మార్కస్ హరిస్ (19)తో కలిసి ఖవాజ అజేయంగా ఆడుతున్నాడు.



భారత్ తొలి ఇన్నింగ్స్ : మయాంక్ అగర్వాల్ (సి) స్టార్క్ (బి) లైయాన్ 77, కెఎల్ రాహుల్ (సి) షాన్ మార్ష్ (బి) హజెల్‌వుడ్ 9, చతేశ్వర్ పుజార (సి,బి) లైయాన్ 193, విరాట్ కోహ్లి (సి) పైన్ (బి) హజెల్‌వుడ్ 23, అజింక్య రహానె (సి) పైన్ (బి) స్టార్క్ 18, హనుమ విహారి (సి) మార్నస్ (బి) లైయాన్ 42, రిషబ్ పంత్ నాటౌట్ 159, రవీంద్ర జడేజా (బి) లైయాన్ 81, ఎక్స్‌ట్రాలు :20, **మొత్తం :(167.2 ఓవర్లలో 7 వికెట్లకు) 622 డిక్లేర్డ్.**

వికెట్ల పతనం : 1-10, 2-126, 3-180, 4-228, 5-329, 6-418, 7-622.

బౌలింగ్ : మిచెల్ స్టార్క్ 26-0-123-1, హజెల్‌వుడ్ 35-11-105-2, పాట్ కమిన్స్ 28-5-101-0, లైయాన్ 57.2-8-178-4, మార్నస్ 16-0-76-0, ట్రావిశ్ హెడ్ 4-0-20-0, ఖవాజ 1-0-4-0.

ఆ్రస్టేలియా తొలి ఇన్నింగ్స్ : మార్కస్ హరీస్ బ్యాటింగ్ 19, ఉస్మాన్ ఖవాజ బ్యాటింగ్ 5, **ఎక్స్‌ట్రాలు :** 0, మొత్తం : (10 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) 24.

బౌలింగ్ : మహ్మద్ షమి 3-0-9-0, జస్‌ప్రీత్ బుమ్రా 3-0-12-0, రవీంద్ర జడేజా 2-1-1-0, కుల్దీప్ యాదవ్ 2-1-2-0.

204

ఏడో వికెట్‌కు జడేజా, రిషబ్ పంత్ నెలకొల్పిన భాగస్వామ్యం 204. ఆ్రస్టేలియాలో ఏడో వికెట్‌కు ఏ జట్టుకైనా, ఏ గ్రౌండ్‌లోనైనా ఇదే అత్యధికం.

పుజారకు ప్రమోషన్?

- ఏడు కోట్ల కాంట్రాక్ట్‌పై సీవోఏ దృష్టి
- త్వరలోనే అధికారిక నిర్ణయం

ముంబయి : టెస్టు స్పెషలిస్ట్ చతేశ్వర్ పుజార అద్భుత ప్రదర్శనకు బీసీసీఐ తగు రీతిలో ప్రోత్సాహకం అందించేందుకు సిద్ధమవుతోంది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో మూడు శతకాలు బాదిన పుజార, కంగారూ గడ్డపై తొలి సారి సిరీస్ నెగ్గేందుకు మార్గం సుగమం చేశాడు. సంప్రదాయ క్రికెట్ నైపుణ్యం కారణంగా ఐపీఎల్ ఫ్రాంఛైజీలకు దూరమైన పుజారకు వార్షిక కాంట్రాక్టులో ఏ ప్లస్ గ్రేడ్ ఇచ్చేందుకు పాలకుల కమిటీ చైర్మన్ వినోద్ రాయ్ మొగ్గుచూపున్నట్టు బీసీసీఐ అధికారి ఒకరు వెల్లడించారు. పుజార ప్రదర్శనకు బహుమానం ఇవ్వటంతో పాటు టెస్టు క్రికెట్ ప్రాధాన్యత యువ క్రికెటర్లకు అర్థమయ్యేలా చేసినట్టు అవుతుందని రాయ్ ఆలోచనగా తెలుస్తోంది. ప్రస్తుతం ఏ ప్లస్ విభాగంలో కెప్టెన్ విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, శిఖర్ ధావన్‌లతో పాటు సీమర్లు బుమ్రా, భువనేశ్వర్‌లు ఉన్నారు. మూడు ఫార్మాట్లలో ఆడే క్రికెటర్ల కోసమే ఏ ప్లస్ విభాగమని కాంట్రాక్టుల సందర్భంగా బోర్డు తెలిపింది. పుజార ప్రస్తుతం ఏ గ్రేడ్‌లో కొనసాగుతున్నాడు. ఏ ప్లస్ ఆటగాళ్లకు ఏడాదికి రూ. 7 కోట్లు, ఏ విభాగం క్రికెటర్లకు రూ. 5 కోట్లు లభిస్తున్నాయి. ' సెలక్షన్ కమిటీ చైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్, జట్టు మేనేజ్‌మెంట్ (కెప్టెన్ కోహ్లి, కోచ్ రవిశాస్త్రి)లతో చర్చించి, పుజార కోసం ఏ ప్లస్ మూడు ఫార్మాట్ల ఆడే ఆటగాళ్ల నిబంధన సడలించటంపై రాయ్ చర్చిస్తారు. తర్వలోనే నిర్ణయం ఉంటుంది' అని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు. వినోద్ రాయ్ ఆలోచనపై అప్పుడే క్రికెట్ వర్గాల్లో సానుకూల స్పందన లభిస్తోంది.

మా మధ్య విభేదాలు లేవు

- మిథాలీతో బంధంపై హర్మన్‌ప్రీత్



ముంబయి : 2018 భారత మహిళల క్రికెట్‌కు మరో స్థాయికి తీసుకెళ్లిన ఏడాది. కానీ ఆఖర్లో దిగ్గజ క్రికెటర్ మిథాలీరాజ్‌ను తుది జట్టు నుంచి తప్పించి అనవసర వివాదాలకు చోటిచ్చిన ఘటనే ఈ ఏడాదిని గుర్తు చేస్తోంది. వివక్ష చూపిన కోచ్ వెళ్లిపోయాడు, డబ్ల్యూ వీ రామన్ రూపంలో కొత్త కోచ్ వచ్చాడు. త్వరలోనే మహిళల జట్టు న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లనున్నది. ఈ నేపథ్యంలో వన్డే కెప్టెన్ మిథాలీరాజ్, టీ20 కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మధ్య బంధం ఎలా ఉంటుందనే ఆసక్తి నెలకొన్నది. మహిళల బిగ్‌బాష్ లీగ్‌లో సిడ్నీ థండర్స్‌కు ఆడుతున్న హర్మన్‌ప్రీత్ కౌర్.. భారత్, ఆ్రస్టేలియా చివరి టెస్టు చూసేందుకు స్టేడియానికి వచ్చింది. ఈ సందర్భంగా మిథాలీతో బంధంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ' ఐసీసీ టీ20 జట్టు కెప్టెన్‌గా ఎంపికవటం ఆనందంగా ఉంది. నిజానికి ఈ గౌరవం ఊహించలేదు. 2010 తర్వాత టీమ్ ఇండియా తొలిసారి టీ20 ప్రపంచకప్ సెమీస్‌కు చేరటం సంతోషించదగిన విషయం. అంతిమంగా, అందరం భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాం. వ్యక్తిగతంగా ఎవ్వరూ జట్టు కంటే ఉన్నతం కాదు. మిథాలీరాజ్‌తో నాకు ఎటువంటి సమస్యలు లేవు. నాతో ఆమెకు ఏమైనా ఉంటే అది ఆమెనే అడగాలి. మా మధ్య ఎవరో మధ్యవర్తిత్వం చేసేంత అగాధం ఎంత మాత్రం లేదు. ఏమైనా ఉన్నా, మేమిద్దరం కూర్చోని మాట్లాడుకోగలం. సీనియర్ క్రికెటర్‌గా మిథాలీ రాజ్‌పై ఎప్పుడూ గౌరవం ఉంటుంది. గతంలో వన్డే ఫార్మాట్‌లో భారత్ మెరుగ్గా ఆడింది. కానీ ఇప్పుడు టీ20ల్లోనూ రాణిస్తున్నాం. మహిళల క్రికెట్‌లో వచ్చిన మార్పుల్లో ఇదొకటి. కొత్త కోచ్ రామన్‌ను నేషనల్ క్రికెట అకాడమీలో పలుసార్లు కలిశాను. రామన్ శిక్షణ శైలి, క్రికెటింగ్ మేధస్సుపై ఇతర క్రికెటర్లు చెప్పగా విన్నాను. ఆయన అనుభవం జట్టుకు ఉపయోగపడుతుందని భావిస్తున్నాను' అని హర్మన్‌ప్రీత్ కౌర్ తెలిపింది.

కొత్త చాంపియన్ ఎవరో?

- తొలి టైటిల్ వేటలో గుజరాత్, బెంగళూర్
- నేడు ప్రొ కబడ్డీ టైటిల్ పోరు

ముంబయి : గత మూడు సీజన్లుగా ఒకే చాంపియన్‌ను చూస్తోన్న ప్రొ కబడ్డీ లీగ్‌కు నేడు కొత్త చాంపియన్ రానున్నది. డిఫెండింగ్ పట్నా పైరేట్స్‌కు రెండో సీజన్‌లో టైటిల్ కోల్పోయిన బెంగళూర్ బుల్స్, గత సీజన్‌లో టైటిల్ కోల్పోయిన గుజరాత్ ఫార్చ్యూన్‌జెయింట్స్‌లు నేడు తొలి టైటిల్ వేటలో ముఖాముఖి ఢీకొట్టేందుకు సిద్ధమయ్యాయి. క్వాలిఫయర్-1లో గుజరాత్‌ను ఓడించి ఫైనల్స్‌కు చేరిన బుల్స్ ఆత్మవిశ్వాసంతో కనిపిస్తోంది. క్వాలిఫయర్‌లో యూపీ యోధను చిత్తు చేసిన గుజరాత్ అంతిమ సమరానికి వచ్చేసింది. డిఫెన్స్‌లో అత్యుత్తమ జట్టు గుజరాత్, ఎటాకింగ్‌లో అత్యుత్తమ జట్టు బెంగళూర్‌లు ఫైనల్లో తేల్చుకోనుండటం ఆసక్తికరం. డిఫెండర్ పర్వేశ్ బైంస్వాల్ గుజరాత్‌కు కీలకం కానున్నాడు. సగటున 6.8 టాకిల్స్‌తో పర్వేశ్ జోరుమీదున్నాడు. రైడర్ పవన్ షెరావత్ సీజన్‌లో 249 రైడ్ పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. కెప్టెన్ రోహిత్ కుమార్ స్మార్ట్ ఆట తీరు, ఆటగాళ్ల వినియోగం బుల్స్‌కు కలిసొచ్చే అంశం. టైటిల్ పోరు నేడు రాత్రి 8 గంటలకు ముంబయిలో మొదలు కానున్నది. గుజరాత్, బెంగళూర్‌లో ఎవరు నెగ్గినా ప్రొ కబడ్డీకి కొత్త చాంపియన్ రావటం ఖాయం.



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.